# రామాయణగాథలు - మహిళలు

రచన

**కోలవెన్ను మలయవాసిని**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2024**

# RAMAYANAGATHALU - MAHILALU

By
**Kolavennu Malayavasini**

*Editor*
**Dr. Akella Vibhishana Sarma**
Special Officer
Publications Division

T.T.D. Religious Publications Series No. 1492
© All Rights Reserved

*First Edition :* 2024

*Copies :* 500

*Price :*

*Published by*
**Sri J. Syamala Rao,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందుమాట

వేదభాష అతిప్రాచీనమైనది. వేదవిజ్ఞానరహస్యాలను తెలుసు-కోవడానికి ఇతిహాసపురాణాలను అధ్యయనం చేయడం ఎంతో అవసరం. సంస్కృతసాహిత్యంలో వెలువడిన దృశ్య, శ్రవ్య, కావ్యాలన్నింటికి రామాయణ, మహాభారతాలే ప్రముఖపాత్రను వహిస్తున్నాయి. రామాయణం భారతీయవాఙ్మయానికి తలమానికమై, ఆర్యసభ్యతకు పట్టుగొమ్మగా ఉంది. మహాభారతానికి ఇతిహాసముగా గుర్తింపు వచ్చింది కాని కావ్యంగా రాలేదు. కాని వాల్మీకిరామాయణానికి ఇతిహాసంగానే కాక ఆదికావ్యంగా కూడా అంతులేని గౌరవం దక్కింది.

ఆదికవి వాల్మీకి రచించి మధురంగా గానం చేసిన కుటుంబగాథా కావ్యం రామాయణం. రామాయణంలో మర్యాదాపురుషోత్తముడైన శ్రీరామచంద్రుని దివ్యలీలలు వర్ణింపబడినాయి. మానవతావిలువలతో నిండిన ఆదికావ్యం. వాల్మీకి సృష్టించిన ప్రతిపాత్ర ఎంతో ప్రయోజనాన్ని కలిగి ఉంటుంది. ఈ రామాయణాన్ని 'సీతాయాః చరితమ్ మహత్' అని వాల్మీకి గౌరవించాడు. ఇందులోని మహిళాపాత్రలు ఎంతో ఉజ్జ్వలంగా తీర్చబడినారు. ఈ కావ్యవస్తువును ముందుకు నడిపించిన వారంతా మహిళలే కావడం విశేషంగా చెప్పుకోదగినది.

రామావతారప్రయోజనమే రావణసంహారం. దీనికి సహకరించిన వారు మంథర, కైకలు. సీతాపహరణకు, రాక్షససంహారానికి కారకులు శూర్పణఖ, తాటకలు. రామపాదమహత్వాన్ని లోకానికి తెలియజేసింది అహల్య.

ప్రస్తుత అంశమైన రామాయణగాథలు-మహిళలు సందర్భంగా మహిళామణులైన కేశిని, సుమతి, కౌసల్య, సుమిత్ర, కైక, మంథర, శాంతాదేవి, సీతాదేవులు అయోధ్యావాసులుగా, తార, రుమలు

వానరాంగనలుగా, సత్యవతి, సోమద, అహల్య, అనసూయ, శబరులు తపస్వినులుగా, స్వయంప్రభ, సురసలు దేవకాంతలుగా, తాటక, శూర్పణఖ, అయోముఖి, సింహికలు రాక్షసస్త్రీలుగా లంకిణి, ధాన్యమాలిని, త్రిజట, సరమ, మండోదరులు లంకావాసులుగా పేర్కొనబడ్డారు.

రామలక్ష్మణభరతశత్రుఘ్నుల జననానికి కారణమైన దంపతులుగా శాంతా, ఋష్యశృంగులు, ఉత్తమ మాతృమూర్తిగా కౌసల్య, అన్నదమ్ముల అన్యోన్యతే కుటుంబజీవనానికి మూలస్తంభమని బోధించిన తార, స్వర్గం కంటె లోకహితమే శ్రేష్ఠమన్న సత్యవతి, స్త్రీలకు జరిగే అన్యాయాన్ని రూపుమాపడానికి కుమారుని విశిష్టవ్యక్తిగా తీర్చిదిద్దిన తల్లిగా సోమద, రామనామస్మరణే సర్వదోషనాశిని అని తేల్చిచెప్పిన అహల్య, సకలలోక హితైషిణిగా అనసూయ, మహర్షుల సేవే ముక్తికి మార్గమని చాటిచెప్పిన శబరి, హనుమను దేవకార్యార్థం పరీక్షించి సఫలీకృతురాలైన సురస, హనుమసమయస్ఫూర్తిని లోకానికి తెలియజేసిన సింహిక, రావణ వినాశాన్ని ముందుగానే చెప్పిన లంకిణి, వీరమాతగా పతివ్రతల స్థానంలో సీతతో పాటు స్థానం సంపాదించిన మండోదరులు ఇందులో వర్ణింపబడ్డారు.

రామాయణమహిళలుగా పేర్కొన్న వీరంతా వారివారి పాత్రౌచిత్యాన్ని చక్కగా నిర్వర్తించారు. రామాయణానుసారిగా మార్చి 'రామాయణగాథలు–మహిళలు' గా మలిచి, తిరుమల తిరుపతి దేవస్థానానికి అందించిన శ్రీమతి కోలవెన్ను మలయవాసినిగారిని అభినందిస్తూ, వారికి వారి కుటుంబానికి దేవదేవుడైన శ్రీనివాసుని అనుగ్రహం కలగాలని అభిలషిస్తూ...

సదా శ్రీవారిసేవలో...

**కార్యనిర్వహణాధికారి,**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# మనవి

శ్రీమద్రామాయణం భారతదేశ సాంస్కృతికసమైక్యతకు దోహదం చేస్తున్న మహాకావ్యం. మహాకవి ఆదికవి అయిన వాల్మీకిమహర్షి మధురంగా గానం చేసిన కుటుంబగాథాకావ్యమిది. రామాయణ మహాకావ్యం మానవతావిలువలను నింపుకున్న సువర్ణపేటిక. మాక్స్‌ముల్లర్ అనే పాశ్చాత్యపండితుడు రామాయణంలో వర్ణింపబడిన మానవతావిలువలను గమనించి ముగ్ధుడై భారతదేశాన్ని The land of Ramayana అనీ The land of Valmiki అనీ కీర్తించాడు.

అట్టి రామాయణకథాఘట్టాలలో మహిళలను గురించి వివరించే చిన్న రచన ఇది. రామాయణంలోని పాత్రలన్నీ మహనీయమైనవే. మహాకవి ఏ పాత్రను సృష్టించినా దానికో ప్రయోజనం ప్రతిపత్తి తప్పకుండా ఉంటాయి. అయితే రామాయణంలోని మహిళలు మరింత ఉజ్జ్వలమూర్తులుగా తీర్చిదిద్దబడ్డారు. రామాయణాన్ని 'సీతాయాః చరితమ్ మహత్' అని కూడా వాల్మీకి సంభావించి గౌరవించాడు. ఈ మహాకావ్యంలో కథను ముందుకు నడిపినవారు మహిళలే కావడం విశేషం.

బాలకాండలో ఋష్యశృంగుని అంగదేశానికి తీసుకుని వచ్చిన వారు వారవనితలు. దశరథమహారాజు నిర్వహించే యజ్ఞవేదికను అలంకరించినది ఆడపడుచుస్థానంలో శాంతాదేవి.

రామావతారప్రయోజనం రాక్షససంహారం. ఆ సంహారక్రీడకు రాముని వనవాసం తప్పనిసరి. ఆ కార్యానికి నిందలు భరించి కథను ముందుకు నడిపినవారు మంథర, కైకలు.

రాక్షససంహారానికి నాంది పలికించింది తాటక. సీతాపహరణకు బీజం వేసినది శూర్పణఖ.

రామపాదస్పర్శకు గల మహత్త్వాన్ని లోకానికి తెలియజేసినది అహల్య. అంగరాగాలిచ్చి సీతను ఆదరించినది సతీ అనసూయ. సీతాన్వేషణలో తిండితిప్పలూ లేక తిరుగాడే రామలక్ష్మణులకు రుచికరమైన పండ్లతో విందుచేసి, సుగ్రీవునితో సఖ్యం చేయమని దారి

చూపినది శబరి. మానవలోకకల్యాణం కోసం స్వర్గాన్ని కాదని నదిగా మారినది సత్యవతి. కాముకునిచే అంగవైకల్యం పొందిన కన్యకామణులను వివాహమాడే సంస్కారం ఇచ్చి పెంచినతల్లి సోమద.

సీతాన్వేషణలో దారీ తెన్ను తెలియని హనుమదాదులను గట్టెక్కించి సంపాతిసమీపానికి చేర్చినది స్వయంప్రభ.

సీతను సంహరించకుండా నిలువరించినది రావణపత్ని ధాన్యమాలిని, సీత జీవితంమీద ఆశవిడనాడిన సందర్భంలో ధైర్యం చేకూర్చినది త్రిజట, సరమలు, రాక్షసులయినా సద్వర్తన గలిగిన మహిళామణులు.

తమ భర్తలు నడుస్తున్న మార్గం తప్పనీ తప్పుసరిదిద్దుకోమని ఎంతగానో చెప్పిన వివేకవతులు వాలి భార్య తార, రావణుని భార్య మండోదరి.

ఇలా రామాయణంలోని రమణీమణుల రమణీయగాథలు నానేర్చిన తీరులో వివరించే అవకాశం కూర్చిన సీతారాములకు శిరస్సువంచి నమస్కరిస్తున్నాను.

ఈ మహిళామణుల వరుసక్రమం కూర్చడంలో నేను అయోధ్యావాసులు, వానరాంగనలు, తపస్వినులు, దేవకాంతలు, రాక్షసులు, లంకావాసులు అనే ఆరు ఉపశీర్షికలలో కూర్చాను. ఈ నా రచన వాల్మీకిరామాయణానుసారిగా సాగింది.

ఈ రచన చేసే సువర్ణావకాశం కల్పించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగ అధికారులు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మగారికి నా కృతజ్ఞతాభివందనాలు.

నా సందేహాలకు ఓపికతో సమాధానాలు చెప్తూ ప్రోత్సాహం అందించిన డా. నరసింహాచారిగారికి వందనాలు.

అతి తక్కువ వ్యవధిలో ఈ నా రచనను టైపుచేసిన చిరంజీవి కొణతాల ప్రకాశ్‌కు శుభాశీస్సులు.

సదా శ్రీ వేంకటేశుని సేవలో

28-3-2024 **మలయవాసిని**

# విషయసూచిక


**1. అయోధ్యావాసులు**

| | | |
|---|---|---|
| 1. | కేశిని | 1 |
| 2. | సుమతి | 3 |
| 3. | కౌసల్య | 5 |
| 4. | సుమిత్ర | 15 |
| 5. | కైక | 21 |
| 6. | మంథర | 31 |
| 7. | శాంతాదేవి | 44 |
| 8. | సీతాదేవి | 48 |

**2. వానరాంగనలు**

| | | |
|---|---|---|
| 9. | తార | 59 |
| 10. | రుమ | 62 |

**3. తపస్వినులు**

| | | |
|---|---|---|
| 11. | సత్యవతి | 63 |
| 12. | సోమద | 65 |
| 13. | అహల్య | 71 |
| 14. | అనసూయ | 76 |
| 15. | శబరి | 80 |

**4. దేవకాంతలు**

| | | |
|---|---|---|
| 16. | స్వయంప్రభ | 86 |
| 17. | సురస | 93 |

**5. రాక్షసులు**

| | | |
|---|---|---|
| 18. | తాటక | 95 |
| 19. | శూర్పణఖ | 102 |
| 20. | అయోముఖి | 112 |
| 21. | సింహిక | 113 |

**6. లంకావాసులు**

| | | |
|---|---|---|
| 22. | లంకిణి | 115 |
| 23. | ధ్యానమాలిని | 119 |
| 24. | త్రిజట | 121 |
| 25. | సరమ | 128 |
| 26. | మండోదరి | 132 |

# 1. కేశిని

శ్రీరాముడు విశ్వామిత్రుని – గంగ 'త్రిపథ'గ పేరు పొందింది కదా. అలా ఎందుకు మూడు మార్గాల్లో ప్రవహించింది? అసలు భూలోకానికి ఎందుకు వచ్చింది? అని అడుగుతాడు. ఆ సందర్భంలో సగరచక్రవర్తికథ చెప్పాడు విశ్వామిత్రుడు.

కేశిని సగరచక్రవర్తి పెద్దభార్య. పూర్వం అయోధ్యానగరాన్ని సగరుడు పరిపాలిస్తూ ఉండేవాడు. అతనికి పిల్లలు లేరు. సగరునికి ఇద్దరు భార్యలు. విదర్భరాజకుమార్తె అయిన కేశిని పెద్ద భార్య. ఈమె ధర్మాత్మురాలు. సత్యవాదిని. అరిష్టనేమి కుమార్తె సుమతి అనే ఆమె రెండవ భార్య. ఆమె గొప్ప సౌందర్యరాశి. ఈ ఇద్దరు భార్యలతో సగరచక్రవర్తి భృగుప్రస్రవణం అనే పవిత్రస్థలంలో తపస్సు చేసాడు. ఆ తపస్సు నూరు సంవత్సరాల కాలం సాగింది. సగరుని తపస్సుకు తృప్తిపొందిన భృగుమహర్షి సగరునికి సంతానము కలిగే వరాన్ని ప్రసాదించాడు. లోకంలో సాటిలేని కీర్తిని కూడా పొందగలవనే వరాన్ని కూడా ఇచ్చాడు. ఆతడు తన వరాల వివరాలు చెప్తూ – రాజా! నీ ఇద్దరి భార్యలలో ఒకామె వంశకరుడైన కుమారుణ్ణి కంటుంది. రెండవ ఆమె అరవై వేలమంది కుమారులను కంటుంది అని చెప్పాడు. ఆ మాటలు వినగానే అతని భార్యలిద్దరికీ కుతూహలం కలిగింది. ఎవరికి ఒకరు పుడతారు, ఎవరికి అరవైవేలమంది కుమారులు పుడతారు అని అడిగారు.

ఆ మహర్షి పరమధార్మికుడు కావడంతో రాణులను ఉద్దేశించి మీరే కోరుకోండి, మీరు ఎలా కోరుకుంటే అలాగే జరుగుతుంది అన్నాడు. మహర్షి మాటలు విన్న కేశిని 'ఋషివర్యా! వంశకరుడయిన ఒక్క కుమారుడు నాకు కావాలి' అంది వినయంగా.

ఆ తరువాత సుమతి మహోత్సాహవంతులు, కీర్తిమంతులు అయిన అరవై వేల మంది కుమారుల్ని తనకు అనుగ్రహించమని కోరింది.

రాజు రాణులతో కలసి భృగుమహర్షికి భక్తితో నమస్కరించి తన పట్టణానికి వచ్చాడు. కాలక్రమంలో అతని భార్యలిద్దరూ గర్భవతులయ్యారు. పెద్ద భార్య కేశిని కోరినట్లే ఒక కుమారుని కన్నది. అతనికి అసమంజసుడు అని నామకరణం చేసారు. ఈ పిల్లవాడు పెరిగి పెద్దవాడైనప్పటి నుండి ఊరిలోని బాలురనందరనీ బలవంతంగా లాక్కుపోయి సరయూనదిలో ముంచి వాళ్లు మునిగిపోయి గిలగిల లాడుతూ ఉంటే చూసి ఆనందిస్తూ ఉండేవాడు. ఇంతటి పాపకార్యాలు క్రూరకృత్యాలు చేస్తున్న అతని మీద ప్రజలకు కోపం పెరిగిపోయింది. అందరూ అతనిని నిందించసాగారు. ప్రజలకు ఇలా అనిష్టుడు కావడంతో ప్రజాపాలకుడయిన సగరచక్రవర్తి పరిస్థితి గమనించి అసమంజసుణ్ణి దేశం నుండి వెడలగొట్టాడు. అయితే అప్పటికే అసమంజసునికి వివాహమయింది. ఆతనికి ఒక కుమారుడు కలిగాడు. అతని పేరు అంశుమంతుడు. ఈతడు సకల ప్రజలకు హితము ప్రియమూ కలిగిస్తూ ఉండేవాడు.

ఇక్ష్వాకువంశపు రాజులు ప్రజల క్షేమంకోసం పుత్రులనయినా సరే శిక్షిస్తారు అనడానికి అసమంజసుని వృత్తాంతమే నిదర్శనం.

కేశిని కోరిక వంశకరుడైన పుత్రుడు కావాలని. అయితే ఆ కోరిక మనుమని వల్ల నెరవేరింది. సగరుని తరువాత అంశుమంతుడు వారసుడుగా సింహాసనాన్ని అధిరోహించాడు.

* * *

## ౨. సుమతి

కేశిని వృత్తాంతంలో సుమతిని గురించి కొన్ని వివరాలు తెలుసుకున్నాము. సగర చక్రవర్తి రెండోభార్య సుమతి. ఈమె భృగుమహర్షిని మహోత్సహవంతులు, కీర్తిమంతులు అయిన అరవై వేల మంది కుమారులు తనకు కలగాలని కోరుకుంది. ఈ సుమతి వినత కొడుకు అయిన గరుత్మంతుని సోదరికూడా. అంటే వినత కూతురు అన్నమాట.

ఈ సుమతి కోరుకున్నది ఒకరిని ఇద్దరినీ కాదు అరవైవేలమందిని కావడంతో – ఆమెకు అరవైవేలమంది పిల్లలుగల మాంసపిండం పుట్టింది. కొంతకాలానికి ఆ మాంసపిండంనుండి అరవైవేలమంది పిల్లలూ బయటకు వచ్చారు. అయితే వాళ్ళు ఆకారంలో చాలా చిన్నగా ఉండడంతో వారిని నేతితో నింపిన కుండలలో పెట్టి దాదులు కాపాడారు. కాలక్రమాన వారందరూ ఆరోగ్యంగా పెరిగి పెద్దవారయ్యారు.

ఆ సమయంలో సగరచక్రవర్తికి యజ్ఞం చేయాలనే సంకల్పం కలిగింది. తమ పురోహితులతో సంప్రదించి యజ్ఞం ఆరంభించాడు.

భారతభూమిమీద హిమవత్పర్వతానికి, వింధ్యపర్వతానికి మధ్యగల భూభాగానికి 'ఆర్యావర్తము' అని పేరు. ఆ ప్రదేశం యజ్ఞం చేయడానికి పవిత్రమయినదే కాదు ప్రశస్తమైనది కూడా. సగరుడు ఆ ప్రదేశంలో యజ్ఞం చేయ సంకల్పించాడు. యజ్ఞాశ్వాన్ని వెంటనంటి కాపాడటానికి తన మనుమడైన అంశుమంతుని నియమించాడు. అంశుమంతుడు శ్రద్ధగా చూస్తున్నాడు. కానీ ఇంద్రుడు రాక్షసుని వేషంలో వచ్చి అశ్వాన్ని దొంగిలించాడు. అశ్వం లేకపోతే యజ్ఞంలో అది మహాపరాధం అవుతుంది. అది అశుభకారణం కాగా పురోహితులు యాగాశ్వాన్ని వెతికించమని రాజును తొందర చేసారు. సగరుడు సరే అని ఒప్పుకుని సుమతి కుమారులను అరవైవేల మందిని వెదకి తేవడానికి నియమించాడు.

ఆ అరవైవేలమంది భూమినంతా వెతికారు, తండ్రి ఆజ్ఞమేరకు భూమినంతా తవ్వసాగారు. ఆ హడావిడిలో కపిలమహర్షికోపాగ్నిలో అరవై వేల మంది కాలి బూడిదయ్యారు.

అంశుమంతుడు పినతండ్రులను వెదుకుతూ వెళ్లి భస్మరాశిని చూసి దుఃఖపడ్డాడు. వారికి తర్పణం చేయడానికి నీటికోసం వెదికాడు. ఎక్కడా నీరుకనబడలేదు. ఇంతలో ఆ ప్రదేశంలో గరుత్మంతుడు కనబడి 'అంశుమంతా! నేను ఈ చనిపోయిన వారికి మేనమామను. వారికి ఈ లోకంలో ఈ నీటితో తర్పణం చేయడం మంచిపనికాదు. హిమవంతుని జ్యేష్ఠపుత్రిక గంగాదేవి వీరిని పవిత్రం చేయదగినది. ఆమెను ప్రార్థించండి' అని చెప్పాడు.

అంశుమంతుని కొడుకు దిలీపుడు ఆతని పుత్రుడు భగీరథుడు గంగను ఆకాశం నుండి భువికి, భువినుండి పాతాళానికి తీసుకురావడానికి విశ్వప్రయత్నాలు చేసారు.

భగీరథుడు తీవ్రమైన తపస్సు చేసి గంగను స్వర్గం నుండి భూమిమీదకు తెచ్చి తన ముత్తాతల భస్మముపై ప్రవహింపచేసాడు. అరవైవేల మందీ స్వర్గలోకానికి వెళ్లారు. గంగ మూడు మార్గాల్లో రావడం వల్ల 'త్రిపథ'గా పేరుపొందింది.

భగీరథుని ప్రయత్నంతో అతనిని అనుసరించి రావడం వల్ల 'భాగీరథి' అయింది.

మొత్తానికి సుమతి కన్న అరవైవేలమంది కారణంగా భూలోకవాసులకు పవిత్ర గంగాజలం ప్రాప్తించింది.

గంగ, భూమిమీదకు రావడానికి 'సుమతి' మూలకారణం.

సుమతి అరవైవేలమందిని కనడం ఒక విశేషం. ఇంతమంది పుత్రులకు తల్లి కావడం సుమతి అదృష్టం. ఆ పుత్రుల కారణంగా ఆకాశగంగ నేలకు దిగిరావడం మానవుల అదృష్టం.

**'మహాతల్లి'** సుమతి ప్రత్యేకత ఇది.

## 3. హ్రీమతి కౌసల్య

దశరథమహారాజు పట్టమహిషి కౌసల్య. దశరథునికి ప్రధాన రాణులు ముగ్గురు. ఆ ముగ్గురిని వాల్మీకి పాఠకులకు పరిచయం చేస్తూ–

**'తస్య భార్యా సుతిసృషు హ్రీ శ్రీ కీర్త్యుపమాసు చ'** అన్నాడు. ఆ వివరణను బట్టి 'కౌసల్య హ్రీమతి' హ్రీమతి అంటే సిగ్గరి అని అర్థం.

కౌసల్య –శ్రీరామాయణ కావ్య నాయకుడయిన రాముని కన్నతల్లి.

ఆమె సుగుణాల పెన్నిధి. ఔదార్యం, ఓర్పు, సౌశీల్యం, పవిత్రత ఆమె సొత్తు. శాస్త్రప్రకారం ఆచారవ్యవహారాలు పాటించడం ఆమెకు గల అలవాటు. పండితులను సన్మానించడం ఆమెకు ఎంతో ఇష్టమైన కార్యం. అంతేకాదు పేదవారిని, అసహాయుల్ని, దుర్గతిపాలైన వారిని సాకడంలో ఆమెచేతికి ఎముకలేదు అని చెప్పవచ్చు. ధారాళమైన దాతృత్వం ఆమెది. ఆమెకు భర్తయే దేవుడు. ఆయనను ప్రేమించడం, సేవించడం ఆమెకు నిత్యకార్యక్రమాలు.

చిన్న భార్య, సౌందర్యవతి అయిన కైకేయి ఎడల తన భర్త అపరిమితమైన వ్యామోహంలో చిక్కుకుని తనను విస్మరించినా, న్యూనతపరచినా భర్తను పల్లెత్తు మాట అనదు.

తన పట్టమహిషిహోదాను కైక చులకన చేసినా కౌసల్య ఎంతో ఓర్పుతో సహిస్తుందేగానీ ఒక్క పలుకు పలకదు.

కౌసల్య మనోనిగ్రహం ఎంతో విశేషమయింది. ఎంతటి బాధనయినా బహిర్గతం చేయకుండా లోలోన దాచుకోగల ధీరురాలు ఆమె.

అశ్వమేధం, పుత్రకామేష్టి యాగాల నిర్వహణలో ఆమె భర్తతో, సపత్నులతో కలిసి హృదయపూర్వకంగా ఉత్సాహంగా సహకరిస్తుంది.

కౌసల్య యజ్ఞదీక్షనిర్వహించడంలోఎంతో శ్రద్ధ వహిస్తుంది. యజ్ఞపశు వైన అశ్వాన్ని కౌగలించుకొని రాత్రి అంతా మనస్సు చలించకుండా గడుపుతుంది. వేదనిర్ణయాన్ని అనుసరించి ఆమె మరొక నియమాన్ని కూడా హృదయపూర్వకంగా పాటిస్తుంది. యజ్ఞాన్ని యథావిధిగా నడిపించే ప్రధాన ఋత్విక్కులలో ఒకరయిన'హోత'కు ఆమెను దానం చేయడం యాగవిధులలో ప్రధాన విషయం. ఆమె దానికి కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా సమ్మతిని తెలియజేస్తుంది.. భర్త తన ఎడల ఎంత నిర్లక్ష్యంగా, ముభావంతోఉన్నా కౌసల్య మాత్రం దశరథుడు నిర్వహించే యాగకార్యక్రమాలలో నిండుహృదయంతో సహకరిస్తుంది. అదీ ఆమె ఔదార్యం. పరమేశ్వరుడే యజ్ఞస్వరూపుడు. ఇక్ష్వాకువంశం అవిచ్ఛిన్నంగా సాగడానికి పురుషసంతతికోసం చేసే పవిత్రయజ్ఞ కార్యంలో పాల్గొనడం తనకొక దివ్యమైన హక్కు, ఆనందకరమైన అవకాశం అని కౌసల్య పొంగిపోతుంది.

ధర్మనిష్ఠాపరుడైన దశరథుడు ప్రాజాపత్య పురుషుడు ఇచ్చిన పాయసంలో సగభాగం కౌసల్యకు ఇచ్చి గౌరవించాడు.

జ్ఞానంతో కూడిన సౌమ్యగుణానికి అంటే నిజమైన సత్త్వగుణానికి కౌసల్య ప్రతీక. జీవితంలో అత్యంత ప్రధానమైన ఉత్తమ పురుషార్థం ధర్మం. ఆ ధర్మమే రూపుదాల్చి ఆమె కుమారుడు రామునిగా అవతరించింది. ఆ దేవమాత అదితి తన తనయుడు ఇంద్రునితో కూడి ఎంత కాంతితో వెలుగొందిందో అంతటి ఉజ్జ్వల తేజస్సుతో కౌసల్య కూడా అందరిని సమదృష్టితో చూడగలిగే గొప్ప సుగుణవతి. కౌసల్యకు రాముణ్ణి కుమారునిగా పొందడమే మహద్భాగ్యం. ఆ అదృష్టానికి నోచుకున్న కౌసల్యను విశ్వామిత్రుడు ప్రత్యేకంగా అభినందిస్తాడు "కౌసల్యా సుప్రజా రామ" అంటూ. కౌసల్య ఔదార్యం ఎంతటి ఉదాత్తమయినదో వ్యక్తమయ్యే

సంఘటనను విశ్వామిత్రుడు స్వయంగా చూసాడు. విశ్వామిత్రుడు దశరథుని వద్దకు వచ్చినప్పుడు విశ్వామిత్రుని కోరికను మన్నిస్తానని మాట ఇస్తాడు. కానీ రాముణ్ణి తనతో పంపమని కోరడంతో మాట తప్పడానికి సిద్ధపడతాడు. ససేమిరా రాముణ్ణి మహర్షివెంట పంపలేను అన్నాడు. వసిష్ఠుడు ఎంతగానో నచ్చచెప్పిన మీదట సరే అని ఒప్పుకున్నాడు. ఆ సందర్భంలో కౌసల్య ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. నోరు మెదపలేదు. ఎంతో హుందాగా మర్యాద నిలబెట్టుకుంది. విశ్వామిత్రుడు ఆమె గాంభీర్యతను గమనించాడు. రామునికి తగిన తల్లి అని ఆమెను అభినందించాడు.

కౌసల్య, దశరథుడు ఇద్దరూ రాముణ్ణి సమానంగా అత్యంతంగా ప్రేమించినవారే. రాముణ్ణి విడిచి ఉండడం ఇద్దరికీ దుఃఖాన్ని కలిగించే విషయమే. అయితే కుమారుని ఎడల తాను పెంచుకున్న అమితానురాగం ఆతని బలపరాక్రమాలను అంచనా వేసే శక్తిని దశరథునిలో మరుగుపరచింది. కనుకనే విశ్వామిత్రునికి ఇచ్చిన మాటను దశరథుడు నిలబెట్టుకోలేక నానా అవస్థ పడ్డాడు. కాని కౌసల్యకు తన కుమారుని ప్రజ్ఞాపాటవాలు ఎంత మహోన్నతమైనవో తెలుసు. ఆ విషయంలో దేవతలెవ్వరూ ఆతనికి దీటురారని ప్రకటిస్తుంది కూడా. సత్యసంధునిగా పేరుగన్న తండ్రియొక్క కీర్తికి మచ్చరాకూడదనే తపనవల్లనే తన కుమారుడు ధర్మానికి కట్టుబడి తండ్రిఆజ్ఞను వినయంతో పాటించాడని కౌసల్య దశరథునికే వివరించి చెప్తుంది.

రాముడు యువరాజపట్టాభిషేకం చేసుకోబోతున్నాడని కౌసల్య ఎంతగానో మురిసిపోతుంది. ఉపవాసం ఉండి కులదేవతలను కొలిచి రాముని క్షేమం కోసం నియమనిష్ఠలతో భగవద్ధ్యానంలో ఉంటుంది. అయితే ఒక్కరాత్రి గడిచేసరికే తనకుమారుని అదృష్టం అకస్మాత్తుగా

ఎందుకు తారుమారయిందో కౌసల్యకు తెలియదు పాపం. ఇక్ష్వాకు వంశంలో ప్రసిద్ధిగాంచిన మహోన్నత రాజర్షుల కోవలో తన పుత్రుడు కూడా నిలవాలని, వారి కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపచేయాలని ఆమె పవిత్ర మనోరథం. పూజాతత్పరురాలై ఉన్న కౌసల్య దగ్గరకు రాముడు పట్టాభిషేకభంగవార్త చెప్పడానికి వస్తాడు. రాముడు రాగానే కౌసల్య తాను గృహమాధవునకు సమర్పించిన నైవేద్యాన్ని తెచ్చి ప్రసాదం తీసుకోమని ఇస్తుంది. తల్లి తన మీద చూపిస్తున్న ఆప్యాయత, తన పురోభివృద్ధి కాంక్షిస్తూ పడే ఆత్రత చూసేసరికి రామునికి తల్లిమీద ఎనలేని జాలి కలుగుతుంది. నెమ్మదిగా తల్లిని చేరవచ్చి దశరథమహారాజు భరతుణ్ణి యువరాజుగ నియమించినట్లు, తనను పద్నాలుగేళ్లు వనవాసం చేయమని ఆజ్ఞాపించినట్లు తల్లికి తెలియజేస్తాడు. ఘోరమైన ఈ వార్త కౌసల్యహృదయానికి పిడుగుపాటు అయింది. తుఫానుగాలికి అరటి చెట్టు విరిగిపడినట్లు ఆమె నేలమీద కూలిపోయింది. కొంతసేపటికి తేరుకొని దుఃఖించసాగింది.

ఇంతకాలంగా దశరథుడు అనాదరణ చేసినా, ఆప్యాయత చూపించకపోయినా, కైక యొక్క అధికారధోరణి భరించగలిగింది అంటే కారణం రాముడు తన ఎదుట ఉన్నాడనే ధైర్యం. తన కొడుకు ఉంటే తనకు అన్నీ ఉన్నట్లే అని భావించింది ఆమె. రాముడు వనవాసానికి వెళితే రామసన్నిధి తనకు కరవైపోతుంది. అందుకే ఆమె దుఃఖసాగరంలో మునిగిపోయింది. అదీకాక భరతుడు యువరాజు, కైక రాజమాత. ఉద్ధృతమైన అహంభావంతో కైక ప్రవర్తించే తీరు తట్టుకోవాలి. ఎన్నెన్ని అవమానాలు భరించాలో అని కౌసల్య ఆవేదన. రాముడు తన ప్రాణం. అందువల్ల తాను కూడా అడవులకు వెళ్లడానికి సిద్ధపడుతుంది. రాముడు అందుకు అంగీకారం తెలపడు. భర్తతో ఉండడమే భార్యకు ధర్మం అంటాడు.

ఆ మాట మీద కౌసల్య నేను తల్లిగా చెప్తున్నాను. తండ్రిమాట మీద అడవికి వెళ్లడానికి సిద్ధపడుతున్నావు. తల్లిగా నా మాట పాటించి అరణ్యవాసానికి వెళ్లవద్దు అంటుంది. తల్లిదండ్రులిద్దరూ పూజ్యులే కదా అంటుంది. తల్లి మాటలు విన్న రాముడు 'తల్లీ! మీరు చెప్పిన ధర్మం గౌరవించవలసినదే కానీ నేను ఇంతకుముందే నా తండ్రికి వాగ్దానం చేసాను. ఇప్పుడు మీ మాట పాటించి వనవాసం మాని ఇచ్చినమాటను బోటు పోనీయను. దశరథుడు నాకు తండ్రి మాత్రమే కాదు. గురువు, ప్రభువు కూడా. అంతేకాదు మనం అందరం గౌరవించవలసిన వృద్ధుడు కూడా'.

ఇంత విశదంగా తన మనస్సులో మాటను తల్లికి విన్నవించి ఆమె కర్తవ్యాన్ని గుర్తుచేస్తాడు. గాఢమైన దుఃఖంతో కుమిలిపోతున్న భర్తను విడిచిపెట్టడం ధర్మంకాదనీ ఆదుకుని ఆదరించి సేవించడమే తాను చేయవలసిన కార్యమనీ కౌసల్య గుర్తిస్తుంది.

క్రమంగా కౌసల్యలోని సత్త్వగుణం పుంజుకుంటుంది. కుమారుని నిర్ణయం తనకెంత బాధకలిగించేదైనా అది ధర్మబద్ధమైనందుకు రాముణ్ణి మెచ్చుకుంటుంది. తనకు ప్రస్తుతం ఎదురైన విషమపరిస్థితులకు సమాధానపడుతుంది. ధైర్యం వహిస్తుంది.

కుమారుని క్షేమాన్ని అర్థిస్తూ, అయోధ్యకి ఆతని పునరాగమనాన్ని కాంక్షిస్తూ కౌసల్య రామునిచేత కొన్ని హెూమాలు చేయిస్తుంది. నిండు హృదయంతో మంగళాశాసనం పలుకుతుంది. ఆశీస్సులందిస్తుంది. ఆనాడు కౌసల్య పలికిన ఆ మంగళాశాసనం అతి పవిత్రంగా భావించి నేటికీ ఆలయాలలో ఉత్సవమూర్తులను ఊరేగింపుకు తీసుకువెళ్లే వేళల్లో అర్చకస్వాములు భక్తితో పఠిస్తున్నారు.

**యన్మంగళం సహస్రాక్షే సర్వదేవనమస్కృతే ।**
**వృత్రనాశే సమభవత్ తత్తే భవతు మంగళమ్ ॥**

**యన్మంగళం సుపర్ణస్య వినతాఽకల్పయత్పురా ।**
**అమృతం ప్రార్థయానస్య తత్తే భవతు మంగళమ్ ॥**

**అమృతోత్పాదనే దైత్యాన్ ఘ్నతో వజ్రధరస్య యత్ ।**
**అదితిర్మంగళం ప్రాదాత్ తత్తే భవతు మంగళమ్ ॥**

**త్రీన్ విక్రమాన్ ప్రక్రమతో విష్ణోరమితతేజసః ।**
**యదాసీన్ మంగళం రామ! తత్తే భవతు మంగళమ్ ॥**

**ఋతవస్సాగరా ద్వీపా వేదో లోకా దిశశ్చ తే ।**
**మంగళాని మహాబాహో! దిశన్తు తవ సర్వదా ॥**

**(అయోధ్య. 25.32-36)**

తల్లి ఆశీస్సులు అందుకోవడానికి రాముడు సాష్టాంగ నమస్కారం చేసి తల్లిపాదాలను తన కన్నీటితో అభిషేకిస్తాడు. కుమారుని లేవనెత్తి రాముని పునరాగమనాన్ని అయోధ్యలో ఆతనికి జరగబోయే పట్టాభిషేక మహోత్సవాన్ని తనివితీరా చూచి ఆనందించే మంచిరోజు రావాలని ఆశిస్తుంది.

అరణ్యవాసానికి బయలుదేరుతున్న కోడలు సీతను కౌగిటిలోకి తీసుకుని కలిమిలేముల్లో, కష్టసుఖాల్లో భర్తని అంటిపెట్టుకుని ఉండే సీతశీలాన్ని అభినందిస్తుంది. తన ప్రియకుమారుడయిన రాముణ్ణి ఎట్టి పరిస్థితుల్లోను అలసత్వభావంతో చూడవద్దని సీతను అభ్యర్థిస్తుంది.. పేరెక్కిన పతివ్రతలా మసలుకొని రాముని ఎడల పూజ్యభావాన్ని నెరపుతూ మెలగవలసింది అని సీతకు ప్రియమార బోధిస్తుంది.

అత్తగారి మాటలకు గౌరవంతో సీత ఉచితమైన సమాధానం ఇస్తుంది. రామునిపట్ల తన ప్రేమ సుస్థిరమైనదనీ, ఆతని పట్ల భక్తిభావం ఏనాటికి తరగనిదని నొక్కి పలుకుతుంది.

రాముడు అరణ్యాలకు తరలిపోయాడు. దశరథుడు తనను తాను నిందించుకుంటూ, కైకను నిరసిస్తూ ఆమెతో తెగతెంపులు చేసుకొని కౌసల్య చెంతకు చేరతాడు.

రాముని లాలించిన కౌసల్య హస్తాలతో కనుక తనను తాకితే తాను అనుభవించే నరకయాతన కొంతైనా తీరుతుంది అనే ఆశతో కౌసల్యను చేరవస్తాడు. ఎంతో జాలిగా కౌసల్యను ప్రాధేయపడతాడు. ఈ సందర్భంలో కౌసల్య భర్త ఆశించిన తీరులో కాక కొడుకు వనాల పాలయ్యాడనే దుఃఖాన్ని తట్టుకోలేక నిష్ఠూరంగా మాట్లాడి దశరథుని మనస్సును మరింత క్షోభపెడుతుంది. నా రాముడు అడవుల్లో ఏమి అవస్థలు పడుతున్నాడో అని భోరుమని విలపిస్తుంది. కౌసల్యలో మాతృ వాత్సల్యం ఉద్ధృతమై పత్నీధర్మాన్ని పక్కకు నెట్టేస్తుంది. అలాగే సుమంత్రుడు సీతారామలక్ష్మణులను అరణ్యంలో వదలివచ్చిన సందర్భంలో సుమంత్రుడు ఒక్కడే రావడం చూసిన దశరథుడు బాధతో గిలగిల–లాడతాడు. స్పృహ తప్పి పడిపోతాడు. కొంతసేపటికి తేరుకుంటాడు. ఆ సందర్భంలో కూడా కౌసల్య దశరథుణ్ణి సూటిపోటి మాటలతో నిందిస్తుంది.

“నీ ఆజ్ఞ పాలించడానికి నీ పుత్రుడు గొప్పత్యాగం చేసాడు. రాజ్యాధిపత్యాన్ని గడ్డిపోచలా వదిలేసి అరణ్యానికి వెళ్లిపోయాడు. నువ్వు చేసిన పనికి ఇప్పుడు సిగ్గుపడుతున్నావు. మహారాజా! కైక యిక్కడ లేదులే. ఆవిడకు కోపం వస్తుందేమో అని భయపడక్కరలేదు. నీ హృదయ స్పందనలు ఆపుకోనక్కరలేదు అంటూ దశరథుని పిరికితనాన్ని,

బలహీనతని దుయ్యబడుతుంది. మహారాజాధిరాజా! సత్యవాదివనీ, ధర్మశీలుడవనీ, దానపరుడవనీ గొప్ప కీర్తి గడించావు. సుగుణసంపదకి ధైర్యసాహసాలకీ పేరుగడించి లోకంలో అందరి మన్ననలు పొందిన జ్యేష్ఠపుత్రుణ్ణి రాజ్యబహిష్కృతుణ్ణి చేసావు. ఇంతకీ రాముడు చేసిన నేరం గుణవంతుడని పేరుపొందడమే కదా! దానికి శిక్ష అడవులకు పంపే అధికారం తండ్రికి ఉంది అని న్యాయశాస్త్రం చెప్పిందా? మేమేం దోషం చేసాము. మమ్మల్ని ఇంతగా బాధపెడుతున్నావు. పట్టమహిషినైన నేను నీప్రేమకు నోచుకోలేదు. నా కుమారుని అడవిపాలు చేసావు. నీకు కావలసింది కైకను సంతోషపెట్టడం. అదే నీకు పరమావధి. ఆమె విలాసాలకి బానిసవై పోయావు. నాకు గుండెకోత పెట్టేవు. నీ మంత్రులకు అన్యాయం తలపెట్టేవు. ప్రజలను దుర్గతి పాలుచేసావు. రాజ్యాన్ని నాశనం చేసావు. ఇన్ని విధాల నీ ప్రజ్ఞ ప్రదర్శించావు. నీవు చేసిన పనులకు నిన్ను నువ్వు అభినందించుకో అంటూ కౌసల్య హృదయంలో మరుగుతున్న కోపం, తాపం, హేయభావం ఒక్కసారి పొంగి పొరలి దశరథుని మంచెత్తివేసాయి.

దశరథుడు కౌసల్య పట్ల తన ప్రవర్తనకు పశ్చాత్తాపపడుతున్నానని చెప్పి ఆమె అభిమానాన్ని పొందాలని ఆశించి వచ్చాడు. తీరా వచ్చాక కౌసల్య తీవ్రమైన నిరాదరణ, నింద ఎదుర్కొన్నాడు. రాజుకు దిక్కుతోచక తలవంచుకుని క్షమాభిక్ష పెట్టమని రెండుచేతులు జోడించాడు. నీ తీక్ష్ణమైన మాటలతో వేధించవద్దని వేడుకొన్నాడు. కౌసల్య ఆ దశ్యాన్ని తట్టుకోలేకపోయింది. పశ్చాత్తాపంతో భర్త పాదాలపై పడి క్షమించమని వేడుకుంటుంది. తాత్కాలికంగా ఆవేశం పొందినా సత్యాన్ని దర్శించడంలో కౌసల్య మనస్సు సరిగ్గా వ్యవహరిస్తుంది. ఆమెలో కోపం తగ్గింది. సాత్త్వికభావంతో వ్యవహరించింది. భార్యాభర్తల మధ్య సయోధ్య ఏర్పడింది. దశరథుడు మనసు విప్పి తాను యువకుడుగా ఉండగా

జరిగిన శ్రవణకుమారవృత్తాంతం కౌసల్యకు వివరంగా చెప్తాడు. తాను శబ్దవేధి విద్యతో బాణం వదలడం నీళ్లుముంచుతున్న శబ్దం ఏనుగు నీళ్లు తాగుతోంది అని భావించడం, ఆ బాణం గ్రుడ్డిదంపతుల తనయునికి తగిలి అతడు మరణించడం తెలియచెప్పాడు. ఆ విషయం విని పుత్రుని మరణానికి తల్లడిల్లుతూ స్వచ్ఛందమరణం పొందుతూ ఆ వృద్ధ అంధదంపతులు నన్ను నీవు కూడా పుత్రవియోగంతో మరణిస్తావని శపించారు అంటూ ఆ వృత్తాంతాన్ని మనస్సు విప్పి కౌసల్యకు చెప్పుకుంటాడు.

తండ్రికోరిక అన్యాయమైనదయినా మారుపలకకుండా చెల్లించిన వైభవం తన కుమారునికి మాత్రమే చెల్లగలదనీ దానికై తాను గర్విస్తున్నానని దశరథుడు ప్రకటిస్తాడు. రాముని ఎడబాటు తట్టుకోలేక దిగులుతో ప్రాణాలు విడుస్తాడు మహారాజు.

కౌసల్య మనస్థైర్యం గొప్పది. భర్త చిన్నచూపు చూసినా ఆమె ఏనాడు భర్తను నిందించలేదు. తన పుత్రుణ్ణి అరణ్యాలకు పంపినప్పుడు మాత్రం ఆమెలోని మాతృవాత్సల్యం ఆమెను కఠినంగా మార్చింది. తన హృదయంలో ఎంతకాలంగానో పేరుకుపోయిన అసహ్యత దశరథుని మృతితో బయటపడ్డది. కైకను చూసి –

ఓ దుష్టురాలా! మన భర్త ఇక లేడు. రాముడు అడవుల్లో ఉన్నాడు. నీకోరిక తీరింది. హాయిగా రాజ్యాన్ని ఏలుకో, నీకెవరూ అడ్డుచెప్పరు అంటుంది.

చిత్రకూటంలో కూడా కౌసల్య కైకను నిందిస్తుంది.

తనకొడుకుకు రాజ్యపదవిని కట్టబెట్టడానికి కైక పన్నిన కుట్రలో భరతుని ప్రమేయం ఉండేఉంటుందేమో అనే అనుమానం కౌసల్యని దుఃఖపెడుతుంది. భరతుణ్ణి చూడగానే అతనిపై విరుచుకుపడుతుంటే

భరతుడు తెల్లబోతాడు. తల్లీ! కైక పన్నిన వ్యూహం ఏమిటో నాకు తెలియదనీ తాను నిరపరాధిననీ భరతుడు నొక్కి చెప్తాడు. తనకు ఎలాంటి శిక్ష విధించినా అనుభవిస్తాననీ నిజాయితీగా పలుకుతాడు. భరతుని సమాధానం విన్న కౌసల్య తన తొందరపాటుకు పశ్చాత్తాపపడి భరతుని ధర్మనిష్ఠని, ఋజువర్తనాన్ని మెచ్చుకుంటుంది.

గుహుడు రాముడు పడిన కష్టాలు వివరించి చెప్పగా విన్న భరతుడు మూర్ఛపడినప్పుడు కౌసల్య భరతుడు త్వరగా స్వస్థత చెందాలని భగవంతుని ప్రార్థిస్తుంది. ఆమె రాముని భరతుని ఒకే విధంగా ప్రేమిస్తుంది.

కౌసల్య రాముడు వనవాసానికి వెళుతున్న వార్త విన్నప్పుడు నాయనా నువ్వు నాకు పుట్టకపోయినా బాగుండేది అని దుఃఖిస్తుంది. ఆమెలోని మాతృవాత్సల్యం కొలవలేనిది.

ఏమైనా కౌసల్య సత్త్వగుణసంపన్న. తొందరపాటుతో తప్పుచేసినా నిజం తెలుసుకుని పశ్చాత్తాపపడే సద్గుణం గలది. ఇతరులలోని ధర్మ పరాయణత్వాన్ని అభినందించే లక్షణం ఆమెలో ఉంది.

రాముణ్ణి విశ్వామిత్రునితో పంపే సందర్భంలోనూ, వనవాసానికి పంపే సందర్భంలోనూ మనసారా దీవించి పంపిన ధీరురాలు ఆమె. ఉత్తమ మాతృదేవి కౌసల్య సకలలోకారాధ్యగా గణుతింపబడింది. శ్రీరాముని కన్నతల్లి. రాముడు కౌసల్యా సుప్రజారామా! అని పిలిపించుకున్నాడు.

* * *

## 4. సుమిత్ర

వాల్మీకిమహర్షి దశరథమహారాజు భార్యలను గురించి ప్రస్తావిస్తూ "తస్య భార్యా సుతిస్పృషు హ్రీ శ్రీ కీర్త్యుపమాసు చ" కౌసల్య సుమిత్ర కైకలను హ్రీ, శ్రీ, కీర్తులతో పోల్చాడు. ఆ వరుసక్రమంలో సుమిత్ర 'శ్రీ'వంటిది. ఈమె దశరథుని రాణులలో రెండవ ఆమె.

'సుమిత్ర' అనే పేరులోనే ఆమె అందరకు మంచి మిత్రురాలు అనే అర్థం స్పష్టపడుతోంది. విశ్వశ్రేయస్సుకోసం ఆమె ఎంతటి స్వార్థత్యాగానికయినా వెనుకాడని విదుషీమణి స్వస్వరూపాన్ని, ఆత్మతత్త్వాన్ని ఎరిగిన విద్వాంసురాలు. ఎంతటి క్లిష్టసమయాలలోనయినా మనస్స్థిమితాన్ని కోల్పోదు. స్థితప్రజ్ఞురాలు. దుర్విధిచేత బాధపడేవారికి ఉపశమనాన్ని శాంతిని కలుగజేయగల అనుభవజ్ఞురాలైన తపస్విని ఆమె. శ్రీరామునిలో పరతత్త్వాన్ని దర్శించిన మహాభాగ ఆమె. నిశితమైన అంతర్దృష్టి గలది కావడం వల్ల రాముడు దైవాంశసంభూతుడనీ, అవతార మూర్తి అని గ్రహించింది.

మొదటిసారి ఆమెను మనం పుత్రకామేష్టియాగసందర్భంలో చూస్తాం. ప్రజాపత్య పురుషుడు ఇచ్చిన దివ్యపాయసాన్ని దశరథుడు ముగ్గురు రాణులకు పంచి ఇస్తూ సుమిత్రకు పాయసంలో నాల్గోవంతు ఒకసారి, ఎనిమిదవవంతు మరొకసారి రెండుసార్లు ఇస్తాడు. దాని కనుగుణంగా సుమిత్రకు లక్ష్మణుడు, శత్రుఘ్నుడు అనే కవలలు పుట్టారు. పెద్దలు రామలక్ష్మణ భరత శత్రుఘ్నులను నలుగురిని చతుర్విధ పురుషార్థాలుగా భావిస్తారు. రాముడు ధర్మానికి, లక్ష్మణుడు అర్థానికి, భరతుడు మోక్షానికి, శత్రుఘ్నుడు కామానికి ప్రతినిధులుగా సంభావిస్తారు.

అర్థకామాలకు ప్రతీకలయిన లక్ష్మణుడు శత్రుఘ్నుడు కలిసి ఉంటే లోకానికి అరిష్టం ఏర్పడే ప్రమాదం ఉందని గ్రహించిన ఆ తల్లి అర్థాన్ని ధర్మంతోనూ, కామాన్ని మోక్షంతోను అనుసంధించింది. రామలక్ష్మణులు ధర్మార్థాలు, భరతశత్రుఘ్నులు మోక్షకామాలు.

తన పుత్రులు ఇరువురినీ భాతృసేవాపరాయణులుగా చేసింది. సాక్షాత్తు భగవత్ స్వరూపుడయిన రాముని సేవలో లక్ష్మణుడు భాగవతోత్తముడయిన భరతుని సేవలో శత్రుఘ్నుడు తమ జీవితాలను సార్థకం చేసుకున్నారు.

తన సంతానాన్ని సమాజకల్యాణంకోసం పాటుపడే పవిత్ర దృక్పథం గలవారిగా తీర్చిదిద్దడంలో తల్లిగా సుమిత్ర విశేషమయిన కృషిచేసింది.

శ్రీరాముడు అరణ్యవాసానికి బయలుదేరే సందర్భంలో లక్ష్మణుడు తానుకూడా వెంటవస్తాననీ, అంగీకరించమనీ రాముణ్ణి అనేక విధాల ప్రాధేయపడతాడు. రాముని అంగీకారం పొందిన లక్ష్మణుడు తల్లి సుమిత్ర వద్దకు వచ్చి సాష్టాంగప్రణామం చేసి తాను అన్నగారితో కలిసి అరణ్యాలకు వెళ్లడానికి నిశ్చయించుకున్నాననీ అనుజ్ఞ ఇమ్మని కోరతాడు. సుమిత్ర కుమారుని లేవనెత్తి అక్కున చేర్చుకుంటుంది. ఆమె కన్నుల వెంట ఆనందభాష్పాలు జాలువారతాయి. అన్నగారిని సేవించుకోవడం తనకు ధర్మమని నిర్ణయించుకున్న కుమారుణ్ణి ఆమె ఆనందంతో అభినందిస్తుంది. ఆశీస్సులిస్తూ ప్రబోధిస్తుంది. 'ప్రియకుమారా! ఒక్కసంగతి ఎల్లవేళలా గుర్తుపెట్టుకో. కౌసల్య రాముణ్ణి కన్నది లోకశ్రేయస్సు కోసం. నేను నిన్ను కన్నది రాముణ్ణి నిరంతరం సేవించుకోవడానికి. ఈ లోకంలో రాముడు ఒక్కడే శరణ్యుడు అని తెలుసుకో నాయనా! కావాలని నీకుగా నువ్వు సీతారాముల్ని సేవించుకోవడానికి అరణ్యానికి వెళుతున్నావు కాబట్టి సీతారాములను సేవించడంలో ఏవిధమయిన ఏమరపాటూ తగదు సుమా! తమ్ముని విధ్యుక్తధర్మాలు ఏమిటో తెలుసా–

అన్నగారి వెనుకనే అడుగులో అడుగు వేసుకుంటూ నడవడం, తనకు గల సంపదను యజ్ఞయాగాదుల్లో సమర్పణ చేయడం, శత్రువులతో యుద్ధం సంభవించినప్పుడు ప్రాణాలకి తెగించి పోరాడడం ఇవేనయ్యా తమ్ముడు చేయవలసిన విధులు. నాయనా మీది ఇక్ష్వాకు వంశం. పవిత్రమయిన సంప్రదాయం మనది. నాయనా లక్ష్మణా! నువ్వు వనవాసం కోసమే పుట్టావు. రామునితో సహవాసం లభించినందుకు ఆనందించు.

**"రామం దశరథం విద్ధి**
**మాం విద్ధి జనకాత్మజాం**
**అయోధ్యాం అటవీ విద్ధి**
**గచ్ఛ తాత! యథాసుఖం" (అయోధ్య.40-9)**

"రాముణ్ణి తండ్రి అయిన దశరథునిగాను, సీతామాతను తల్లిగాను, అడవినే అయోధ్యగా భావించు. సుఖంగా వెళ్లిరా" అని ప్రేమగా అనుమతి ఇస్తుంది.

తాను కన్నపిల్లవాడికి వనవాసం చేసిరమ్మని అనుమతి ఇవ్వడం ఒక ఎత్తైతే, తోటికోడలు మహారాణి అయిన కౌసల్యకు కూడా సుమిత్ర రామతత్త్వాన్ని, రామవనవాస ఆవశ్యకతని వివరిస్తూ కౌసల్యలోని దుఃఖాన్ని ఉపశమింపచేయడానికి సుదీర్ఘమయిన ఉపన్యాసం ఇస్తుంది. సుమిత్ర రామాయణకథలో ఈ సందర్భంలోనే ఇంత విశేషంగా మాట్లాడుతుంది.

శ్రీరామవనవాసాన్ని తట్టుకోలేక తల్లడిల్లిపోతూ ఉన్న కౌసల్యతో రాముడు పురుషోత్తముడు, ఆ విషయం తెలియక నువ్వు ఇంత బాధపడుతున్నావు అంటూ ఆరంభించి సుమిత్ర తన సుభాషితాన్ని సాగిస్తుంది. 'అక్కా! రాముడు పితృభక్తి సంపన్నుడు. తండ్రికి ఇహలోకం లోనే కాకుండా పరలోకంలో కూడా శాశ్వతమైన కీర్తిని, పరమశాంతిని

సంపాదించి పెట్టాలి అనే ఉద్దేశ్యంతో రాముడు వనవాసానికి వెళ్లాడు. అంతటి ధర్మపరాయణుడయిన రాముడి కోసం దిగులుపడడం సబబుకాదు అక్కా. రామునితో పాటు లక్ష్మణునికి కూడా లాభం ఉంది. రాముడు సాధించే పరమార్థంలో లక్ష్మణునికి కూడా భాగం ఉంటుంది అని నమ్మిన సూక్ష్మదర్శిని సుమిత్ర. సీతాదేవి రాముని వెంటవెళ్లడంలో కూడా ఎంతో ఔచిత్యం ఉంది' అంటుంది కౌసల్యతో. వసిష్ఠుడే స్వయంగా వద్దు అన్నా సీత రామునితో కూడా వనవాసానికి వెళ్లింది. అరణ్యవాసంలో రాముడు ఎగురవేయబోయే కీర్తిపతాకం, సాధించగల పరమార్థాలను భావించగల మహానుభావురాలు సుమిత్ర.

అక్కా! రాముడు అరణ్యవాసకాలంలో సత్యధర్మాలను సాధించడానికి వెళ్లాడు. ఆతడి అంతఃకరణపారిశుద్ధ్యానికి సంతోషించి సూర్యకిరణాలు ఆతనికి వెలుగునిస్తాయేగాని వేడిని ప్రసరించి వేధించవు. అలాగే ఎల్లవేళలా చల్లని గాలివీచి రామునికి హాయిని చేకూరుస్తుంది. రాత్రివేళల్లో రాముడు నిద్రపోయేవేళలో వెన్నెల ఆతని సేదతీర్చి చల్లదనాన్ని చేకూరుస్తుంది. ప్రకృతి ఇలా తోడ్పడడమేకాదు. తనయజ్ఞాన్ని నిర్విఘ్నంగా జరిపించిన రామునికి విశ్వామిత్రమహర్షి ప్రియమార ఇచ్చిన అమోఘమైన అస్త్రాలన్నీ అతనికి అండగా నిలబడగలవు. అడవిలో ఉన్నా అయోధ్యలో ఉన్నా రాముడికి తన బాహుబలమే శరణ్యం. అందువల్ల అతనికి వనం కూడా భవనంగానే ఉంటుంది.. రాముని బాణం ఎటువెళితే ఆ దిక్కులో ఉన్న శత్రువులందరూ క్షణంలో నశిస్తారు. అలాంటి వీరుడు తన సంపదతో, శౌర్యంతో, కల్యాణభావంతో లోకాన్ని జయించి త్వరలోనే తన రాజ్యం తాను గౌరవంగా చేపడతాడు. అందుకు ఎలాంటి సందేహం పడవద్దు.

అక్కయ్యా! రాముడంటే సామాన్యుడు కాడు సుమా! సూర్యుడికి వెలుగునియ్యగల సూర్యుడు. అగ్నికి దీప్తిని ఇయ్యగల అగ్నిహోత్రుడు.

ప్రభువులకు ప్రభువు. శ్రీకి శ్రీని చేకూర్చగల శ్రీమంతుడు. కీర్తికి కీర్తిని ప్రసాదించగల కీర్తిమంతుడు. క్షమను క్షమించగల క్షమాశీలి. దేవతలకు దేవతుల్యుడు. ప్రాణికోటికి ముఖ్యప్రాణస్వరూపుడు. అలాంటి రాముడి గురించి దిగులుపడడం అవివేకం. రాజ్యలక్ష్మి, మహాలక్ష్మి, సీతాలక్ష్మి ముగ్గురితో కలిసి రాముడు అరణ్యం నుండి తిరిగి వచ్చి పట్టాభిషేకం చేసుకుంటాడు. రాముడు అరణ్యవాసానికి వెళుతూ ఉంటే పురజనులందరూ కన్నీళ్లతో ఆతని వెంట వెళ్లారు. గమనించావు కదా అక్కా! దానిని బట్టి మన రాముడు సామాన్య మానవుడు కాడనీ, లోకాభిరాముడనీ తెలుస్తున్నది కదా! అంతేకాదు సాక్షాత్తూ లక్ష్మీస్వరూపిణి అయిన సీతకూడా అతనిని అనుసరించి వెళ్ళింది. ఇక అతనికి కొదవ ఏముంటుంది. మునివేషధారులై కోదండపాణులై రామలక్ష్మణులు సూర్యచంద్రుల్లా అరణ్యంలో సంచరిస్తూ ఉంటే వాళ్లను ఎదిరించగల ధైర్యం ఎవరికి ఉంటుంది?

అక్కా! నేను నిజం చెప్తున్నాను. నా మాట నమ్ము. త్వరలోనే రాముడు వనవాసం పూర్తి చేసుకుని నీపాదాలకు మ్రొక్కడానికి ఇక్కడికి తప్పక వస్తాడు. ఇప్పుడు నువ్వు దుఃఖంతో పెట్టుకుంటున్న కన్నీళ్లు త్వరలోనే ఆనందభాష్పాలుగా మారుతాయి. అందువల్ల నువ్వు దుఃఖపడకు. నువ్వు ఆదరించవలసిన వాళ్లు ఇక్కడ చాలామంది ఉ న్నారు. మరి అలాంటి సందర్భంలో నువ్వే దుఃఖపడితే ఎలా? వర్షాకాలంలో మేఘం కురిసినట్లు త్వరలో నీకంట ఆనందభాష్పాలు తప్పక కురుస్తాయి. రాముడు తన కోమల హస్తాల స్పర్శతో నీ పాదాలకు వందనం చేసి నిన్ను ఆనంద పరుస్తాడు.

అక్కా! నిరాశ నిస్పృహలకు లోనుకావడం రాముని తల్లివైన నీకు ఎంతమాత్రం తగదు సుమా! రాముని వంటి కుమారుని కన్నందుకు

నువ్వు గర్వపడాలి. లే! దుఃఖం విడిచి పెట్టు. ధైర్యం వహించు. దుర్బలమనస్కులైన వారిని సముదాయించగలదానవు నువ్వు అంటూ తన లలితభాషణంతో కౌసల్యను ఓదారుస్తుంది.

రాముడు సర్వేశ్వరుడనీ, ఆదిమధ్యాంతరహితుడనీ, మహోజ్జ్వల తేజోస్వరూపుడనీ, సకలైశ్వర్యసంపూర్ణుడనీ సుమిత్రకు బాగా తెలుసు. అందుకనే ఆమె అంత గట్టిగా నమ్మకంగా మాట్లాడి శోకసంతప్త అయిన కౌసల్యకు స్వస్థత చేకూర్చగలిగింది. రాముని దివ్యసార్వభౌమాధిపత్యంలో ఆమెకు నమ్మకం కుదిరేటట్లు మాట్లాడగలిగింది.

రామాయణకావ్యంలో అయోధ్యలో సుమిత్ర, కిష్కింధలో తార, లంకలో మండోదరి రామతత్త్వాన్ని గ్రహించిన రమణీమణులు. ఈ ముగ్గురిలో సుమిత్ర రామతత్త్వపు నిత్యదివ్యానుభూతిని పొందిన సత్యదర్శిని. రాముని జన్మరహస్యం, అవతారప్రయోజనరహస్యం పూర్తిగా గ్రహించగలిగిన జ్ఞాని సుమిత్ర. నిత్యము ఆధ్యాత్మిక చింతనాపరురాలు సుమిత్ర.

ఇన్ని చెప్పినా ఇంకా ఒక విషయం ప్రత్యేకంగా చెప్పుకోవలసి ఉంది.

అది మాతృమూర్తిగా సుమిత్ర తన సంతానాన్ని సమాజకల్యాణానికి కృషిచేసే పౌరులుగా తీర్చిదిద్దడం. పిల్లల పెంపకం విషయంలో తల్లులందరకూ ఉత్తమ మార్గదర్శిని సుమిత్ర.

సుమిత్ర అక్షరాలా **'సు మిత్ర'**

* * *

# 5. కైక - కైకేయి

అయోధ్యాధిపతి అయిన దశరథమహారాజుకి ప్రధానమయిన రాణులు ముగ్గురు. ఆ ముగ్గురిలో కైకేయి చిన్నది. ఆమె కీర్తిమతి అని వాల్మీకి మాట. వరుసక్రమంలో మూడవది. ఆమె కేకయరాజవంశంలో పుట్టింది. పెంపకం కూడా సంస్కారయుత వాతావరణంలోనే జరిగింది. ఔదార్యం ఆమె రక్తంలో ప్రవహిస్తూ ఉంటుంది. హేయమయిన ఆలోచనలు, కుతంత్రాలు ఆమెకు కిట్టవు. అయినా పరిస్థితుల ప్రభావం వల్ల, మంథరబోధవల్ల ఆమె మనస్సు చలించి మార్పుపొందింది.

కైకేయి సౌందర్యంలో మేటి. దశరథుని మనస్సుకెక్కిన బోటి. మహారాజు ఆమె వ్యామోహంలో పడి పెద్ద రాణులయిన కౌసల్య, సుమిత్రలను చిన్న చూపు చూస్తాడు. రాజుకి ప్రియమైనది కావడం వల్ల రాజప్రాసాదంలో కైకకి ఎదురులేని ఆధిక్యత లభించింది. ఆమె మాటకు తిరుగులేదు. ఆమెకు అన్నిటా అధికారం ఉంది. ఇంతటి ఆదరణ లభించడంతో ఆమెలో స్వాతిశయం, గర్వం ఏర్పడ్డాయి. తోటి రాణులను పట్టించుకోకుండా వారి ఎడల నిరసనభావాన్ని కూడా ప్రదర్శిస్తుంది.

అయితే కైకకు తన కొడుకు భరతుని మీద ఎంతటి ప్రేమో కౌసల్యా తనయుడయిన శ్రీరాముని ఎడల కూడా అంతటి ప్రేమ కలిగి ఉంది. రామపట్టాభిషేకవార్త కౌసల్యదాసీ ద్వారా కైకదాది మంథరకు ముందుగా తెలుస్తుంది. పైగా అప్పటికి భరతుడు తాతగారి యింట ఉన్నాడు. దశరథుడు ఏదో ఆలోచనతో భరతుడు లేని సమయంలో ఈ అభిషేక కార్యక్రమం చేస్తున్నాడని మంథరకు అనిపిస్తుంది. అనిపించడమే తడవుగా ఆమె కైకవద్దకు వచ్చి శ్రీరామపట్టాభిషేకవార్త కంగారుగా

చెప్తుంది. ఆ వార్త విన్న కైక ఆనందంతో 'మంథరా! ఎంత ప్రియమైన వార్త చెప్పావు. ఇదుగో ఇంత మంచి సమాచారం అందించినందుకు నా యీ ఆభరణం బహుమతిగా తీసుకో' అంటూ అందిస్తుంది.

**రామే వా భరతేవాహం విశేషం నోపలక్షయే**
**తస్మాత్తుష్టాఽస్మి యద్రాజా రామం రాజ్యేభిషేక్ష్యతి"**
**(అయోధ్య.7.35)**

"మంథరా! నాకు రాముడెంతో భరతుడూ అంతే. నాకు వారిరువురి మధ్య భేదం లేదు. అందుకే నాకు రాముని అభిషేకవార్త ఎంతో తృప్తిని ఆనందాన్ని ఇచ్చింది'' అంటుంది. కైక స్వభావం ఇంత ఉదాత్త రమణీయమైంది. అయితే మంథర ఆమెలో స్వార్థాన్ని మొలిపించింది. "కైకా! ఎంత అమాయకురాలివి. సవతికొడుకు అభివృద్ధిలోకి వస్తుంటే ఏ ఆడదైనా సంతోషిస్తుందా? ఇది మృత్యువును ప్రేమించడం లాంటిదే కాదా!

కైకా! జాగ్రత్తగా విను. రాముడికి పట్టాభిషేకం జరిగితే భరతుని బ్రతుకు ఏమౌతుందో ఆలోచించు. నీ అధికారానికి ముప్పు వస్తుంది. దశరథుడు ఇంతవరకు నీకీ వార్త చెప్పకుండా ముహూర్తం పెట్టించాడు. నీ కొడుకు ఊర్లో లేకుండా చూసి హడావిడిగా ఈ రాజ్యాభిషేకం జరిపిస్తున్నారు. ఇదంతా పెద్ద కుట్ర – అంటూ మంథర కైక మనసు కలచివేసింది.

మంథర మాటల మహేంద్రజాలంలో పడిపోతుంది కైక. మంథర ఆడించినట్లు ఆడే మరబొమ్మగా మారిపోతుంది. మంథర చెప్పినట్లు రాముని వనవాసం, భరతుని పట్టాభిషేకం తనకు పూర్వం ఇచ్చిన మాట ప్రకారం వరాలుగా కావాలని అడుగుతుంది.

ఒక్క తృటిలో కైక పూర్వపు కైక కాదు అనిపించేలా మారిపోతుంది.

అపరిమితమైన దురాశ, అకారణం, అనవసరం అయిన భయం ఈ రెండూ కలిసి కైకను సిగ్గులేనిదానిగా, క్రూరురాలిగా మార్చివేసాయి. మంచి లేదు, చెడులేదు, సిగ్గు ఎగ్గూ లేదు, పుణ్యం పాపం లేదు, జంకుకొంకూ లేదు తాను అనుకున్నది సాధించి తీరాలి. అంతే వెనుక నుండి మంథర పురికొల్పుంది. కైకలో బలం పుంజుకొంది. కార్యనిర్వహణలో స్థైర్యం ఏర్పడుతుంది. ముందుకు అడుగువేస్తుంది.. చివరిదాకా పట్టువీడకుండా తన కోర్కెలు నెరవేర్చుకుంటుంది.

మంథర ఎలా జరగాలని ప్రణాళిక సిద్ధం చేసిందో అలాగే జరిగేలా కైక ప్రవర్తించింది. దశరథుడు ఎంతో ఆనందంతో శుభవర్తమానం కైకకి చెప్పడానికి ఆమె మందిరానికి వస్తాడు. అప్పటికి కైక తన అలక గృహంలో నేలపై పొరలాడడం చూసి నిశ్చేష్టుడౌతాడు. కంపించిపోతాడు. ఆమె దుఃఖం చూడలేక ఆమె ఎడల గల ప్రేమవల్ల ఆమె కోరిక ఏదైనా తప్పకుండా తీరుస్తానని అలా తీర్చడంలో తన ప్రాణానికి ముప్పు వాటిల్లినా వెనుదీయననీ చెప్తాడు. ఆమెకు పూర్తిగా నమ్మకం కలగడానికి రాముని మీద ప్రమాణంచేసి వాగ్దానం చేస్తాడు. కైక ఆలోచనలో కోరికలో భయంకరమైన విషయం ఉందని కొంచం కూడా దశరథుడు ఊహించడు. దశరథుని సత్యసంధత కైకమోసపూరితపన్నాగం అనే వలలో చిక్కుకుని బందీ అయిపోయింది. కైక దశరథుని సత్యసంధతనీ ధర్మాచరణాల్ని అనేక విధాల ప్రశంసిస్తుంది. తాను కోరబోయే కోరికలను తప్పక తీరుస్తానని దశరథుడు చేసిన ప్రమాణానికి సాక్షులుగా ఉండండి అంటూ సర్వదేవతలను ఆహ్వానిస్తుంది.

ఆ తర్వాత దశరథుడు శంబరాసురునితో యుద్ధం చేయడం, తాను రథం పడిపోకుండా ఉపాయంగా ఆపడం జ్ఞాపకం చేస్తుంది. ఆ సందర్భంలోనే దశరథుడు తనకు రెండు వరాలు ఇచ్చిన విషయం గుర్తుచేస్తుంది. తీరా నేను ఆ రెండు వరాలు కోరుకున్నాక దశరథుడు

నిరాకరిస్తే తాను ఆ అవమానం భరించలేక చనిపోతానని హెచ్చరిస్తుంది. కైకమాటలకు దశరథుడు తాను ఇచ్చిన మాట తప్పనని పదే పదే నొక్కి వక్కాణించిన పిమ్మటే కైక తన కోరికలను బయటపెడుతుంది. దశరథునిలో గల సత్యవాక్పరిపాలనకీ ధర్మప్రవర్తనకీ ఆయనకు గల కీర్తినీ నిలబెట్టుకోమని ఉపదేశిస్తుంది.

కైక కోరికలు వినగానే దశరథుడికి ముందు ఆశ్చర్యం కలుగుతుంది. ఇది నిజమేనా? లేక కైక తాత్కాలిక ఉద్రేకంలో తిక్కగ ఈ వరాలు అడుగుతోందా అని శంకించాడు. రామునికి వనవాసమా? భరతునికి పట్టాభిషేకమా? నా చెవులు సరిగా విన్నాయా అనుకున్నాడు. కానీ కైక తన కోర్కెలు తీర్చవలసినదే అని పట్టుబట్టేసరికి శోకం భరించలేక చతికిలబడిపోతాడు. తనకు అసత్యవాది అనే మచ్చరాకుండా రక్షించమని కైకపాదాలమీద పడి వేడుకుంటాడు. రామునిపై కనికరం చూపు కైకా! అంటూ దీనంగా ప్రాధేయపడతాడు.

అంతగా మహారాజు, తన ప్రాణవిభుడు కాళ్లమీద పడి అభ్యర్థిస్తున్నా కైక రాతిగుండె కరగలేదు. పైగా తాను చేసిన ప్రతిజ్ఞ, వాగ్దానాల నుండి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని అతనిపై మండిపడుతుంది. రాముడు రాజ్యంనుండి అరణ్యాలకు వెళ్లకపోతే నాకు శాంతిలేదు. కౌసల్య యువరాజమాతగా గౌరవం పొందడం నేను సహించలేను. అంతకంటే నాకు మరణమే మేలు అని ఉద్వేగంతో మాట్లాడిన కైకను చూసి దశరథుడు కంగారుపడతాడు. ఇలా ఆకస్మికంగా కైకకు కౌసల్యమీద ఎందుకింత కసి, రాముని మీద ఇంతటి ద్వేషం ఎందుకు కలిగాయో దశరథునికి అర్థంకాదు.

కైకతో నిదానంగా మరోసారి ఆలోచించమనీ ఆమె కోర్కెలను తీర్చాలని పట్టుబట్టవద్దనీ బ్రతిమాలుతాడు. ఆమె కోర్కెలను తీరిస్తే

సంభవించే పరిణామాలు ఎంత ఘోరంగా ఉంటాయో వివరిస్తాడు. రాముని ఎడబాటు సహించలేక నేను మరణిస్తాను, రాజకుటుంబానికి దుర్దశ ఏర్పడుతుందనీ, భరతుడే నిన్ను నిందిస్తాడనీ కాబట్టి ఈ ఫలితాలు దృష్టిలో పెట్టుకుని మరోమారు ఆలోచించి నిర్ణయం తీసుకో కైకా అంటూ ప్రాధేయపడుతూ హెచ్చరిస్తాడు. మండుతున్న కట్టెల మీద నన్ను పెట్టి చిత్రహింస చేయకు, అంతటి క్రౌర్యం కట్టుకున్న భార్యకు తగదు సుమా, కాస్త జాలిచూపించు అంటూ వేడుకుంటాడు. ఆమెలో ఎలాంటి మార్పూ రాకపోగా బెదిరిస్తాడు. అయినా కఠోరమైన కైకహృదయంలో మార్పు రాలేదు. పైగా రాజుని, రాజుమాటని విసిరికొడుతుంది. సత్యవాక్యపాలకుడనని ఎన్నో దంభాలు పలికావు, చేసిన ప్రమాణాలు నిలుపుకోవలసివచ్చేసరికి ఎలా తప్పించుకోవాలా అని ఉపాయం వెతుకుతున్నావు. ఎంత నిజాయితీపరుడవయ్యా అంటూ హేళన చేస్తుంది. సత్యం గురించి పెద్ద ఉపన్యాసం ఇస్తుంది. శిబి, అలర్కుడు సత్యపాలనలో చూపిన ధైర్యాన్ని గుర్తుకు తెచ్చుకోమని బోధిస్తుంది. కైక మాటలకు దశరథుడు తట్టుకోలేకపోతున్నాడు. కైక తన కోరికలు తీర్చుకునేందుకు మార్గాలు వెతుకుతున్నదే తప్ప తన పట్టుదల వదలడంలేదు. ఈ సందర్భంలో రాముడికి వర్తమానం పంపితే మంచిది. ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది అని సలహా ఇస్తుంది.

దశరథుడు చేసేది లేక సరే అంటాడు. రాముడు వస్తాడు. దశరథుడు ఎలాగో గొంతుపెగల్చుకుని 'రామా!' అని ఆప్యాయంగా పిలుస్తాడు. వెంటనే విషాదాశ్రుజలంతో కళ్లు, సిగ్గుతో కంఠం మూసుకుపోతాయి. దశరథమహారాజుకు ఈలాంటి స్థితి రావడానికి కారకురాలు కైక. ఒకప్పుడు రాముడు నాకు అత్యంత ప్రియమైనవాడు అన్న కైక రాముడితో నిష్ఠూరంగా కోపంతో 'చూడు రామా! నీ తండ్రి మాటను పాలిస్తాను అని ప్రమాణం చేస్తావా? చేస్తే మహారాజుమనసులో మాటను చెప్తాను'

అంటుంది. రాముడు పరిస్థితిని అర్థంచేసుకుని నా ప్రాణానికి ముప్పు వాటిల్లినాసరే నా తండ్రికోర్కె తీర్చడానికి సిద్ధంగా ఉన్నాను. అది నా విధ్యుక్తధర్మమని చెప్తాడు. రాముని మాట విన్నాక కైక తన కోరికలను విడమర్చి చెప్పి నీ తండ్రి ఈ మాటలు చెప్పడానికి వెనుకాడుతున్నాడు. అందువల్లనే ఈ మాటలు చెప్తున్నాను అంటుంది.

కైక కోరికలు విన్న రాముడు 'అమ్మా! ఈ మాట నాకు చెప్పిఉంటే ఈ గందరగోళమంతా లేకుండా పని జరిగిపోయేది కదా!' అన్నాడు. 'నామీద మీకు అలాంటి నమ్మకం లేకుండాపోయినందుకు బాధ పడుతున్నాను' అంటాడు. రాజుగారు, కైక కూడా రాముని సమాధానానికి నిశ్చేష్టులౌతారు.

అరణ్యవాసానికి బయలుదేరే ముందు సీతారామలక్ష్మణులు దశరథుని దగ్గరకు సెలవు తీసుకునేందుకు వస్తారు. మంత్రులు పురోహితులు, దశరథుని మూడు వందలయాభై మంది భార్యలు అక్కడ సమావేశమై ఉన్నారు. అందరూ కైక కోరికకు విస్తుపోతారు. ఆ సందర్భంలో కైక తన మనస్సు మార్చుకుంటుందేమో అని దశరథుడు ఆశపడతాడు కాని కైక పట్టువీడనేవీడదు.

అందరిలో పెద్దవాడు, గౌరవనీయుడు అయిన మహామంత్రి సుమంత్రుడు ముందుగ తన విజ్ఞాపనను విన్నవిస్తాడు. ఇక్ష్వాకు రాజవంశంలో తరతరాలుగా వస్తున్న గౌరవమర్యాదలు నాశం చేయవద్దనీ, ప్రజల ఆశను మన్నించమనీ కైకకు ఉద్బోధిస్తాడు. కైక ఎవరి మాటను లెక్కచేసే స్థితిలో లేదు.

ఈ సందర్భంలో వాల్మీకి ఒక చిన్న సంఘటన వివరిస్తాడు. కైకకు సంబంధించినది.

కైక – కేకయరాజు కూతురు. కేకయరాజుకి చీమలభాష తెలుసు. ఒకనాడు చీమల సంభాషణ వింటూ ఉంటే ఆయనకి నవ్వు వచ్చింది. ప్రక్కనే ఉన్న రాణీగారు కైక తల్లి ఎందుకు నవ్వుతున్నారు? చెప్పండి అని అడిగింది. ఆయన నేను ఆ వివరాలు చెప్పకూడదు. చెప్తే మృత్యువాత పడతాను అంటాడు. భర్త అంత స్పష్టంగా చెప్పినా ఆమె మూర్ఖంగా చెప్పితీరవలసిందే అని రాజును నిర్బంధించింది. రాజు కోపంతో చీదరించుకుని ఆమెకు రాజ్యబహిష్కరణశిక్ష విధిస్తాడు.

ఇక్కడ కైక కూడా ఆమె తల్లిలాగే ప్రవర్తిస్తోంది. తల్లిలో గల మూర్ఖత్వం, అవసరం లేని హానికరమయిన పట్టుదల కైకకు సంక్రమించాయి. సుమంత్రుని సలహా కైక తలకెక్కలేదు. ఏమీ పట్టనట్లు ప్రవర్తించింది.

ఆ తరువాత దశరథుడు రామునితో పాటు సైన్యాన్ని, ఆహార పదార్థాల్ని, దుస్తుల్ని, ధనరాసుల్ని, సేవకుల్ని పంపమని మంత్రితో చెప్తాడు. ఆ మాట వింటూనే కైక కారుచిచ్చులా మండిపడుతుంది. “సిరిసంపదలనన్నిటినీ పిండేసిన శుష్కరాజ్యాన్నా నాకొడుక్కి ఇచ్చేది? ఆహా! ఏమి ఆలోచన? సగరుడు తన కుమారుడు అసమంజసుని ఎలా వెళ్లగొట్టాడో అలాగే రాముణ్ణి అడవికి పంపాలి” అంటుంది కైక. దశరథుడు నిస్సహాయుడై బాధతో మూల్గుతాడు. ఈ విడ్డూరాన్ని గమనిస్తున్న మంత్రి సిద్ధార్థుడు ఏ విషయంలో రామునికి అసమంజసునికి పోలిక ఉందో చెప్పమని నిలదీస్తాడు. అమాయకుల్ని శిక్షించడం క్షమించరాని నేరమనీ ఆ నేరం చేసినది దేవేంద్రుడయినా అగ్నికి ఆహుతి కాక తప్పదని కైకని మందలిస్తాడు. కానీ కైక ఈ హితవచనాలు తలకెక్కించుకునే స్థితిలో లేదు.

ఆ విషయాలను గమనించిన రాముడు కలగజేసుకుని అడవుల్లో తిరిగే సన్యాసికి సిరిసంపదలతో పని ఏముంటుంది? ధరించడానికి

నారవస్త్రాలు ఇస్తే చాలు. ఆహారానికి దుంపలు తవ్వుకోడానికి త్రవ్వుగోల, గునపం లాంటి పరికరాలు ఇస్తే చాలు అంటాడు. ఈ మాటలు వినగానే కైక సీతారామలక్ష్మణులకు ముగ్గురికీ నారవస్త్రాలను కట్టుకోమని ఇస్తుంది. వారు ముతక నారబట్టలు ధరిస్తూ ఉంటే, అందులోనూ సీతకట్టుకుంటూ తడబడుతూ ఉంటే సీత అవస్థ చూడలేక వసిష్ఠమహర్షి చికాకు పడతాడు. కైకని చీదరించుకుని మందలిస్తాడు. కైక కోరిన వరాలలో సీత ప్రసక్తిలేదనీ భర్త వనవాసకాలంలో ఆయన ప్రతినిధిగ సీతకు రాజ్యమేలే హక్కు ఉందనీ ప్రకటిస్తాడు. అయినా సీత రాముని వలె నారచీరలు కట్టుకోవడం చూసి మహదానందం పొందుతుంది కైక. ఆమె మనస్తత్వం చూపరులకు వెగటుపుట్టించే సన్నివేశమిది.

రామాదులు అరణ్యాలకు తరలిపోయాక దశరథుడు కైకతో తనకుగల సంబంధాన్ని తెగతెంపులు చేసుకుంటాడు. తనకు మృత్యువు సమీపించిందని తెలుసుకుని కైక తనమృతదేహాన్ని తాకరాదనీ, భరతుడు తల్లితో ఏకీభవిస్తే తనకు తుది సంస్కారకర్మలు చేయరాదనీ ఆజ్ఞలు జారీచేస్తాడు. కైక ఇవేవీ తనకు పట్టనట్లు అక్కడ నుండి జారుకుంటుంది.

దశరథమరణానంతరం భరతుడు కేకయరాజ్యం నుండి అయోధ్యకు వస్తాడు. తల్లి సదనానికి వెళతాడు. తండ్రి యోగక్షేమాలు అడుగుతాడు. దశరథుని మరణవార్త యథాలాపంగా జీవులందరు చివరకు పొందవలసిన స్థితిని మృత్యుసన్నిధిని రాజు చేరుకున్నాడని, ఏమాత్రం చింతపడకుండా చెప్తుంది. భరతుడు తల్లిధోరణికి చికాకుపడతాడు. తనను తీసుకు వెళ్లడానికి అయోధ్యనుండి వచ్చిన దూతలతో భరతుడు తన తల్లిని గురించి అడిగిన మాటల్లో కైకేయి గురించి భరతునికి గల అభిప్రాయాన్ని వాల్మీకి స్పష్టంగాచెప్పాడు.

**ఆత్మకామా సదా చండీ క్రోధనా ప్రాజ్ఞమానినీ!**
**అరోగా చాపి మే మాతా కైకేయీ కిముదాచ హ ॥**

అయోధ్య. 70 సర్గ-10 శ్లో

స్వప్రయోజనంలో ఆసక్తిగలది, తనను గురించి తాను చాలా తెలివి గలదానినని తలచుకొనేది, తీవ్రస్వభావంకలది, కోపిష్ఠి అయిన నాతల్లి కైకేయి తన బంధువుల గురించి ఏమన్నది అని ఈ శ్లోకానికి అర్థం.

తల్లి ద్వారా జరిగిన సంగతులన్నీ తెలుసుకుంటాడు. దశరథుడు రామునికి పట్టాభిషేకం చేయతలపెట్టాడు, ఆ విషయం తెలిసి కైక వరాలు కోరడం రాముడు సీతాలక్ష్మణులతో కలిసి వనవాసానికి వెళ్లడం తెలుసుకున్న భరతుడు దుఃఖసముద్రంలో మునిగిపోతాడు. తన తల్లిబుద్ధి భర్తను మృత్యువాత పడేసింది. అన్నను అడవులకు తోలేసింది. తల్లిచేసినది మహాద్రోహమని దాన్ని సరిదిద్దడానికి ఒక మంచి ఆలోచన చేస్తాడు. రామునికి బదులుగా తాను వనవాసం చేయాలనీ, రాముణ్ణి ఆహ్వానించి అయోధ్యకు ప్రభువుగా పట్టాభిషేకం చేయాలనీ నిర్ణయించుకుంటాడు. కైక తెల్లబోతుంది. ఆమె గాలిలో మేడ గట్టింది. అది గాలిలోనే అంతరించిపోయింది. తనను, మంథరను తనకొడుకు నిరసించడాన్ని భరించలేకపోతుంది. మంథరను రక్షించే భారం మాత్రం వహిస్తుంది.

తన ప్రవర్తన దుష్టపూరితమని, మోసపూరితమనీ తనకుమారుడు భరతుడు గుర్తించి గర్హించడంతో కైక మనస్సుకు గట్టిదెబ్బ తగిలింది. కైక చేసిన కుట్రతో తనకు ఎలాంటి సంబంధం లేదని భరతుడు ప్రకటించడంతో ఆమె కర్తవ్యతామూఢురాలయింది. మనస్సు పశ్చాత్తాపంతో నిండిపోయింది.

భరతుడు - పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నంలో ఆమె మనసారా సహకరించింది.

అయితే ఇక్కడ రామాయణపాఠకులు ఆలోచించవలసిన విషయం ఒకటి ఉంది. రాముడు మూర్తీభవించిన ధర్మమనీ, తనంటే రామునికి ఎనలేని గౌరవమనీ, ప్రేమ అనీ పదే పదే కైక చెప్తూనే ఉంది. భరతుని ఎడల రామునికి గల వాత్సల్యం, రాముని పట్ల భరతునికి గల భక్తి కైకకు పూర్తిగా తెలుసు. అయినా మంథరవ్యూహాన్ని ఆమోదించింది. దానికి కారణం – రాముడు అవతారపురుషుడనీ అతడు అయోధ్యలో సింహాసనం ఎక్కి కూర్చుంటే అరణ్యసీమల్లోని రాక్షససంహారం జరుగదనీ కైకకు తెలుసు. అందుకే రాముని అవతారప్రయోజనాన్ని సిద్ధింప చేయడానికి ఆమె లోకం చేసిన అవహేళనను, కట్టబెట్టిన అపకీర్తిని, ఓర్పుతో భరించింది.

కైకపాత్రప్రాముఖ్యాన్ని భరద్వాజమహర్షి భరతునితో వివరిస్తాడు.

“శ్రీరాముని వనవాసం విధినిర్ణయమనీ, దుష్టుల నిర్మూలనానికి అది అత్యవసరమనీ, అది సంధానపరచడంలో కైకేయి కేవలం ఒక పనిముట్టు మాత్రమే అనీ, కాబట్టి ఆమెను ప్రేమతో గౌరవంతో ఆదరించాలనీ భరద్వాజమహర్షి భరతునికి బోధపరుస్తాడు, ఆదేశిస్తాడు కూడా. మహర్షి వచనాలు పరమసత్యాలు.

తనకు తెలియకుండానే అవతారప్రయోజనం సిద్ధిపొందే ప్రయోగంలో ముఖ్యపాత్రవహించిన మహామహిళ కైకేయి.

* * *

# ౬. మంథర

దశరథమహారాజు ముద్దుల భార్య కైకకు పుట్టింటి నుండి వచ్చిన అరణపు దాసి మంథర. ఒక విధంగా చెప్పాలంటే ఆమె కైకను పెంచి పెద్ద చేసిన దాది. వాల్మీకిమహర్షి ఆమెను 'పాపదర్శిని' అని పాఠకులకు పరిచయం చేసాడు. ఆమె బాహ్యారూపం పరిశీలిస్తే – ముదుసలి, కురూపి, పైగా మరుగుజ్జు. ఇలా శారీరకంగా అవయవాలకే కాదు మనస్సుకు కూడా. వంకరగల ఆమె చెడుగుణాలన్నీ ప్రోగుచేస్తే మంథర రూపం తయారయిందా అనిపించేలా ఉంటుంది. ఆమెలో స్వార్థపరత్వం, లోభత్వం, ద్వేషం కలిసి ప్రవహిస్తున్నాయి. అయోధ్యలోని దశరథరాజ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసే విద్రోహవ్యూహాన్ని రచించిన నిపుణురాలు ఆమె.

దశరథమహారాజు శ్రీరామునికి పట్టాభిషేకం చేయతలపెడతాడు. గురువుల, పురోహితుల, సామంతరాజుల అభిప్రాయాలు సేకరిస్తాడు. శ్రీరామపట్టాభిషేకానికి అందరూ సుముఖంగా, ఉత్సాహంగా తమ అంగీకారాన్ని తెలియబరుస్తారు. దశరథుడు సంతోషంతో ఉప్పొంగిపోయి త్వరలో పట్టాభిషేకానికి ముహూర్తం తానై పెడతాడు. అయోధ్యానగరం అంతా ఆనందోత్సాహాలతో అలంకరిస్తారు. సీతారాములకు మరునాడు జరుగబోయే పట్టాభిషేకానికి దీక్ష ఇస్తాడు వసిష్ఠమహర్షి.

పట్టాభిషేకం ఆలోచన చేసేనాటికి భరతశత్రుఘ్నులు అయోధ్యలో లేరు. భరతుని మేనమామగారి యింటికి వెళ్లారు. భరతుడు ఊర్లో లేనప్పుడే ఈ పట్టాభిషేకం జరిగిపోవడం మంచిదని దశరథుని తలంపు.

సీతారాములు దీక్షలో ఉన్నారు. ప్రజలు ఆనందంలో తేలి ఆడుతున్నారు. అలాంటి వేళలో మొదటిసారిగా మంథర ప్రవేశం

జరుగుతుంది. కైకేయిమేడమీదకు యాదృచ్ఛికంగా వెళ్లిన మంథర జనుల కోలాహం, ఊరి అలంకరణ, దేదీప్యమానంగా వెలుగుతున్న దీపాలు అభిషేకసంభారాలతో హడావిడిగా తిరుగుతున్న సన్నిహితుల నవ్వులు వినబడతాయి, కనబడతాయి.

ఏమిటీ కోలాహలం అంటూ ఆరాతీసింది. విషయం వినీ వినగానే మేడమీద ఉన్న మనిషి ఒక్కసారిగా కిందకి దిగి కైకశయనమందిరం వైపు దారితీసింది. మంథర మేడదిగడంతోనే రామాయణకథ మలుపు తిరిగిపోతుంది.

శయనమందిరంలో ఉన్నకైకలో విషబీజం నాటుతుంది. రాముడికి పట్టాభిషేకమట. నీ భరతుడిని కాదని ఈ పనిచేయడం ఎంత ఘోరం? ఎంత ఘోరం? అంటూ మండిపడుతుంది.

కాని కైక మంథరను చూసి ఆమె వాగ్ధోరణి గమనించి ఆశ్చర్యపోతుంది. నిజానికి కైకకు భరతుని మీద కంటే రాముని మీదనే ఎక్కువ మమకారం. అందువల్ల ఆమె నిండుమనస్సుతో ఆనందిస్తుంది. మంథరా! రాముడైతేనేమి, భరతుడయితేనేమి ఎవరయినా నాకు ఒక్కటే. ఇద్దరూ నాకు ఇష్టులే అని మంథరకోపాగ్నిని చల్లార్చాలని ప్రయత్నిస్తుంది. కైకధోరణిని మంథర తట్టుకోలేకపోతుంది.

మూఢురాలా! అని కైకను మందలిస్తూ ఆమె ఉపన్యాసం ఆరంభిస్తుంది. పాపదర్శిని అయిన మంథర వాక్చాతుర్యం ఇక్కడనుండి ఆరంభమవుతుంది.

"కైకా! నువ్వు మూఢురాలివి. నీ సౌభాగ్యానికి నువ్వు మురిసి పోతున్నావు కానీ, నీ అందచందాలను అనురాగాన్ని దోచుకున్న దశరథమహారాజు నీకు తలపెట్టిన ద్రోహాన్ని నువ్వు తెలుసుకోలేక పోతున్నావు? అంతేకాదు ఒక్కసారి గమనించు నీ కష్టం, నా కష్టం, నీ

సుఖం, నా సుఖం అంటూ ఆపేక్ష కురిపిస్తుంది. మెత్తని మాటలతో ధర్మం నటిస్తూ నిన్ను నీభర్త మోసం చేసాడు. అందుకే భరతుణ్ణి మామగారి యింటికి పంపి హడావిడిగా రాజ్యాభిషేకాన్ని తలపెట్టాడు. నువ్వు నీ ప్రాణనాథుడని భావించి ప్రేమించి సేవిస్తున్న నీ భర్త ఈనాడు నీకు పరమశత్రువుగా తయారయ్యాడు. నువ్వు పామును పెంచినట్లు నీ భర్తమీద ప్రేమను పెంచుకున్నావు. సర్పశేషం, శత్రుశేషం తగదని ఇందుకే పెద్దలు చెప్పారు.

కైకా! నా మాటలు నీకు అర్థమవుతున్నట్లుగా లేదు. నామాటలు విని కూడా ఇంకా చిరునవ్వుతో నామాటలు వింటూ, నా ఆందోళన చూసి ఆశ్చర్యపోతున్నట్లుగా ముఖం పెట్టావు. ఓ పిచ్చిదానా! పైపై మెరుపులు, తియ్యని మాటలు నమ్మి మోసపోకు. కాస్త నా మాట నమ్ము. నేను చెప్పినట్లు చెయ్యి అని మంథర అనేక విధాల కైక మనస్సును కలుషితం చేసేందుకు ప్రయత్నిస్తుంది.

కాని కైకకు శ్రీరాముని మీద ఎనలేని ప్రేమ. ఆమె ఆలోచన పవిత్రంగా ఉంది. అందుకే రాముడు రాజు అయితే అంతకుమించి నాకు ఏమి కావాలి? ఎంతటి తియ్యటి కబురు చెప్పావు. అమృతం లాంటి మాట వినిపించావు. ఇంత విశేషమయిన శుభవార్త తెచ్చినందుకు – నీకు ఏమి కావాలంటే అది ఇస్తాను కోరుకో అంటూ ఆనందంతో అడుగుతుంది.

ఇంతటి ఉత్తమురాలయిన కైక మనస్సులో విషబిందువు నాటింది మంథర.

దురాలోచన రాకుండానే ఉండాలి కానీ వస్తే ఇక చస్తే పోనేపోదు. అది విషం కంటే దారుణంగా పరిణమిస్తుంది. మామూలుగా విషం తాగితేనే ప్రమాదం. మాటల్లో విషం వింటే చాలు అంటుకుపోతుంది.

మంథర మాటల్లో ఇలాంటి విషం ఉంది. ఆ విషమే కైక మనస్సును తీవ్రంగా కాటేసింది.

శ్రీరాములవారి పట్టాభిషేకవార్త వినగానే కైక సంతోషంతో తన కంఠహారాన్ని ఈ వార్త అందించిన మంథరకు బహుమానంగా ఇస్తుంది. కాని మంథరకు అది సర్పహారంగా కనబడుతుంది. భరించరాని కోపంతో ఆ కంఠహారాన్ని కైక మీదకు విసిరేస్తుంది.

"కైకా! శోకసముద్రంలో ఉండాల్సిన నువ్వు ఇలా సంతోషంతో మాట్లాడుతున్నావేమిటి? నీ సవతి వల్ల నీకు రాబోయే దౌర్భాగ్యాన్ని నువ్వు గమనించలేకపోతున్నావు. నీ భర్తకు భరతుడంటే మహాభయం. అందుకే భరతుడు ఇంటికి దూరంగా ఉన్నప్పుడే ఈ పట్టాభిషేకానికి ఏర్పాట్లు చేస్తున్నాడు. నీకీ విషయం చెప్పను కూడాలేదు. లక్ష్మణుడు, శత్రుఘ్నుడు చిన్నవాళ్లు. రాముడితరవాత రాజ్యానికి ఉత్తరాధికారి భరతుడే. అందుకే భరతుణ్ణి దూరం చేస్తే ప్రమాదం లేకుండా పోతుందని తండ్రి కొడుకూ కూడబలుక్కుని యిలా కుట్ర పన్నారు.

రాముడు అస్త్రవిద్యలో ఆరితేరిన మహావీరుడు. రాజకీయాల్లో రాణకెక్కినవాడు. తెల్లవారగానే శ్రీరామునికి పట్టాభిషేకం. ఆ పట్టాభిషేకం పూర్తికాగానే కౌసల్యాదేవి రాజమాత అవుతుంది. కొత్తహోదా వరిస్తుంది ఆమెను. రాజమాతగా తన అధికారం చలాయిస్తుంది. ఆమె సన్నిధిలో నువ్వు చేతులు కట్టుకుని నిలబడవలసి వస్తుంది. ఆలోచించుకో. నీ కొడుకు భరతుడు కూడా రామమాత, రాముడూ ఎలా చెప్తే అలా నడుచుకోవాలి ఇకనుండి. ఆ రాజమాత కౌసల్యకోడలు కళకళలాడుతూ, కులుకుతూ నడుస్తుంది.. నీ కోడలు ఈడ్చుకాళ్లు ఏడుపు ముఖంతో ఏ మూలో పడి ఉండవలసి వస్తుంది.

మంథర ఇంత వివరంగా ఇన్ని మాటలు చెప్పినా కైకమనసును మార్చలేకపోయింది. పైగా తానై శ్రీరాముని సుగుణాలను అన్నిటినీ

కొనియాడుతూ మంథరా! నాకు ప్రతిదినం సేవచేసే రాముడు రాజుకావడం నాకు చాలా ఇష్టం. అందరికీ ఆత్మీయుడయిన రాముడు రాజు అవుతున్నాడు అంటే అందరికంటే ఎక్కువగా సంతోషించాలి మనం. నువ్వు ఇలా దిగులుపడి నన్ను రెచ్చగొట్టడం నాకు అసలు నచ్చలేదు. నాకు భరతుడెంతో రాముడూ అంతే. ఒక విధంగా చూస్తే ఇంటికి పెద్దవాడు రాముడు రాజు కావడమే నాకు ఉచితమనిపిస్తోంది. రాజు కావడానికి భరతుని కంటే రాముడే యోగ్యుడు అనిపిస్తోంది.

కైకధోరణికి మంథరకి కోపం వచ్చింది. తాను చెప్పిన ఏమాటకు కైక మనసు మారకపోవడం భరించలేకపోయింది. ఇక లాభంలేదు. నేను భావికాలంలో జరగబోయే అనర్థాలు ఏకరువు పెట్టాలి అని నిర్ణయించుకుంది. పిచ్చికైకా! ఈనాడు రాముడికీ భరతుడికీ భేదం లేకపోవచ్చు. కానీ రామరాజ్యం రామతనయులకు సంక్రమిస్తుందేకానీ భరతుని పిల్లలకు రానేరాదు. దానితో భరతుడికి రాజ్యంమీద అధికారం పూర్తిగా పోతుంది. జాగ్రత్తగా తెలుసుకో. రాజసింహాసనం మీద ఎవరో ఒకరే కూర్చుంటారు. కానీ అందరూ కూర్చునేందుకు వీలుండదు. కాబట్టి ఇప్పుడు సింహాసనం మీది పట్టుపోతే ఇక ఈ భరతుడికి కానీ నీకు కానీ మంచినీళ్లు కూడా పుట్టవు. ఇక మీ తల్లీ కొడుకులిద్దరూ కౌసల్యకు దాస్యం చేయవలసిందే. నేను ఇంత లోతుగా ఆలోచించి నీ మేలు కోరి హితవు చెప్తున్నాను. రాముడు కనుక రాజైతే భరతునికి ప్రవాసం తప్పదు. దేశాంతరమే కాదు లోకాంతరం ప్రాప్తించినా ఆశ్చర్యంలేదు. పెళ్లయిన కొత్తలోనే మేనమామగారి యింటికి పంపించారు కదా. ఇంకా పెద్దయిన తరువాత రామలక్ష్మణులిద్దరూ కలిసి భరతుణ్ణి ఏమయినా చెయ్యగల సమర్థులు. కాబట్టి కైకా నువ్వు పరిస్థితులు బాగా ఆకళింపుచేసుకుని రాజ్యం నీ తనయునికి ఇప్పించి రాముణ్ణి అరణ్యాలకు పంపే ఉపాయం ఆలోచించు. నువ్వు ఈ

సమయంలో సరియైన నిర్ణయం తీసుకుని ఉపక్రమించకపోతే రామమాత కౌసల్య చేతుల్లో నువ్వూ, నీ కొడుకూ చిక్కులు పడక తప్పదు. రాముడు రాజయితే నీకు పరాభవం తప్పదు, అని మంథర కైకమనస్సును కలచివేసే విషబీజం నాటింది. మంథర మాటలను విన్న కైకలో పలు ఆలోచనలు చెలరేగాయి.

నెమ్మదిగా కైకమనస్సులో అనుమానాలు మొలకెత్తాయి. మంథర మాటల్లో నిజం ఉందేమో అనిపించింది. మంథర మాటలు మంత్రాలుగా వినిపించాయి. చేతులారా ఒక అవకాశం వదిలేసుకుంటున్నానా? అనే ఆందోళనతో కైక ఎటూ నిర్ణయించుకోలేకపోతుంది. కానీ మంథర మాటి మాటికి హెచ్చరించడంతో ఏమయినాసరే రామునికి పట్టాభిషేకం జరిగి అతడు రాజు కారాదు అనుకుంటుంది. రాముడు అయోధ్యలో ఉండరాదు. అతడు అరణ్యానికి వెళ్లితీరాలి. భరతుడికి పట్టాభిషేకం జరిగితీరాలి. అయితే భరతుడికి పట్టాభిషేకం జరిపించడానికి తాను ఏమి చేయాలి? అనే ప్రశ్నకు సమాధానం చెప్పమని మంథరనే అడిగింది కైక. మంథర మాటకారితనం ఎంతటి విశేషమయినదో ఇక్కడ స్పష్టపడుతుంది.

ఏమిచేయమంటావే మంథరా! అని కైక అడగ్గానే మంథర చిఱునవ్వు నవ్వింది. నీకు లోగడ మహారాజు రెండు వరాలు ఇచ్చాడు కదా? నీకు గుర్తులేదా అంది. ఆ మాట వింటూనే కైక పడకమీద నుండి లేచి కూర్చుంది. మంథర ముందు కైక మనస్సు మార్చింది. ఇప్పుడు శారీరక స్థితిని కూడా మార్చింది. వెంటనే అలనాటి విషయాన్ని అందంగా వర్ణించ సాగింది.

'పూర్వం దేవతలకు రాక్షసులకు యుద్ధం జరిగినప్పుడు దశరథ మహారాజుగారు మిమ్మల్ని కూడా వెంట తీసుకువెళ్లారు. ఆ రాక్షసులలో

శంబరాసురుడు అనే వాడొకడు ఉన్నాడు. వాడు రాత్రి వేళ నిద్రపోయేవాళ్లను ఎత్తుకుపోయి చంపేసేవాడు. అలాంటి క్రూర రాక్షసుడితో యుద్ధం చేస్తూ దశరథమహారాజు స్పృహ తప్పిపడిపోయారు. ఆ సమయంలో మీరు ధైర్యంవహించి రథం నడిపి రాజుగారి ప్రాణాలను కాపాడారు. మీ ధైర్యసాహసాలకు మెచ్చుకొని రాజుగారు రెండు వరాలు కోరుకోమని మిమ్మల్ని ప్రేమతో అడిగారు. మీరు నాకు ఇప్పుడు వరాలతో పనిలేదు. నాకు కావలసినప్పుడు నేనే అడుగుతాను అని మీరు సమాధానం చెప్పారు. ఈ వృత్తాంతమంతా మీరే స్వయంగా నాకు చెప్పారు. లేకపోతే నాకు ఎలా తెలుస్తుంది. మీమీదగల అనురాగం, అభిమానం వల్ల నేను ఈ సంగతులన్నీ నా మనస్సులో భద్రపరచుకున్నాను. ఆనాటి వరాలు అడిగేందుకు ఇంతకుమించిన అవకాశం మరొకటి ఉండదు. కాబట్టి కైకా! నువ్వు మొదటి వరంగా భరతుడి పట్టాభిషేకం, రెండవ వరంగా రాముడి అరణ్యవాసం కోరుకో. రాజుగారు సత్యవ్రతులు. ఆడినమాట తప్పరు. నువ్వు కోరిన వరాలు కాదు అనలేదు.

ప్రస్తుతం రాముడు రాజ్యానికి దూరంగా అరణ్యాలకు వెళితే పద్నాలుగు సంవత్సరాలు గడిచేసరికి ప్రజలు రాముణ్ణి పూర్తిగా మరచిపోతారు. భరతుడికి రాజ్యం శాశ్వతంగా దక్కుతుంది. రాముడి వనవాసకాలం పదునాలుగు సంవత్సరాలని నొక్కిచెప్పు. అలాగే రేపటి ముహూర్తానికే భరతుడికి పట్టాభిషేకం కోరుకో. నీ కోరిక తీర్చుకో. రాజమాతగా కీర్తిని పొందు అంటూ మంథర బోధిస్తుంది.

కైకకు తన అందం మీద, యౌవనం మీద, మహారాజుకు తనమీద ఉన్న మక్కువ మీదా ఎంతో నమ్మకం. తన భర్త తన మాట దాటలేడని ఆమెకు తెలుసు. ఆమె సౌభాగ్యమదగర్వంతో ఉంది. వీటిని గుర్తించిన మంథర కైక తాను చెప్పిన ఉపాయంతో భరతుణ్ణి తప్పక రాజుగా

చేయగలదు అనుకుంటుంది. అయితే మంథర ముందు వెనుకలు బాగా గమనించగల అనుభవజ్ఞురాలు. అందుకే కైకతో మహారాజుగారు రత్నహారాలు బహూకరించి మురిపించి మరిపించగలదు. రాజుగారి మాటలకు పైపై బహుమానాలకు భ్రమసిపోకు. నేను చెప్పిన రెండు వరాలు తప్ప మరి వేటికీ అంగీకరించనే అంగీకరించకు అని చెప్పి కైకను ఆందోళనతో కూడిన ఆలోచనలో పడేసి అక్కడ నుండి తప్పుకుంటుంది.

మంథర గురించి ఆరంభంలో మనం ఆమె మరుగుజ్జు అనీ, అనాకారి అనీ చెప్పుకున్నాం. వాల్మీకిమహర్షి అలాగే పరిచయం చేసాడు పాఠకులకి.

కానీ ఇప్పుడు కైకకు ఆమె నడకలో అందం, ఆకర్షణ కనబడ్డాయి. ఆమె తెలివితేటలకు ఆశ్చర్యపోతుంది కైక. ఎంత తెలివిగలది ఈ పొట్టిది. పొట్టివాళ్లకు పుట్టెడు జిత్తులంటారు కదా. ఆ మాట ఈమె విషయంలో పూర్తిగా నిజం. పొట్టివాళ్ల అందరిలో ఈ పొట్టిది మరీ గట్టిదిగా అనిపిస్తోంది. ఇప్పుడు ఇది నాకు సుందరిలా కనిపిస్తోంది. వంటినిండా వంకర టింకరలున్నా ఇప్పుడు నాకు చూడముచ్చటగా ఉన్నాయి. గూనితో వంగిన ఈమె ఇప్పుడు గాలికి వంగిన తామరతూడులా అందంగా నాజూకుగా కనిపిస్తోంది.

శంబరాసురుడికి వేలకొలదీ మాయలు తెలుసు అంటారు. ఆ మాయల్నీ ఈ మంథర గుండెలోనూ గూనిలోనూ కాపురం ఉన్నట్లుగా ఉన్నాయి. మంథరగూని కైకకు ఇప్పుడు మనోహరంగా కనిపించ సాగింది. ఆ తన్మయత్వంలో ఉన్న కైక మంథరా! నువ్వు ఆలోచించి తయారుచేసిన ప్రణాళిక అమలుపరచబడి భరతుడే గనుక రాజయితే నీ గూనికి చందనంపూసి బంగారు తొడుగు, హారాలు చేయించి

బహూకరిస్తాను. నీ నుదుట బంగారు బొట్టు పెట్టిస్తాను. నేను ఇచ్చిన పట్టుబట్టలు కట్టుకుని బంగారు నగలు పెట్టుకుంటే దేవతలా మెరిసిపోతావు. ఇప్పుడు నువ్వు నాకు సేవలు చేసినట్లు ఎందరో నీకు చాకిరీ చేస్తారు. నీ కాళ్ల దగ్గర పడి ఉంటారు అంటూ పొగుడుతుంది.

కైకమాటలకు మంథర మురిసిపోతుంది. మరోసారి కైకను హెచ్చరించి, అవకాశాన్ని జారవిడుచుకోకని గట్టిగా హెచ్చరించి మరీ వెళుతుంది. మంథర ఎంతటి మాటకారో ఎంతటి కార్యసాధకురాలో గమనించాలి మనం. అంతఃపురంలో ఉంటూ ఒకసామాన్య దాసి ఎంత గొప్పగా రాజకీయాలు చేయగలదో, సింహాసనం మీద ఎవరు కూర్చోవాలి అన్న విషయం నిర్ణయం చేయగలదో మంథర చేసి చూపింది.

మంథరవ్యూహరచనను యథాక్షరంగా నడిపించిన కైక వల్ల – శ్రీరాముడు వనవాసి అయ్యాడు. భరతుడు తల్లిచేసిన పనికి కుమిలిపోయాడు. కోపంతో రగిలిపోయాడు.

తాను అయోధ్యలో లేనివేళలో తన తల్లి చేసిన కుట్రలో తనకు ఎలాంటి సంబంధం లేదనీ దానివల్ల లభించే ప్రయోజనాలను తాను లబ్ధిపొందే ప్రశ్నలేదనీ భరతుడు గొంతెత్తి పలికాడు. తన తల్లి వలన ఏర్పడిన విషమ పరిస్థితులను సరిదిద్దితీరుతానని, భరతుడు గంభీరంగా ప్రకటిస్తాడు. కైక కట్టిన గాలిమేడ భరతుని కోపాగ్నిలో కాలి బూడిదైపోయింది. కైక శోకంలో మునిగిపోయింది.

కైక దశరథుడిని భగ్నమనోరథుణ్ణి చేసింది.. భరతుడు కైకను భగ్నమనోరథను చేసాడు. ఒకరికి ఎవరు మనోవ్యథ కలిగిస్తారో, వారికి మరెవరో ఒకరు మనోవ్యథ కలిగిస్తారు, అన్న సూక్ష్మ రహస్యం ఈ ఘట్టం నిరూపిస్తుంది.

ఇంతటి విషాదఘట్టానికి వ్యూహరచన చేసిన మంథర పరిస్థితి ఏమయిందో పరికిస్తే విధి తన కర్తవ్యాన్ని ఎన్నడూ మర్చిపోదు. తన మాట కైక విని రామపట్టాభిషేకం కాకుండా చేసినందుకు మంథర పరమానందంభరితురాలయింది. తళతళా మెరిసిపోయే చీనిచీనాంబరాలు ధరించి కులకడం మొదలుపెట్టింది. రత్నాభరణాలు ముత్యాల హారాలు అలంకరించుకుని మంథర భూమి మీద నిలబడలేకపోతోంది. ఆకాశ వీధిలో తేలిపోతోంది. అంతఃపురంలో దశరథుడు మరణించడంతో విషాదం ఆవరించి ఉంది. ప్రజలందరూ విషాదంలో మునిగిపోయారు. అలాంటి వాతావరణంలో మంథర ఇలా ఉల్లాసంగా ఆనందంగా తిరగడం అందరికీ కోపం తెప్పించింది. ఆమె మీద అసహ్యం కలిగింది. ప్రజలందరూ ఆమెను తిట్టిపోస్తున్నారు. తమ మహారాజకుటుంబానికి కలిగిన ఈ భయంకరమయిన ఆపదకు కారణభూతురాలు మంథరే అని రాజభటులందరూ ఆమెను తూలనాడడం మొదలుపెట్టారు. అలాంటి సన్నివేశంలో ఆమె రాముని తమ్ముడు శత్రుఘ్నుని కంటబడింది. ఆమెను చూడగానే శత్రుఘ్నుడు కోపం ఆపుకోలేకపోతాడు. ఆమె జుట్టుపట్టుకుని భరతుని వద్దకు ఈడ్చుకొని వచ్చాడు. దారిపొడవునా మంథర ఘొల్లుమని ఆక్రోశిస్తూ రక్షించమని కాళ్లా వేళ్లా పడుతూనే ఉంది. కైక కూడా ఆమెను రక్షించడానికి ప్రయత్నిస్తుంది. శత్రుఘ్నుని కోపావేశానికి ఆమె కూడా భయపడుతుంది. తన కొడుకు భరతుని వద్దకు వేగంగా పరుగుతీస్తుంది. శత్రుఘ్నుడు మంథరను భరతుని ముందు నిలబెట్టి ఆమె చేసిన ఘోరమైన నేరానికి తగినట్లుగా శిక్షవిధించమంటాడు.

కోపంతో మండిపడుతున్న తమ్ముణ్ణి, భయంతో వణికిపోతున్న తల్లిని చూస్తాడు భరతుడు. ముందు తమ్ముని కోపం తగ్గించడానికి ఒక నీతి వాక్యం చెప్తాడు. శత్రుఘ్నుడా! స్త్రీలు ఎంతటి ఘోరమైన నేరం

చేసినా ద్రోహం చేసినా వారికి మరణదండన విధించరాదు. అందువల్లనే నేను నా తల్లి విషయంలో తొందరపడలేదనీ, మంథరను వదలివేయమని, కొట్టడం వంటి హింసాకార్యక్రమాలు చేయవద్దని తమ్ముడికి నచ్చచెప్తాడు. తమ్ముడూ! నువ్వు మరో విషయం కూడా గుర్తుపెట్టుకో. స్త్రీలకు ఎలాంటి కఠినశిక్ష విధించినా రాముడు అంగీకరించడు. గర్హిస్తాడు కాబట్టి కాస్త నిగ్రహం చూపు అంటూ అతని కోపాన్ని చల్లార్చుతాడు. భరతుని హితోపదేశంతో శత్రుఘ్నుడు మంథరను విడిచిపెట్టేసాడు. ఇప్పుడో క్షణంలోనో మృత్యువాత పడబోతున్నాను అని గజగజలాడుతున్న మంథర ప్రాణాలతో బయటపడినందుకు ఆనందపడుతుంది. తన అదృష్టానికి తానే మురిసిపోతుంది. కైకమ్మ పాదాలమీద పడి క్షమించమని ప్రార్థిస్తుంది. కైక ఆమెను క్షమించి ఆదరించి ఆశ్రయం ఇస్తుంది.

దుష్టతంత్రాన్ని పన్ని అమలుపరచి విజయం సాధించామనుకున్న మంథరగర్వం, కైకగర్వం మంటకలిసాయి. దీనాతిదీనమైన స్థితిలో పడ్డారు.

అయితే కైక, మంథర పాత్రలు దుష్టపాత్రలుగా నిర్ణయించుకునే ముందు మరో మారు ప్రశాంతచిత్తంతో ఆలోచించాలి పాఠకులు.

శ్రీరాముని పట్టాభిషేకం నిరాటంకంగా జరిగి ఉంటే రామావతార ప్రయోజనమే చెడిపోయేది. యువరాజుగా రాముడు తాను నిర్వహించ వలసిన విధుల్లో నిమగ్నుడై అయోధ్యలోనే ఉండిపోవలసి వచ్చేది.

నాటికి లోకంలో వ్యాపించి ఉన్న దుష్ట రాక్షసశక్తుల సంహారానికి అవకాశమే ఉండేది కాదు. అందువల్ల రాముడు వనవాసం చేయడం– అవతారప్రయోజనానికి అత్యంత ప్రధానమయిన విషయం.

ఈ అరణ్యవాసనిర్ణయంలో మంథర వనవాసకాలపరిమితి పద్నాలుగు సంవత్సరాలుగా నిర్ణయించడంలో ఏమైనా ప్రత్యేక విశేషం ఉందా అని పరిశీలిస్తే చట్టరీత్యా ఒకరి హక్కుకి కాలదోషం పట్టడానికి కలియుగంలో పన్నెండు సంవత్సరాలు, ద్వాపరయుగంలో పదమూడు సంవత్సరాలు లాగ, త్రేతాయుగంలో పద్నాలుగు సంవత్సరాలు పరిమితి ఉండిఉంటుంది అని వ్యాఖ్యాతలు వివరించారు. మంథరకి లౌకిక వ్యవహారజ్ఞానం చాలా ఎక్కువ. ఆనాడు అమలులో ఉన్న చట్టాలు ఆమెకు సుపరిచితాలు అన్నమాట. ఎంతో ముందుచూపుతో ఈ కాలనిబంధన పెట్టి ఉండవచ్చు.

శ్రీరాముడు పద్నాలుగు సంవత్సరాల వనవాసం పూర్తి చేసుకొని అయోధ్యకు తిరిగి వచ్చినా ఆతనికి సింహాసనం మీద హక్కు లేకుండా పోతుంది. చట్టరీత్యా ఆ హక్కు వినియోగించుకునే కాలపరిమితి దాటిపోయింది కనుక రామునికి ప్రశ్నించే అవకాశమే ఉండదు అని మంథర ఆలోచన.

రాజనీతిజ్ఞురాలిగా మంథరను ఈ సందర్భంలో గుర్తించక తప్పదు.

అయోధ్యరాజమందిరంలో రాజ్యంలో ఇంతటి చిచ్చురేపిన మంథర వికృత రూప, మరుగుజ్జు, దుష్టురాలు, స్వార్థపరురాలు అయిన మాట వాస్తవమే. కానీ ఆమెలో కొన్ని మంచి గుణాలు లేకపోలేదు. తాను చిన్ననాటి నుండి సాకిన కైక అంటే ఆమెకు ప్రాణం. కైకకు ఎలాంటి ఆపద వచ్చినా ఆమె సహించలేదు. ఎక్కడ కైకకు దీనస్థితి సంభవిస్తుందో అనీ ఆమె రాణుల్లో కల్లా మిన్నగా ఉండాలని ఆశించింది. నిరంతరం ఆమె మేలు కోసమే ఆలోచించే దాది ఆమె. శ్రీరామపట్టాభిషేక వార్తవినగానే ఆమెలో కైకస్థితికి ఎక్కడ దెబ్బతగులుతుందో, కైక ఆధిక్యత

ఎక్కడ తగ్గిపోతుందో అనే భావం కలిగింది. అంతే ఆమెలో భయం పట్టుకుంది. కౌసల్యకు రాజమాతగా గౌరవం దక్కడం ఆమె సహించ లేకపోయింది. ఎలాగయినా తాను పెంచిన కైక రాజమాతకావాలనే ఆలోచనలో పడింది. గొప్ప పన్నాగం పన్నింది. కైక మనసు మార్చి ఆ పన్నాగాన్ని అమలుపరచేలా చేసింది. చివరికి తనకే ముప్పు తెచ్చుకొంది. కైకకి లోకనింద, పరాభవం తప్పలేదు. అయితే మంథరప్రణాళికవల్ల ఒక పరమ ప్రయోజనం సిద్ధించింది. ఒక మహోపకారం ఒనగూడింది. మంథర ఊహించని శుభపరిణామాల పరంపరలకు ఆమె నాందీరచన చేసినట్లయింది.

దుష్టశిక్షణ, శిష్టరక్షణ, లోకోద్ధరణ జరగడానికి మూలకారణ మయింది.

మంథరపాత్రను భగవంతుడు లోకకల్యాణకారకురాలిగా సృష్టించాడు.

భగవంతుని సంకల్పం వల్ల దుష్టులవల్ల కూడా మేలు చేకూరుతుంది అనడానికి మంథర మంచి ఉదాహరణ.

రామావతారప్రయోజనానికి మార్గాన్ని ఏర్పరచిన మహిళామణి మంథర.

* * *

# 7. శాంతాదేవి

వాల్మీకిరామాయణంలో శాంతాదేవి ప్రస్తావన కొద్దిగానే ఉంది. అది బాలకాండలో ఉంది.

అంగదేశాన్ని రోమపాదుడనే రాజు పరిపాలిస్తున్నాడు. ఆయన పొరపాటువల్ల దేశంలో అనావృష్టి బాధ ఏర్పడుతుంది. పాపపరిహారార్థం ఏమి చెయ్యాలి? అని ఆయన తన పురోహితులను అడుగుతాడు. అప్పుడు వారు ఋష్యశృంగుడు అనే ఋషిపుత్రుణ్ణి నీ రాజ్యానికి రప్పించి, నీ కూతురు శాంతాదేవిని ఆయనకు ఇచ్చి వివాహం జరిపిస్తే వర్షాలు తప్పక కురుస్తాయని సలహా చెప్తారు.

ఋష్యశృంగుడు విభాండకుడనే మహర్షి కొడుకు. విభాండకుడు మహామహిమాన్వితుడయిన మహర్షి. అతడంటే మంత్రులకు పురోహితులకు విపరీతమైన భయం. అందువల్ల విభాండకపుత్రుడయిన ఋష్యశృంగుణ్ణి ఆశ్రమం నుండి అంగదేశం తీసుకురావడం మావల్ల కాదంటారు. అందరూ కలిసి తీవ్రంగా ఆలోచించి ఒక ప్రణాళిక ఏర్పరుస్తారు.

ఋష్యశృంగుడికి వాళ్లతండ్రి తప్ప మరెవ్వరూ తెలియదు. ఆడ, మగ తేడా తెలియదు. కాబట్టి వేశ్యలను అతడి చెంతకు పంపితే వారు ఆటపాటలతో, హావభావాలతో, శృంగారచేష్టలతో ఋష్యశృంగుణ్ణి మైమరపించి తీసుకురాగలరు అని నిర్ణయించి వేశ్యలను పంపుతారు. వారు ఋష్యశృంగుణ్ణి వశపరచుకుని అంగదేశానికి తీసుకువస్తారు.

రోమపాదుడు ఎంతగానో ఆనందిస్తాడు. తన కూతురు శాంతాదేవిని ఇచ్చి వైభవంగా వివాహం జరిపిస్తాడు. వారి రాజ్యంలో అనావృష్టి తొలగిపోతుంది. దేశం సుభిక్షంగా ఉంటుంది.

ఇక్కడ అయోధ్యలో దశరథమహారాజు సంతానం లేదే అని చింతాక్రాంతుడై మంత్రులతో సమావేశమప్పుడు సుమంత్రుడనే మంత్రివర్యుడు తాను ఏనాడో సనత్కుమారుడనే ఋషిపుంగవుడు సాటి ఋషులకు చెప్తూ ఉండగా విన్నాననీ సనత్కుమారుడు చెప్పేనాటికి ఈ కథ జరగలేదనీ భవిష్యత్తులో జరగబోతోంది అని చెప్పాడని చెప్తాడు. ఆ విషయం –

"ఇక్ష్వాకువంశంలో గొప్పధార్మికుడయిన దశరథుడు అనే రాజు పుడతాడు. అతడు సత్యవ్రతుడు. అతనికి అంగరాజయిన రోమపాదునితో మైత్రి ఏర్పడుతుంది. అంగరాజు తన కుమార్తె శాంతను ఋష్యశృంగుడికి ఇచ్చి తన ఇంట ఉంచుకుంటాడు. అప్పుడు దశరథుడు రోమపాదుని వద్దకు వెళ్లి, "నాకు సంతానం లేదు. శాంత భర్త అయిన ఋష్యశృంగుణ్ణి నాకు వంశోద్ధారకుడు కలిగేటట్లు యజ్ఞం చేయించడానికి నీవు పంపాలి అని ప్రార్థిస్తాడు. అలాగే అని మిత్రుని మాటమన్నించి కూతురు శాంతాదేవిని అల్లుడు ఋష్యశృంగుని పంపుతాడు. దశరథుని వెంట వచ్చిన ఋష్యశృంగుడు అయోధ్యలో దశరథుని చేత యజ్ఞం చేయించి సంతానవంతునిగా చేయగలడని చెప్తాడు. ఆ ఋష్యశృంగుని నిర్వహణలో యజ్ఞం పూర్తిచేసి దశరథుడు సంతానవంతుడవుతాడు.

ఇది నేను కృతయుగంలో విన్నాను. వారి వాక్యము సత్యమే అగును. కాబట్టి మీరు స్వయముగా వెళ్లి రోమపాదుని అర్థించి శాంతను, భర్తను అయోధ్యకు తీసుకుని రండి అని సుమంత్రుడు చెప్పిన మాట విన్నాడు

దశరథుడు. వెంటనే వసిష్ఠుల వారి అనుమతితో మంత్రులతో, పరివారముతో, రాణులతో కలసి అంగదేశానికి వెళ్లాడు. రోమపాదుని దగ్గర ఋష్యశృంగుడు అగ్నిహోత్రంలా ప్రకాశిస్తూ దర్శనం ఇచ్చాడు. రోమపాదుడు ఎంతో సంతోషంతో తన మిత్రుడు దశరథునకు సత్కారం చేసి ఆదరించాడు. ఋషిపుత్రుడు, తన అల్లుడు అయిన ఋష్యశృంగునికి దశరథుణ్ణి తన మిత్రునిగా పరిచయం చేసాడు. దశరథుడు సంతోషించి రోమపాదునితో తాను వచ్చిన కారణం చెప్పి - ఋషిపుంగవుడయిన ఋష్యశృంగుని, ఆతని ధర్మపత్ని శాంతాదేవినీ తమతో అయోధ్యకు పంపమని కోరాడు. రోమపాదుడు మిత్రుని కోరికను మన్నించి - శాంతాదేవితో కలిసి ఋష్యశృంగుని దశరథుని పట్టణానికి వెళ్లి వారి కోరిక నెరవేర్చవలసినదని అర్థించాడు.

ఋష్యశృంగుడు తప్పకుండా మీ కోరిక నెరవేర్చగలను అంటూ భార్య శాంతాదేవితో కలిసి దశరథునితో బయలుదేరాడు.

ఋష్యశృంగుడు శాంతాదేవితో కలిసి వస్తున్న వార్త అయోధ్యకు చేరింది. పట్టణమంతా అలంకరించి పౌరులందరూ ఋషిదంపతులకు దుంధుభులు మ్రోగించి స్వాగతం పలికారు.

రోమపాదుని కుమార్తెను, అల్లుని - దశరథుడు ఆతని రాణులు ముగ్గురు కలిసి స్వాగతించారు - శాంతాదేవిని తమ కుమార్తెగా ఋష్యశృంగుని అల్లునిగా సంభావించి ఆనందంతో ఆహ్వానించారు.

ఆనాటినుండి శాంతాదేవి ఆ యింటి ఆడపడుచుస్థానాన్ని పొందింది. రామలక్ష్మణభరతశత్రుఘ్నులకు అక్క అయింది. దశరథుడు నిర్వహించిన యజ్ఞవేదికలలో ఆడపడుచు గౌరవమర్యాదలు అందుకొంది.

వాల్మీకిరామాయణంలో ఈ విషయాలన్నీ గంభీరంగా చెప్పబడ్డాయి.

అయితే స్త్రీల రామాయణపు పాటలలో శాంతా గోవిందనామాలు, ఊర్మిళాదేవి నిద్ర, లక్ష్మణదేవర నవ్వు, కుశలవుల కుచ్చులకథ, కుశలవుల యుద్ధం అనే పాటలలో శాంతాదేవి పాత్ర పరమరమణీయంగా తీర్చుదిద్దుకున్నారు.

మహిళల మనస్సు వికసించి గానం చేసినట్లుగా ఉండే ఘట్టాలవి.

శ్రీమహావిష్ణువు రామావతారుడై దివినుండి భువికి దిగి రావడానికి దశరథుని చేత యజ్ఞం చేయించిన దంపతులు శాంతాదేవి ఋష్యశృంగులు.

రామకథలో ఈ దంపతులు పూనుకోకపోతే రామలక్ష్మణ భరతశతృఘ్నుల జననమే లేదు.

అదీ ఆ పాత్రలకు గల పవిత్రత, ప్రాధాన్యత!

* * *

# 8. సీతాదేవి

శ్రీమద్ రామాయణానికి వాల్మీకిమహర్షి 'రామాయణము' అనే పేరుతో పాటుగా 'సీతాయాః చరితమ్' అనీ 'పౌలస్త్యవధ' అనే పేర్లు కూడా పెట్టాడు.

రామాయణకావ్యనాయకుడు, అవతారపురుషుడు అయిన రాముని అర్ధాంగలక్ష్మి సీతాదేవి. 'సీతా శ్రీరివ రూపిణీ' అని వాల్మీకి తన రచనలో పేర్కొన్నాడు. అంటే సీతాదేవి లక్ష్మీదేవి రూపమే అని.

రామాయణకావ్యనాయిక అయిన సీత అయోనిజ. అంటే ఏ తల్లి గర్భం నుండి ఆమె పుట్టలేదు. విదేహ దేశ ప్రభువు జనకుడు యజ్ఞం చేయడానికి నేలను దున్నుతూ ఉంటే నాగేటిచాలులో ఆమె ఉద్భవించింది. జనకుడు రాజర్షి, ఇంద్రియనిగ్రహం గల మహానుభావుడు. తనకు నాగేటిచాలులో దొరికిన ఈ ఆడబిడ్డను ఎంతో గారాబంతో పెంచి పెద్దదానిని చేసాడు. విద్యాబుద్ధులు నేర్పించాడు.

సీత అంటే నాగేటిచాలు అని అర్థం. నాగేటిచాలులో నుండి పుట్టడం వల్ల ఆమెకు సీత అనే పేరు సార్థకమయింది. విదేహరాజు తనయ కావడంతో ఆమెను వైదేహి అనీ, మిథిలానగరంలో పుట్టడం వల్ల మైథిలి అనే పేర్లు. అంతేకాక జనకుని కూతురుకావడంతో జానకిగా ప్రసిద్ధి చెందింది.

సీత సౌందర్యరాశి. సకల సద్గుణమణి. ధర్మప్రవృత్తి, పవిత్రత, ఓర్పు, ధైర్యం, దయ, దాక్షిణ్యం, వినయం, సహనం ఆమెకు సహజంగా అమరిన అలంకారాలు. ఆమెకు తగిన వరుడు శ్రీరాముడు. శ్రీరాముని సౌందర్యానికి పురుషులే మోహపరవశులౌతారట. 'పుంసాం మోహన

రూపాయ' అని రాముణ్ణి కీర్తిస్తారు. పురుషశ్రేష్ఠుడైన శ్రీరాముడు స్త్రీరత్నమయిన సీతకు భర్త.

ఆడది మెచ్చిందే అందమని లోకంలో ఒక మాట ఉంది. రాక్షసి శూర్పణఖ సీతాసౌందర్యాన్ని రావణునికి వివరించి చెప్తుంది. అంతటి అందగత్తె దేవతలలో కూడా లేదనీ ఆమెను నీ భార్యగా చేసుకోమని శూర్పణఖ రావణునికి బోధిస్తుంది. తన చెల్లెలు శూర్పణఖబోధకు లొంగి రావణుడు దొంగతనంగా సీతను అపహరించి విజయం సాధించానని విఱ్ఱవీగుతాడు. కానీ సీతను అపహరించడం వల్ల తనకు, తన రాజ్యానికి, తన ప్రజకు, తన జాతికి వినాశం తెచ్చి పెట్టుకుంటాడు. వాల్మీకి రామాయణానికి 'పౌలస్త్యవధ' అనే పేరుకూడా పెట్టాడు. ఈ సంఘటన సీతాపహరణం వల్ల సంభవించింది. సీతాదేవికి రామాయణంలో అంతటి ప్రాముఖ్యముంది.

సీతారాముల దాంపత్యం భారతీయులకు ఆదర్శవంతమైంది. సీతారాముల సంబంధం ఎలాంటిదో రావణునికి వివరిస్తూ మారీచుడు సూర్యుడు తేజస్సు, పుష్పము సౌరభము ఎలా ఒకదాని నుండి ఒకటి విడదీయరాని సంబంధం కలిగి ఉంటాయో సీతారాముల సంబంధం అవినాభావమయినదని చెప్తాడు. అంతేకాదు సీత అగ్నిహోత్రమనీ ఆమెను తాకితే చేయి కాలితీరుతుందనీ ఆమె జోలికి పోవద్దనీ హితవు చెప్తాడు.

సీతారాముల కల్యాణవేళలో జనకమహారాజు శ్రీరాముని చేతిలో సీతాదేవిచేతిని పెట్టి శ్రీరామా! ఈ సీత నాకూతురు. నిన్ను నీడలా అనుసరించి ఉంటుంది అని అప్పగిస్తాడు.

తండ్రి భావించినట్లే సీత సర్వకాల సర్వావస్థల్లో శ్రీరాముని వెంటనంటే ఉంది.

శ్రీరాముడు తండ్రికోరిక మేరకు వనవాసానికి ప్రయాణమై వెళ్లడానికి నిశ్చయించుకుంటాడు. సీతతో ఈ వార్త చెప్పగానే ఆమె తానుకూడా రామునితో పాటు అడవులకు వస్తానంటుంది. వనవాసం కష్టభూయిష్టమైనదనీ సుకుమారివైన నీవు తట్టుకోలేవనీ ఆమెకు బోధపరుస్తాడు. అయోధ్యలో ఉండి భరతుని మాట మన్నిస్తూ, అత్తమామలను సేవించమంటాడు.

రాముని మాటలకు సీత అభిమానం దెబ్బతిన్నది. ఆమె నీడలా వెన్నంటి ఉండడం నిజమేకానీ, ఆమె కేవలం నీడ మాత్రమే కాదు. ఆమెకొక ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉంది. అందుకే మనోబలంతో రాముని మాటను త్రోసిపుచ్చి నాకు భర్తతో కలిసి ఉండే హక్కు ఉంది. అది ఎవరూ కాదనలేరని నిబ్బరంగా, నిష్కర్షగ ప్రకటిస్తుంది. బంధువులందరిలో తన పురుషుని వెంట నడిచే హక్కు, కష్టసుఖాల్లో పాలు పంచుకునే బాధ్యత ఒక్క భార్యకే ఉంది అని నొక్కి చెప్తుంది. రాముడే తన సర్వస్వమనీ తన జీవితానికి ధారకమనీ తనకు ఆతడే ప్రాణమనీ అతణ్ణి విడిచి ఉండలేననీ, అలాంటి పరిస్థితి వస్తే తాను మరణించే ప్రమాదం ఉంది అంటుంది.

రామా! నువ్వు నన్ను అయోధ్యలో వదిలివెళ్లావని నా తండ్రి జనకునికి తెలిస్తే అయ్యో! పురుషవేషంలో ఉన్న స్త్రీకి యిచ్చి నాకూతురి వివాహం జరిపించానా? మహావీరుడు లభించాడని భ్రమపడ్డానా? అనుకుంటాడని ఒక చురక తగిలిస్తుంది. అంతటితో ఆగదు. ఆమె ఉద్రేకంతో ఒక్క నాటకాలాడే నటులు తప్ప ఎవరూ తమ భార్యను మరొకరి రక్షణలో విడిచివెళ్లరని అధిక్షేపిస్తుంది. సీతాదేవి హృదయ ఔన్నత్యానికి రాముడు గర్వపడుతూ సీత తనతో రావడానికి అంగీకరిస్తాడు.

సీత రామునితో అడవులకు వెళ్లాలని నిశ్చయించుకున్నందుకు కౌసల్య మహదానందభరితురాలవుతుంది. సీతను కౌగలించుకుని

అభినందిస్తుంది. అమ్మా! రాముణ్ణి ఏమాత్రం చిన్నచూపు చూడవద్దని కోరుతుంది. పూర్వం పతివ్రతలు భర్తల ఎడ ఎలాంటి భక్తిప్రపత్తులు చూపారో ఆవిధంగానే రాముణ్ణి నిత్యమూ గౌరవించమని సీతతో ప్రేమగా చెప్తుంది. అత్తగారు కౌసల్యాదేవిఆదేశానికి సీత గౌరవంతో గొప్ప సమాధానం ఇస్తుంది.

**నాతంత్రీ వాద్యతే వీణా**
**నాచక్రో వర్తతే రథః**
**నాపతి స్సుఖమేధేత**
**యా స్యాదపి శతాత్మజా ॥ (అయోధ్య.39.29)**

తంత్రులు లేనిదే వీణమ్రోగదు. చక్రములు లేనిదే రథం సాగదు. భర్తను స్త్రీ విస్మరిస్తే సుఖం పొందలేదు. ముందుకు నడవలేదు.

వీణ తంత్రులు ఒత్తిడిని భరిస్తాయి. తత్ఫలింగా వెలువడే మధురమైన గానానికి వచ్చే కీర్తి వీణకు దక్కుతుంది. రథం ప్రయాణించేటప్పుడు రాళ్లురప్పల తాకిడి చక్రాలు తట్టుకొంటాయి. కాని సుఖంగా ప్రయాణం సాగినందుకు పొగడ్త రథానికి లభిస్తుంది. జీవితంలోని ఢక్కాముక్కీలు భరించేవాడు భర్త, సాధించిన విజయాలకు లభించే కీర్తి భార్యది అంటూ విశేషమయిన ఉపమానంతో వివరించిన విద్యావతి సీత. భార్యాభర్తల సంబంధాన్ని ఇంత గొప్పగా అవగాహన చేసుకున్న సీత రాముణ్ణి అంటిపెట్టుకుని ఉండడానికే నిశ్చయించుకుంది. తన భర్తకోసం ఎలాంటి త్యాగమయినా చేయడానికి సిద్ధపడింది. అరణ్యంలో సంచరిస్తూ ఉండగా విరాధుడు అనే రాక్షసుడు రామలక్ష్మణులను పట్టుకుని పారిపోతూ ఉంటే సీత ఓ రాక్షసుడా! రామలక్ష్మణులను వదిలిపెట్టు, నన్ను భక్షించు నీ ఆకలి తీర్చుకో అంటూ ప్రాధేయపడుతుంది. రాముడులేనిదే తాను జీవించడం కల్ల అని ఆమె నమ్మకం.

సీత జీవితంలో ఇలాంటిదే మరో సన్నివేశం కూడా జరిగింది. యుద్ధం జరుగుతుండగా ఒకనాడు రావణుడు విద్యుజ్జిహ్వుడనే మాయావి చేత రాముని శిరస్సు నరికి వేయబడినట్లు తయారుచేయించి సీతకు చూపించి రాముడు మరణించాడనీ తన ప్రేమను స్వీకరించమనీ ప్రాధేయపడతాడు.

రాముని శిరస్సు చూడగానే సీత బెంబేలు పడిపోతుంది. రాముడు లేని జీవితం నిరర్థకం అని భావించిన సీత రావణునితో నాతల కూడా తీసివేయి, రామునితో కలిసి చివరియాత్ర చేయడానికి తోడ్పడమని అర్థిస్తుంది. సీతారాముల అవినాభావసన్నిహితత్వాన్ని తెలుసుకోవడానికి ఈ సంఘటనలు సాక్షులు.

రాముని ఎడల సీతకు గల గౌరవభావం అరణ్యవాసకాలంలో అడుగడుగునా ప్రకటితమవుతూనే ఉంది.

వనవాస ఆరంభంలో సీతారాములు అత్రిమహర్షి ఆశ్రమాన్ని దర్శిస్తారు. అత్రి మహర్షి భార్య సతీ అనసూయ పతివ్రతాశిరోమణి అని, ఆమెను భక్తితో సేవించి ఆమె ఆశీస్సులు పొందమని సీతను ప్రోత్సహిస్తాడు రాముడు.

సీత అనసూయకు భక్తితో నమస్కరిస్తుంది. సీతాదేవి ఎడల ఆ పతివ్రతామతల్లికి ఎనలేని వాత్సల్యం కలుగుతుంది. అందుకు కారణం ఆమె వివరిస్తుంది.

"అమ్మా! సీతా! నువ్వు కష్టసమయంలో భర్తను అనుసరించి అరణ్యానికి ఆనందంగా వచ్చినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది. నీవంటి ఉత్తమవనితలు తమ భర్తలను ఎన్నడూ విడిచి పెట్టక అంటిపెట్టుకుని ఉంటారు. తన భర్త ఎలాంటివాడయినా దైవంగా భావించి గౌరవించే స్త్రీలు ఇహపరలోకాలలో సౌఖ్యాలు పొందగలుగుతారు.

ఇకముందు కూడా నువ్వు ఇలాగే ధర్మమార్గాన్నే అనుసరిస్తావనీ, నీ మహోత్తమప్రవర్తనతో నీ విధులను నిర్వర్తించి లోకపూజ్యురాలవు కాగలవనీ నా దృఢవిశ్వాసం తల్లీ! అంటుంది. ఆ మహనీయురాలి మాటలు విన్న సీత వినయంతో చెప్పిన సమాధానం సీతశీలాన్ని బహుధా ప్రకాశింపచేస్తుంది.

'ఓ పూజ్యురాలా! మీరు పలికిన పలుకులన్నీ పూర్తిగా సత్యసమ్మతాలు. స్త్రీకి తన భర్త ఎలాంటివాడయినా దైవమే అని నా ప్రగాఢమయిన అభిప్రాయం, విశ్వాసం కూడా. ఇక నా విషయానికి వస్తే, ఆయన ఉదారస్వభావుడు. కల్యాణగుణసంపన్నుడు. ధర్మవర్తనుడు. పరమ దయాళువు. నన్ను మనసార ప్రేమిస్తారు. ఆయనను నేను ప్రేమిస్తాను. ప్రభువుగ మన్నిస్తాను. నా మీద తల్లిలా వాత్సల్యం చూపిస్తారు. తండ్రిలా ఎలా నడుచుకోవాలో నేర్పుతారు. సర్వకాల సర్వావస్థల్లో నన్ను రక్షిస్తూ ఉంటారు. అట్టివారిని గౌరవించడం నా గొప్పతనం కాదు. వారి గొప్పదనమే వారిని గౌరవించేలా చేస్తున్నది అంటుంది. సీత సమాధానానికి అనసూయ ఆనందంతో ఆమెను కౌగిట చేర్చుకొని నేను చిరకాలంగా తపస్సు చేసి సాధించిన శక్తులతో నీకు ఏదైనా వరం ఇవ్వాలనుకుంటున్నాను. కోరుకో అమ్మా! అంటూ ప్రియమార పలుకుతుంది.

ఆ మాటకు సీత 'పూజ్యురాలా! మీ ప్రేమ పొందగలిగాను. ధన్యురాలను. ఇంతకుమించి నాకు ఏమీ అవసరం లేదు' అంటుంది.

ఈ సమాధానంతో అనసూయ మరింత ఆనందపడి సీత ఏమీ కోరకపోయినా సర్వకాలాల్లో ప్రకాశించే వస్త్రాలు, ఆభరణాలు, ఎన్నడూ వాడిపోని, వాసన వీడని పుష్పమాల, ఒడలికి పూసుకునే సుగంధ లేపనాలు ఇస్తుంది. ఆ పెద్ద ముత్తైదువ ప్రీతితో ఇచ్చిన ఆ దివ్యకాన్కలను

సీత భక్తితో స్వీకరించి కృతజ్ఞతాభావనతో నమస్కరిస్తుంది. అనసూయ కోరిన మీదట వాటిని ధరిస్తుంది. సీతాకల్యాణగాథను సీతముఖతః వినాలని ముచ్చటపడిన అనసూయకు తన కల్యాణవిశేషాలు వివరిస్తుంది. విల్లు విరిచిన రాముడు పెళ్లికి సుముఖంగా లేకుండా 'మా తండ్రి ఇష్టపడితేనే పెళ్లి' అంటూ భీష్మించుకుని కూర్చున్నాడనీ తామందరూ ఎంతో కంగారుపడ్డామనీ తన మనస్సులో మాట ఈ మహానుభావురాలితో చెప్పుకుంటుంది. అనసూయాదేవి ఇచ్చిన వస్త్రాలు అంగరాగాలు సీతకు పదినెలలు చెరలో ఉన్నప్పుడు వినియోగపడ్డాయి.

రాముని ఎడల సీతకు గల గౌరవప్రపత్తులే కాదు బాధ్యతను వివరించే ఘట్టాల్లో అరణ్యకాండలో సన్నివేశం తెలుసుకోవాలి. సీతను రాముని చేతికి అప్పగిస్తూ జనకమహారాజు ఈమె నిన్ను ఛాయవలె అనుసరిస్తుంది అనే మాటతోపాటుగా 'సహధర్మచరీ తవ' అని కూడా అంటాడు. రాముని జీవితంలో సహధర్మచారిణిగా తనకు అత్యంత బాధ్యత ఉంది అని సీత నమ్మింది. అందుకే దండకారణ్యంలో తాపసులందరూ రామునితో రాక్షసులు తమను హింసిస్తున్నారని చెప్పినప్పుడు రాముడు వారికి రాక్షసులను సంహరిస్తానని అభయం ఇస్తాడు. ఆ సందర్భంలో సీతకు ఒక ధర్మసందేహం కలుగుతుంది. దాన్ని రామునికి తెలియపరచే ముందు సీత మాట్లాడిన విధానం ఆమె వాగ్నైపుణ్యాన్ని పట్టి ఇస్తుంది.

రామా! నీవు ఎట్టి పరిస్థితుల్లోనూ అసత్యమాడవు అని నేను పూర్తిగా నమ్ముతున్నాను. అంతేకాదు నువ్వు ఏకపత్నీవ్రతుడవని నా విశ్వాసం. అయితే యిప్పుడు నా సందేహం ఏమంటే ఋషులకు రక్షణ కల్పించడానికి మనకు ఏ హానీ చేయని రాక్షసులతో వైరం పెట్టుకుని వారిని సంహరించడం భావ్యమా? అని. రామా! ఈ సందర్భంలో మీకు ఒక చిన్నవృత్తాంతం చెప్తాను. పూర్వం ఒక ఆశ్రమంలో మహానుభావుడు,

పవిత్రహృదయుడు అయిన మహర్షి ఉండేవాడు. ఆయన తపశ్శక్తిని పరీక్షించే నిమిత్తం ఇంద్రుడు ఒక ఆయుధధారివేషం ధరించి ఆ మహర్షిని దర్శించి నమస్కరించాడు. మహర్షీ! నాకొక్క సహాయం చేసి పెట్టండి. ఇది నా ఖడ్గం. ఇది మీ దగ్గర ఉంచండి. నేను త్వరలో వచ్చి తీసుకుంటాను అంటూ వెళ్లిపోతాడు. ఆ ఖడ్గం ఆశ్రమంలో ఉన్నప్పటినుండి మహర్షి మనస్సులో దాన్ని ప్రయోగించి చూడాలని కుతూహలం పుడుతుంది. నిత్యం పూలు పళ్లు సేకరించుకుందుకు వెళ్లే సమయంలో ఆయన ఆ ఖడ్గాన్ని వెంటతీసుకువెళ్లేవారు. ఖడ్గం చేతిలో ధరించడం వల్ల ఆయనలో క్రమంగా క్రూరబుద్ధి ఏర్పడుతుంది. ఆ విధంగా ఆయనలోని తపశ్శక్తి క్రమంగా క్షీణించిపోతుంది. అందువల్ల నాకు అస్త్రశస్త్రాలన్నా అకారణ సంహారమన్నా అమితభయం. ధర్మం అన్నింటికీ మూలం. అలాంటి ధర్మానికి లోటు రాకుండా చూడండి. స్త్రీ చాపల్యం వల్ల ఏదో అన్నాను అంది. సీత చెప్పినదంతా విని రాముడు తాను చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చి తీరగలననీ దుష్టులను శిక్షించడం క్షత్రియధర్మమనీ స్పష్టంగా చెప్తాడు. ధర్మహాని జరగదు నన్ను నమ్ము అంటాడు.

సీతకు రామునికి అపకీర్తి వస్తుందేమో అన్న భయమే కాని మరివేరు కాదు.

సీతాదేవి అరణ్యవాసకాలంలో రాముణ్ణి ఒకే ఒక కోరిక కోరింది. అది బంగారులేడిని తెచ్చిపెట్టమని. దాని సొగసుకు మోజుపడింది. అయోధ్య తీసుకువెళ్లి అందరికీ చూపాలని ముచ్చటపడింది. ఆ కోరిక ఆమె అపహరణకు కారణమైంది. ఈ సందర్భంలోనే మారీచుని హా సీతా! హా లక్ష్మణా! అనే అరుపులు విని రామునికి ఆపద కలిగిందేమోనని ఆందోళనపడింది. రక్షణగా వెళ్లమంటే కదలని మరది లక్ష్మన్నను అనవినరాని మాటలు అంది. స్త్రీలలో ఉండే బలహీనత ఈ సందర్భంలో సీతలో కూడా వ్యక్తమయింది.

అయితే సీతవ్యక్తిత్వం మహోన్నతమైనట్టిది. రావణుడు తనను అశోకవనంలో పెట్టి ఆమె ప్రేమకోసం ఎంతగా ప్రలోభపెట్టినా ఆమె ప్రలోభపడదు. అసలు రావణునితో సంభాషించేటప్పుడు గడ్డిపోచ అడ్డంగా పెట్టి మాట్లాడుతుంది.

నువ్వు పిరికిపందవు. నా రాముడు సమీపంలో లేకుండాచూసి దొంగలా ఎత్తుకొని వచ్చావు నన్ను. మీ రాజ్యంలో నీకు మంచి బుద్ధులు చెప్పే పెద్దలెవరూ లేరా అని అడుగుతుంది. అసలు నేనే నిన్ను క్షణంలో భస్మం చేయగలను, నా రాముని ఆజ్ఞలేదని ఊరుకున్నాను అంటుంది. రావణుడు పదితలలు వంచి పాదనమస్కారం చేసి ప్రాధేయపడినా ఆమె అతణ్ణి లెక్కచెయ్యనే చెయ్యదు. భయంకరమైన ఆ రాక్షసుడు ఎంతగా బెదిరించినా ఆమె భయపడనే పడదు. ఆమె రామపత్ని పతివ్రత ధీరురాలు అని రావణునితో సంభాషించినప్పుడు స్పష్టంగా తెలుస్తుంది.

తనను క్షణక్షణం ఇబ్బంది పెడుతున్నా రాక్షసస్త్రీలతో మీరు నన్ను చంపి తిన్నాసరే నేను రాముని తప్ప అన్యులను స్వీకరించను అని నొక్కి చెప్తుంది.

రాముడు రాజ్యబహిష్కృతుడైనా ఐశ్వర్యహీనుడయినా తనకు భక్తి విశ్వాసాలు ఆయనయందు స్థిరంగా ఉంటాయని చెప్తుంది సీత.

సీతాదర్శనభాగ్యం కలిగిన హనుమంతుడు సీత రావణునితో రాక్షసస్త్రీలతో మాట్లాడడం శింశుపావృక్షం మీద ఉండి గమనిస్తూ ఉంటాడు. సీతామాతలోని ధైర్యానికి, వాగ్విలాసానికి చేతులెత్తి నమస్కరిస్తాడు. ఆమెను అదీనభాషిణి అని సంభావిస్తాడు. ఎంతటి దిగులు లోపల ఉన్నా మాటల్లో ఏమాత్రం కనిపించనీయదట.

సీత హనుమతో సంభాషించే సందర్భంలో హనుమ తాను రామదూతనని చెప్పి, ఉంగరం చూపించినా హనుమ విశ్వరూపం చూసి గాని విశ్వసించదు, ఆమె జాగ్రత్త అంత గొప్పది.

తనతో వస్తే తన భుజాలమీద కూర్చోబెట్టుకుని సముద్రలంఘనం చేసి రాముని వద్దకు చేరుస్తానన్న హనుమతో 'హనుమా! నువ్వు అంతటి వాడవే కాదు అనను. కానీ నేను నీతో వస్తే రాముని కీర్తికి భంగం కలగదా? రావణుడు నన్ను దొంగతనంగా ఎత్తుకొచ్చాడు, అంటున్నాము కదా! ఇప్పుడు నేను నీతో వచ్చేస్తే రాముడే పెద్ద దొంగ అంటారు. రాముడు లంకకు రావాలి. రావణుని జయించాలి. నన్ను గౌరవంగా విజయంతో పాటుగా కీర్తిమంతుడై తీసుకువెళ్లాలి' అంటుంది. 'రామునికి అపకీర్తి తెచ్చే పని ఒక్కటి కూడా నేను చేయనే చేయను' అంటుంది.

రావణుని ఆజ్ఞమేరకు హనుమ తోకకు నిప్పుపెట్టారు రాక్షసులు. ఆ విషయం అశోకవనంలో ఉన్న సీతకు చెప్పారు. సీత వెంటనే తాను పతివ్రతనైతే హనుమపట్ల అగ్ని చల్లబడు గాక! అంటూ ప్రార్థించింది. హనుమ తనతోకకు మంట చల్లగా ఉండడం చూసి సీతమ్మతల్లిదీవెనగా భావించి ఆనందించాడు.

లంకనంతా తగులబెట్టినప్పుడు సీతకూడా ఆ మంటలో నశించిందేమో అని భయపడిన హనుమ అగ్నిని అగ్ని ఏమిచేస్తుంది అనుకుంటాడు. సీత స్వయంగా అగ్ని అని గుర్తు చేసుకుంటాడు.

రాముడు సీతను స్వీకరించడానికి సందేహిస్తున్నప్పుడు సీత అగ్ని ప్రవేశం చేసింది. అగ్నిహోత్రుడు స్వయంగా సీతను పువ్వుల్లో పెట్టి తీసుకువచ్చినట్లు తెచ్చి రామునకు సమర్పిస్తాడు.

రాముని విజయవార్త సీతమ్మకు తెలియజేయడానికి హనుమ అమితోత్సాహంతో వచ్చినప్పుడు సీతామాతకు నమస్కరించి 'అమ్మా! రావణవధ జరిగింది. రాముడు విజయరాఘవుడయ్యాడు. అందరూ ఆనందంగా ఉన్నారు. ఈ సమయంలో నాదొక కోరిక తీర్చాలి అంటాడు. అడుగు హనుమా! ధర్మబద్ధమైనదయితే తప్పక తీరుస్తాను' అంటుంది. ఆమాట మీద హనుమ 'అమ్మా! మిమ్మల్ని ఇంతకాలం ఘోరంగా

హింసించిన ఈ రాక్షసస్త్రీల మీద కసి తీర్చుకుంటాను. వారిని సంహరిస్తేగానీ నా కోపం చల్లారదు' అంటాడు.

హనుమ కోరిక విన్న సీత చిరునవ్వుతో 'హనుమా! నువ్వు నీ స్వామి కార్యం ఎంత శ్రద్ధతో భక్తితో చేసావో వీళ్లు కూడా వారి ప్రభువు ఆజ్ఞను పాలించి నన్ను హింసించారు. వీరు స్వతంత్రులు కాదు. బానిసలు. ప్రభువు ఆజ్ఞ పాటించిన వీరిని శిక్షించడం సబబు కాదు. నేను నీకు అనుమతి ఇవ్వను. వారికి శుభములు జరగాలని కోరుకుందాం' అంటుంది.

సీతాదేవిలోని క్షమాశీలతకు ఈ సన్నివేశం గొప్ప ఉదాహరణ.

హనుమ ఎడల సీతకు గల వాత్సల్యం, అభిమానం కొలలేనివి. అది పట్టాభిషేకఘట్టం. రాముడు సీతకు ఒక ముత్యాలహారం బహూకరించాడు. సీత ఆ హారాన్ని మెడలో వేసుకుని తర్వాత చేతుల్లోకి తీసుకుని రాముని వైపు చూస్తుంది. సీత మనస్సు ఎరిగిన రాముడు 'నీకు ఎవరిమీద అభిమానం ఉందో ఎవరి వల్ల ఆనందం పొందావో వారికి ఇవ్వు' అన్నాడు. సీతమ్మతల్లి హనుమను పిలిచి ఆ హారాన్ని ఆతని మెడలో వేస్తుంది. ఆ హారం ధరించిన హనుమ బంగారు కొండలా మనోహరంగా దర్శనమిస్తాడు. అందరూ ఆనందిస్తారు. సీతకు గల కృతజ్ఞతాభావం ఇంత గొప్పది. సీతజాడ కనుక్కున్న మహనీయుడు హనుమ.

యుగయుగాలుగా సీతామాత ఉత్తమస్త్రీలలో పతివ్రతలలో అగ్రస్థానాన్ని అలంకరించింది.

గాంధీజీ ఒక ఉపన్యాసంలో "ప్రపంచంలోని ప్రతి స్త్రీ సీతాదేవిని ఆదర్శంగా తీసుకోవా"లని చెప్పారు.

త్యాగరాజు **'సీతమ్మ మాయమ్మ'** అంటూ కీర్తించారు.

* * *

# 9. తార

కిష్కింధనగరాధిపతి వాలి భార్య తార. వైద్యనిపుణుడయిన సుషేణుని కూతురు. యువరాజు అంగదుని కన్నతల్లి. రామాయణకావ్యంలో శ్రీరాముని తత్త్వాన్ని తెలిసిన ముగ్గురు మహిళలలో తార కూడా ఒకతె. అయోధ్యలో సుమిత్ర, కిష్కింధలో తార, లంకారాజ్యంలో మండోదరి రామతత్త్వజ్ఞానమహత్తు తెలిసినవారు.

తార రాజకీయపరిజ్ఞాననిపుణ కూడా. సుగ్రీవుడు రామునితో సఖ్యం చేసుకుని రాముడు ఇచ్చిన ధైర్యంతో వాలిని యుద్ధానికి పిల్చి చావుదెబ్బలు తిని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఋష్యమూకానికి పారిపోయివస్తాడు. రాముడితో ఇలా చేసావేమిటి అంటూ వాపోతాడు. అప్పుడు రాముడు మీ అన్నదమ్ములిద్దరూ ముమ్మూర్తులా ఒకేలా ఉన్నారు. అందువల్ల నేను బాణం ప్రయోగించలేదు. ఈసారి తప్పక వాలిని సంహరిస్తాను. నువ్వు ఈ గజపుష్పమాలను ధరించి వెళ్లు అని ఉత్సాహపరుస్తాడు. సుగ్రీవుడు కిష్కింధచేరి వాలిని యుద్ధానికి రమ్మని బిగ్గరగా పిలుస్తాడు. అది విన్న వాలి ఇప్పుడే కదా చావుదెబ్బతిని పారిపోయాడు మళ్ళీ ఈ సింహనాదం ఏమిటి? అని ఆశ్చర్యం, ఆత్రత ముంచుకుని రాగా ఒక్క నిముషం కాంతివిహీనుడవుతాడు.

ఆ స్థితిని తార వెంటనే గమనిస్తుంది. వాలి యుద్ధరంగానికి దూసుకు పోదామనుకుంటూ సిద్ధపడతాడు. ఆ సమయంలో తార వాలిని చేరవచ్చి– అడ్డంగా నిలబడుతుంది. ఎంతో గారాబంగా వాలిని కౌగిట చేర్చుకుని ఆగండి! స్వామీ! తొందరపడవద్దు. నిదానంగా ఆలోచించి నిర్ణయించుకుందురుగాని. ఓ వీరాగ్రేసరా! కోపంలో ఉన్నావు. నా మాట విను. కాస్త ఆలోచించు. కొద్దిసేపటిక్రితమే కదా నీచేతిలో చావు దెబ్బతిని పారిపోయినవాడు ఇంతలోనే ఇంత సాహసంతో పోరుకు ఆహ్వానిస్తున్నాడు

అంటే దీని వెనుక ఏదో గొప్ప కారణం ఉండి ఉంటుందని నాకు భయంగా ఉంది. ఎవరో బలవంతుల సహాయం అంది ఉంటుంది. నేను ఏదో ఊహించుకుని ఈ మాటలు అనడంలేదు.

దశరథుని కుమారులు రామలక్ష్మణులు సుగ్రీవునికి మేలుచేయడం కోసం పనిగట్టుకుని ఋష్యమూకపర్వతానికి వచ్చారని మన అంగదునికి చారుల ద్వారా సమాచారం అందింది. నీవు మహావీరుడవే సందేహం లేదు. కానీ కోపం తెచ్చుకోకుండా విను. రాముని శౌర్యప్రతాపాలని ఎవరూ ఎదుర్కోలేరు. కాబట్టి రామునితో వైరం వద్దని నిన్ను యాచిస్తున్నాను. నీ తమ్ముడు రక్తసంబంధి. ఎన్నో తప్పులు చేసాడనే అనుకుందాం. అవన్నీ క్షమించు. తమ్ముని పిలిచి యౌవరాజ్యపట్టాభిషేకం చేయి. మనమంతా శాంతియుతంగా బ్రతకగలం. దయచేసి నామాట విను. నీమీద గల ప్రేమతోనే ఇంతగా చెప్తున్నాను అని ఎంతగానో హితవు చెప్తుంది తార. కాని వినలేదు వాలి. రాముని చేతిలో నిహతుడయ్యాడు.

తార ఎంతగానో విలపిస్తుంది.

రాముడు స్వయంగా తారను ఓదారుస్తాడు.

తార మహాజ్ఞాని, సూక్ష్మగ్రాహి. రాముని దివ్యత్వాన్ని గ్రహించి సమాధానపరచుకుంటుంది. వారి మర్యాద అనుసరించి సుగ్రీవునికి భార్యగా అంగీకరిస్తుంది.

తారలో మాట్లాడే నైపుణ్యం ఉంది. సుగ్రీవుడు కామసుఖాల్లో మునిగి సీతాన్వేషణకై చేసే ప్రయత్నాలు చేయటంలేదని కోపంతో మండిపడుతూ వచ్చిన లక్ష్మణుని ఎదుటకు సుగ్రీవుడు స్వయంగా రాలేక తారను పంపుతాడు. తార ఎంతో వినయంగ లక్ష్మణుని కోపాన్ని తగ్గించే రీతిలో

మాట్లాడి సుగ్రీవుడు సీతాన్వేషణకై వానరసేనను సమాయత్తం చేస్తున్నాడని, దీనికి చిరకాలంగా సుఖాలకు దూరమై ఉండడం వల్ల భోగాల్లో మునిగినమాట వాస్తవమే కాని అతడు కృతఘ్నుడు కానేకాడని చెబుతుంది.

రామకార్యనిర్వహణలో సుగ్రీవుడు నన్ను కానీ రుమనిగానీ, ఈ రాజ్యాన్ని గాని ఏ మాత్రం సంకోచం లేకుండా వదలివేస్తాడు అని చెప్తుంది. ఈ మాటలకు లక్ష్మణుడు శాంతచిత్తుడవుతాడు. అప్పుడు సుగ్రీవుడు లక్ష్మణునితో తాను చేసిన ప్రయత్నాలు చెప్పి పశ్చాత్తాపంతో వినయాన్ని ప్రకటిస్తాడు.

లక్ష్మణుని కోపాన్ని తన సంభాషణాచాతురితో శాంతపరిచిన విదుషీమణి రాజకీయచతుర తార.

రామతత్వాన్ని సర్వమూ గ్రహించిన రమణి తార.

అన్నదమ్ములు పరస్పరం ప్రేమించుకుంటు అన్యోన్యంగా ఉండడం కుటుంబజీవనానికి మూలస్తంభం వంటిదని ఎంతగానో వాలికి బోధించిన వివేకవతి తార.

భార్యమాట వినక తాను చెడిపోయాననీ, తార సర్వజ్ఞురాలు, రాజనీతిజ్ఞురాలనీ ఆమె చెప్పినట్లు నడుచుకుని ఉత్తమ పౌరునిగా జీవించమనీ తన తమ్ముడు సుగ్రీవునితో చివరిమాటగా చెప్పిన వాలి అనుభవశాలి.

* * *

## 10. రుమ

రుమ సుగ్రీవుని భార్య. శ్రీరాముడు వాలిని సంహరించి సుగ్రీవునికి పట్టాభిషేకం చేస్తాడు. ఆ సందర్భంలో రుమ సింహాసనం మీద పట్టపురాణిగా దర్శనమిస్తుంది. సుగ్రీవునికి అన్ని సౌఖ్యాలను సమకూర్చిపెట్టే ఇల్లాలు రుమ.

సుగ్రీవుని భార్య రుమను వాలి తన స్వంతం చేసుకుని ఆమెతో కామసుఖాలు అనుభవిస్తాడు. తన అన్న తన భార్యను చేజిక్కించుకున్నాడని సుగ్రీవుడు రామునితో చెప్పుకుని బాధపడతాడు. రుమ నోరుతెరవని స్త్రీ.

* * *

## 11. సత్యవతి

బాలకాండ 34వ సర్గలో – ఈ సత్యవతి వృత్తాంతం చెప్పాడు వాల్మీకిమహర్షి. ఈ వృత్తాంతం విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు వివరించాడు.

కుశనాభుడు విశ్వామిత్రుని తాతగారు. ఆయనకు నూరుగురు కుమార్తెలు. కుమార్తెలకు బ్రహ్మదత్తునితో వివాహం జరిపించి ధన్యుడయ్యాడు. అయితే పుత్రసంతానం లేదే అనే చింతలో పుత్రప్రదమైన పుత్రకామేష్టిని చేసాడు. ఆ యజ్ఞఫలంగా కుశనాభుడికి ఒక కొడుకు పుట్టాడు. అతని పేరు గాధి. రామా! అతడు పరమధార్మికుడు. అతని పుత్రుణ్ణి నేను. గాధి కొడుకును గనుక నన్ను గాధేయుడు అంటారు. కుశికవంశంలో పుట్టాను కనుక కౌశికుడని కూడా వ్యవహరిస్తారు. ప్రధానమయిన విషయం ఏమిటి అంటే నాకు ఒక అక్కయ్య కూడా ఉండేది. ఆమె పేరు సత్యవతి. నన్ను ఎంతో ప్రేమగా లాలించేది. ఎన్నో విషయాలు వివరించి చెప్పేది. పరోపకారపరాయణమే జీవితలక్ష్యంగా పెట్టుకుంది ఆమె. మా అక్క అంటే నాకు ఎంతో గౌరవం, ఇష్టం కూడా. ఆమె గుణశీలాలు నన్ను ఎంతగానో ప్రభావితం చేసాయి. ఎందుకో చెప్తాను విను.

ఆమె నిత్యవ్రతపరాయణుడయిన ఋచీకుడు అనే మహర్షి ఇల్లాలుగా భర్తను అన్ని విధాలా అనుసరిస్తూ సశరీరంగా స్వర్గానికి వెళ్లింది. కానీ ఆమెకు స్వర్గలోకంలో ఉండాలనిపించలేదు. భూలోకంలో ఏదైనా సర్వజనోపయోగ్యమైన పనిచెయ్యాలని ఆలోచించింది. మానవులకు ఐహికమూ, ఆముష్మికమూ అయిన లాభాలను, ధర్మాలనూ చేకూర్చడానికి వీలుగా పరమోదారమైన ప్రవృత్తి కలిగిన మా అక్క–

దివ్యమూ, రమ్యమూ అయిన పుణ్యోదకంగా మారి హిమాలయపర్వతాన్ని ఆశ్రయించి మహానదిగా అవతరించింది. ఆమె కౌశికీనది అనే పేర ప్రఖ్యాతి గాంచింది. స్వర్గాన్ని కాదని మానవసేవ కోసం ఆమె తిరిగి భూలోకానికి నదీరూపంగా తరలివచ్చింది. ఆమెమీద గల స్నేహంతో గౌరవంతో నేను కూడా మా అక్క పక్కనే ఆశ్రమం కట్టుకుని కౌశికీనదీ తీరంలో ఆనందంగా ఉంటున్నాను.

**'సా తు సత్యవతీ పుణ్యా సత్యే ధర్మే ప్రతిష్ఠితా**
**పతివ్రతా మహాభాగా కౌశికీ సరితాం వరా !** (బాల. 34-11)

మా అక్క సత్యవతి ఎంతో పుణ్యాత్మురాలు. మానవలోకానికి జీవనాన్ని అంటే జలాలను అందించడానికి స్వర్గాన్ని కాదని నదిగా మారిపోయింది. సత్యము, ధర్మము ప్రతిష్ఠించిన ఇల్లాలు, పతివ్రత, మహాభాగురాలు. కౌశికీ సరితాం వరా అనిపించుకుంది. నదులలో కౌశికి శ్రేష్ఠమైనది.

విశ్వామిత్రుడు చెప్పిన ఈ వృత్తాంతం రామలక్ష్మణులతో పాటు ఎందరో మహర్షులు కూడా విన్నారు. వారంతా ముక్తకంఠంతో 'కౌశికీ సరితాం శ్రేష్ఠకులో ద్యోతకరీ తవ' అని అభినందించారు. మీ కులానికి వెలుగునిచ్చింది కౌశికీనది అని.

లోకహితైషిణి అయిన సత్యవతి స్వర్గాన్ని కాదని భూలోకవాసుల కోసం ఒక నదిగా మారి నేటికీ ప్రవహిస్తూ ప్రజోపకారిగా తన జీవితాన్ని ధన్యం చేసుకుంది.

స్వర్గంకంటే లోకహితం కలిగించడం శ్రేష్ఠమని నిరూపించిన సత్యవతి సద్గుణవాహిని.

* * *

## 12. సోమద

శ్రీమద్రామాయణం బాలకాండలో 33వ సర్గలో 'సోమద' విషయాలు వర్ణించాడు వాల్మీకి. 32, 33 సర్గల్లో వర్ణించిన కుశనాభుని కథలో ఈ సోమద పాత్ర ఔన్నత్యం అభివర్ణింపబడింది.

విశ్వామిత్రుడు తన యాగరక్షణకు బాలురైన రామలక్ష్మణులను ప్రియమార వెంట పెట్టుకుని వెళ్లాడు. విశ్వామిత్రుని యాగం సిద్ధాశ్రమంలో నిరాటంకంగా జరిగేలా రామలక్ష్మణులు ధనుర్ధారులై పర్యవేక్షించారు. సిద్ధాశ్రమం మరోసారి సార్థకనామధేయమయింది. మునులందరూ ఆనందభరితులయ్యారు. రామలక్ష్మణులతో విశ్వామిత్రుడు శోణనదీతీరానికి చేరాడు. ఆ ప్రదేశం అత్యంత రమణీయంగా ఉంది. ఆ ప్రదేశం గురించి వివరంగా చెప్పమని రాముడు విశ్వామిత్రుణ్ణి కోరాడు. తాను నడిచే దారిలోని విశేషాలన్నీ అడిగి తెలుసుకోవడం రామునికి ఇష్టం. వివరంగా మధురంగా ఆ విషయాలన్నీ కథగా చెప్పడం విశ్వామిత్రుని పద్ధతి. ఈ సందర్భంగా విశ్వామిత్రుడు చెప్పిన కథే 'సోమద' కథ.

'రామా! ఇప్పుడు మనం ఉన్న ఈ ప్రదేశం కుశ మహారాజు నాల్గో కుమారుడైన వసువు భూమి. ఈ రాజ్యానికి రాజధాని గిరివ్రజం. ఈ రాజ్యంచుట్టూ అయిదు కొండలున్నాయి. మగధదేశంలో పుట్టి పారుతోంది శోణనది. ఈ అయిదు కొండల మధ్య పూలదండలా ప్రవహిస్తూ తూర్పు నుండి పడమటికి పారుతోంది. అందుకే దీన్ని శోణనదం అంటారు. దీని ఒడ్డున గల భూములన్నీ బంగారం పండుతాయి. నదం అంటే తూర్పునుండి పడమటికి పారేది.

వసువు సోదరుడైన కుశనాభుడు ఘృతాచి అనే అప్సరస స్త్రీని వివాహం చేసుకున్నాడు. అతనికి ఆమె యందు వందమంది కూతుళ్లు పుట్టారు. వాళ్లు సహజంగానే రూపసులు. ఇప్పుడు యౌవనవతులు కావడంతో మరింత అందంగా ఉన్నారు. మెరుపుతీగల్లా వెలుగు నింపుతున్నారు. అందమైన అవయవాలతో శోభిస్తున్న ఆ కన్యలను వాయుదేవుడు చూసాడు. చూసీ చూడగానే వాళ్లను మోహించాడు. వెంటనే వారిని చేరవచ్చి "కన్యకలారా! మీ సౌందర్యం నన్ను పరవశుణ్ణి చేసింది. నన్ను వివాహమాడండి. నన్ను వివాహమాడితే మీకు స్థిరమైన యౌవనం ప్రాప్తించడంతో పాటు దేవతాస్త్రీల గౌరవం కూడా లభిస్తుంది" అన్నాడు.

ఆ మాటలు వినగానే ఆ అక్కచెల్లెళ్లు ఒక్కసారి భయపడ్డారు. అంతలోనే తేరుకుని – "ఓ వాయుదేవా! మేమందరం కుశనాభుని కూతుళ్లం. నువ్వు ఈ విధంగా మమ్మల్ని ఆశించడం ధర్మం కాదు. మా వివాహాలు మా తండ్రి నిర్ణయం ప్రకారం జరుగుతాయి. స్వేచ్ఛానుసారం భర్తను పొందడం ఆచారమూ కాదు, సంప్రదాయమూ కాదు.

**పితా హి ప్రభురస్మాకం దైవతం పరమం హి నః**
**యస్య నో దాస్యతి పితా స నో భర్తా భవిష్యతి.** 1–32–22

మా తండ్రియే మాకు ప్రభువు. తండ్రియే దేవుడు. మా తండ్రి మమ్మల్ని ఎవరికిస్తే అతడే మా భర్త. నీ నిర్ణయం మార్చుకో అని ప్రార్థించారు. అయితే వాయుదేవుడికి ఈ సమాధానం నచ్చలేదు సరికదా కోపం తెప్పించింది. ఒళ్లు మరిచిపోయాడు. వాళ్ల శరీరాల్లో ప్రవేశించాడు. సర్వావయవాలూ కుంగతీసాడు. ఆ అమ్మాయిలందరూ కుబ్జలైపోయారు. సిగ్గుపడుతూ, తడబడుతూ కన్నీరు కారుస్తూ తండ్రి దగ్గర చేరి దుఃఖించసాగారు.

అంగవైకల్యం పొంది, అవమానభరితలై విషాదాకులచిత్తలైన కుశనాభుని కూతుర్లను ఎంతో గౌరవంతో ఉదాత్త సంస్కారభావంతో వివాహమాడింది బ్రహ్మదత్తుడు. ఆ కన్యలను వివాహమాడి పవిత్రమైన తన స్పర్శతో వారిని యథాపూర్వ సౌందర్యమూర్తులుగా, పుణ్యవతులుగా మార్చినది బ్రహ్మదత్తుడు. ఆ కన్యలు వాయువుచే భ్రష్టులయిన విషయాన్ని శారీరకంగా, మానసికంగా తుడిచి వేసి – పావనమూర్తులుగా చేసినది బ్రహ్మదత్తుడే. ఆ బ్రహ్మదత్తుణ్ణి కన్నతల్లి సోమద. సోమద కథ ఆధునిక ఆలోచనాధోరణులకు అద్దంపట్టేదిగా ఉంది. తప్పు వాయుదేవునిదే కాని ఈ కన్యలది కానేకాదనే అవగాహన గలవారు సోమద, బ్రహ్మదత్తులు. ఆ కాలంలోనే ఇంతటి మానవత్వపు పరిమళం. ఎదనిండా తోటి స్త్రీలపట్ల ఎంతటి సానుభూతి. ఎంతటి ఉదాత్త రసాన్విత సంస్కారసంపన్నమైన గాథ సోమదది అనిపించకమానదు. ఆ ఘట్టం చదువుతుంటే ఆమె కథాక్రమం :

చూళి అనే పేరు గల మహా తపస్సంపన్నుడయిన ఒక మునీశ్వరుడు ఉండేవాడు. ఆయన బ్రహ్మచారి. దివ్యతేజస్సుతో వెలిగిపోతూ మూర్తీభవించిన తపస్సులా ఉండేవాడు. శుభాచారసంపన్నుడు. ఈ మహర్షివరుని సోమద అనే ఒక గంధర్వస్త్రీ సేవిస్తూ ఉండేది. సోమద తల్లి ఊర్మిళ. రామాయణంలో లక్ష్మణుని భార్య ఊర్మిళ కాక ఈ గంధర్వస్త్రీ అయిన ఊర్మిళఊసును కూడా అంతగా పట్టించుకోరు పాఠకులు.

**'తప్యంతం తమృషిం తత్ర గంధర్వీ పర్యుపాసతే**
**సోమదా నామ భద్రం తే ఊర్మిళాతనయా తదా॥** (బాల–33–11)

సోమద గొప్ప ధార్మికురాలు. భక్తిశ్రద్ధలతో చూళిమహర్షికి సేవలు చేస్తూ ఉండేది. ఆమె కాలనియమానికి, శ్రద్ధాసక్తులకు, క్రియాచతురతకు సంతృప్తి చెందిన చూళి ఆనందంతో – 'సోమదా! నీకు మంగళమగు

గాక! నీకేది ప్రియమో చెప్పు. తప్పకుండా నెరవేరుస్తాను' అన్నాడు. చూళి మహర్షి తన యెడల ప్రసన్నుడైనందుకు సంతోషించిన సోమద మధురస్వరంతో వాక్యజ్ఞుడు, వాక్యకోవిదుడు, ధార్మికుడు అయిన చూళితో ఇలా పలికింది.

'మహర్షీ! బ్రహ్మవర్చస్సుతో ప్రకాశిస్తున్నావు. బ్రహ్మదేవుడంతటి వాడివి. మహాతపస్సంపన్నుడివి. నేను ఎవరినీ వివాహం చేసుకోను. నిన్నే శరణు వేడుతున్నాను. నాకు పెళ్లి మీద కోరిక లేదు. భర్తకావాలనే ఆశలేదు. నీ తపోమహిమ చేత నాకొక కుమారుణ్ణి ప్రసాదించు. నీకు శుభం కలుగుతుంది' అని అంజలి ఘటించింది.

బ్రహ్మర్షి చూళి సోమద ప్రార్థనను మన్నించి ప్రసన్నుడై - తన మానసపుత్రుణ్ణి సోమదకు ఇచ్చాడు. మనస్సంకల్పం వల్ల జన్మించిన బాలుడతడు. బ్రహ్మర్షి చేత దత్తము చేయబడ్డాడు కనుక అతడు బ్రహ్మదత్తుడు అనే పేర ప్రసిద్ధుడయ్యాడు.

**తస్యాః ప్రసన్నో బ్రహ్మర్షిః దదౌ పుత్ర మనుత్తమమ్**
**బ్రహ్మదత్త ఇతి ఖ్యాతం మానసం చూళినస్సుతమ్** - బాల-33-17

ఉత్తమురాలైన సోమద పెంపకంలో బ్రహ్మదత్తుడు పెరిగి పెద్దవాడయ్యాడు. సంస్కారసంపన్నుడయ్యాడు. స్త్రీల ఎడల ఎంతో గౌరవం, ఆదరం, అభిమానం పెంచుకున్నాడు. సోమదపెంపకానికి చక్కని రూపంగా నిలిచాడు. కుశనాభుని కూతుళ్ల విషయంలో జరిగిన అన్యాయం సంగతి విన్నాడు. అప్పటికి అతడు కాంపిల్యనగరాధిపతిగా ఉన్నాడు. స్వర్గాధిపతియైన దేవేంద్రునిలా మహైశ్వర్యాలతో వెలిగిపోతున్నాడతడు.

ఇక్కడ కుశనాభుడు తన మంత్రులతో ఆలోచనలు చేసాడు. తన తనయల పరిస్థితి పెద్ద హృదయంతో అర్థం చేసుకుని వారిని

వివాహమాడ గల సంస్కారహృదయం కలవాడు బ్రహ్మదత్తుడే అని గ్రహించాడు. బ్రహ్మదత్తుణ్ణి మర్యాదపూర్వకంగా ఆహ్వానించి పూజించాడు. తన మనసులోని వ్యథను వినిపించాడు. బ్రహ్మదత్తుని అంగీకారం మేరకు వరుసగా తన వందమంది కన్యలను యిచ్చి వివాహం జరిపించాడు. బ్రహ్మదత్తుడు పాణిగ్రహణం చేయగానే, అతని చేయి తగిలీ తగలగానే ఆ కన్యల కుబ్జత్వమూ, బాధా తొలగిపోయాయి. వారు శారీరకంగా, మానసికంగా పవిత్రులై మునుపటిలా కలకలలాడారు.

గాలిదేవుడు పెట్టిన బాధనుండి విముక్తులై ఆనందంగా ఉన్న కుమార్తెలను చూడడంతో కుశనాభుడికి పట్టరానంత సంతోషం కలిగింది.

కూతుళ్ళనీ అల్లుణ్ణి ఋత్విజులతో సహా మహా సంరంభంతో వైభవంగా కాంపిల్యనగరానికి మర్యాదలతో సాగనంపాడు కుశనాభ మహారాజు.

తాను పెంచిన కుమారుడు దీనావస్థలలో ఉన్న కన్యకలను పెద్ద మనసుతో వివాహమాడడంతో పాటు వాళ్ళకు, పూర్వరూపాన్ని తెప్పించి ఆనందపరచినందుకు సోమద పరమానందభరితురాలైంది. తన కొడుకు అంతటి ఉత్తముడుగా వ్యవహరించినందుకు గర్వపడింది. తన కోడళ్లనందరినీ మాటిమాటికీ నిమురుతూ దగ్గరకు తీసుకుని కొడుకు చేసిన ఈ ఉదాత్తకార్యానికి సంతుష్టురాలై కోడళ్లను తడిమి తడిమి చూసుకుంటూ మురిసిపోయింది. కుశనాభుణ్ణి కూడా ప్రశంసిస్తూ ఆనందించింది.

**సోమదా஽పి సుసంహృష్టా పుత్రస్య సదృశీం క్రియామ్**
**యథాన్యాయం చ గంధర్వీ స్నుషాస్తాః ప్రత్యనందత**
**స్పృష్ట్వా స్పృష్ట్వా చ తాః కన్యాః కుశనాభం ప్రశస్య చ**

-బాల-33-25

కుశనాభుణ్ణి కూడా సోమద ప్రశంసించింది. ఎందుకంటే తన కుమార్తెల దుస్థితికి విచారిస్తూ, తనను తాను తిట్టుకుంటూ కూర్చోకుండా, మంత్రులతో ఆలోచన చేసి, తగిన ఉత్తముణ్ణి వరునిగా తెచ్చి, విషయం వివరించి ఆ ఆడపిల్లల జీవితానికి ఒక మంచి దారి చూపించినందుకు ఆ తండ్రిని ప్రధానంగా ప్రశంసించింది సోమద. సోమదవ్యక్తిత్వం ఎంత విశిష్టమైనదో గ్రహించడానికి ఈ ఒక్క సంఘటన చాలు.

స్త్రీలకు జరిగిన అన్యాయాన్ని రూపుమాపడానికి తానై ముందుకు వచ్చే విశిష్టమైన వ్యక్తిత్వం గలవానిగా తీర్చిదిద్దిన కుమారుడు గల 'సోమద' వంటి తల్లులు ఉంటే ఇక లోకానికి కావలసినది ఏముంటుంది.

అన్నీ ఉన్న కన్యలను ఎవరైనా వివాహమాడడానికి ముందుకు వస్తారు. ఇలా మరొక వ్యక్తి చేత కుబ్జలుగా మారి, అందం కోల్పోయిన కన్యలను వివాహం చేసుకోవడానికి ఎంత సంస్కారం కావాలి. ఎంత ధైర్యం కావాలి? సమాజాన్ని ఎదుర్కోగల స్థైర్యమెంత కావాలి. ఏవం విధమై సకల సౌభాగ్యాలు గల మహనీయుడు బ్రహ్మదత్తుడు. అతడిని అంతటి ధీరోదాత్తునిగా తీర్చిన సోమద వంటి తల్లులుంటే స్త్రీ జాతికి ఎంతటి కష్టం వచ్చిన ఎదుర్కోగలమన్న ధైర్యం చేకూరడంలో ఆశ్చర్యం లేదు. ఆధునిక సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలకు చక్కని పరిష్కారం చూపిన హృదయం వాల్మీకిది, వాల్మీకి సృష్టించిన సోమదది.

వాల్మీకిరచనలో విలక్షణమైన వ్యక్తిత్వం గల మహిళామణి 'సోమద'.

* * *

## 13. అహల్య

శ్రీరాముడు పతితపావనుడు అని ప్రపంచానికి తొలిసారి తెలియజేసినది అహల్యవృత్తాంతం.

అహల్య గౌతమమహర్షి భార్య. సర్వాంగసుందరి. ఆమె సౌందర్యానికి ఇంద్రుడు కూడా మోజుపడ్డాడు.

విశ్వామిత్రుని యాగం విజయవంతంగా పూర్తిఅయింది. రామలక్ష్మణులను తీసుకుని విశ్వామిత్రుడు మిథిలానగరానికి తన శిష్యులతో బయలుదేరాడు. జనకుని ఇంట గల శివధనస్సును చూడడానికి అని రామలక్ష్మణులను ఉత్సాహపరిచాడు. మిథిలానగరానికి చేరబోతూ ఉండగా దారి పక్కనే శిథిలావస్థలో ఉన్న ఆశ్రమం రాముని కంట పడుతుంది. ఆ ఆశ్రమం అంతటి దుస్థితిలో ఉండడానికి కారణం ఏమిటి? అసలు ఆశ్రమం ఎవరిది తెలుసుకోవాలనే జిజ్ఞాసకలిగిన రాముడు – విశ్వామిత్రుని ఆశ్రమవివరాలు చెప్పమని కోరతాడు.

దీనావస్థలో ఉన్న ఆ ఆశ్రమపుట్టుపూర్వోత్తరాలు విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు తనతో ప్రయాణిస్తున్న ఋషులకు వివరంగా చెప్పడానికి ఆరంభిస్తాడు.

ఆ ఆశ్రమం మహర్షి గౌతమునిది. ఎంతో పవిత్రంగా పరమశోభతో విరాజిల్లుతూ ఉండేది. గౌతముని భార్య అహల్య. గౌతముడు ఒకగొప్ప తపస్సు సాగిస్తున్నాడు. దేవతలు తమ భోగభాగ్యాలకు పదవులకు భంగం కలుగుతుందేమో అని భయపడి ఇంద్రుని వద్దకు వెళ్లి గౌతముని తపస్సు భంగం చేయమని కోరతారు. వారి కోరిక తీర్చడానికి ఇంద్రుడు గౌతముని ఆశ్రమానికి వస్తాడు. గౌతమమహర్షి నదీస్నానానికి వెళ్లిన సమయం గమనించి గౌతముని వేషం ధరించి అహల్యను చేరవస్తాడు.

తన కామవాంఛను బయటపెడతాడు. వచ్చినది తన భర్తకాదనీ – తనను కోరి వచ్చినది ఇంద్రుడనీ అహల్య కనిపెడుతుంది. కానీ దేవతల అధిపతి తనను కోరి వచ్చాడని ఆనందపడి క్షణికసుఖానికి మానసిక బలహీనతతో పాపకార్యానికి ఒడిగడుతుంది.

కానీ మరుక్షణమే తప్పు తెలుసుకుంటుంది. పశ్చాత్తాపంతో ఇంద్రుణ్ణి వెళ్లిపొమ్మంటుంది. కానీ అంతలోనే గౌతమమహర్షి స్నానం ముగించుకువస్తాడు. ఇంద్రుడు తన రూపం ధరించిన మోసగాడని గ్రహిస్తాడు. ఏం జరిగిందో క్షణంలో గ్రహించిన మహర్షి ఇంద్రుణ్ణి సత్యం, ధర్మం నీలో నశించిపోయాయా! నీ ఘోరకృత్యానికి ఫలితంగా నీలో పుంసత్వం నశించు గాక! నీకు సంతానప్రాప్తి లేకపోవు గాక! అని శపించాడు.

క్రోధావేశపరుడై ఉన్న మహర్షి అహల్య వైపు తిరిగి ఎవరికంటపడక, నీవు ధూళిలో పొరలుదువు గాక! ఏ ఆహారం పానీయం లేకుండా కేవలం వాయువే ఆహారంగా బ్రతుకు వెళ్లబుచ్చుదువు గాక. నీవు చేసిన ఈ అపవిత్రకార్యానికి ఈ ప్రదేశం కూడా కాంతిరహితమై జనసంచారం లేక వెలవెలలాడు గాక! నీ పాపం పోవడానికి తపస్సు చేస్తూ, చలనం లేకుండా ఇక్కడే పడిఉందువు గాక! అని కఠోరమైన శాపం ఇచ్చాడు. గౌతమమహర్షి మాటలు విని అహల్య తల్లడిల్లిపోయింది. భర్తపాదాలమీద పడి ఏకధారగా ఏడుస్తూ కరుణించమని అనేకవిధాల ప్రాధేయపడింది. గౌతముని మనస్సు కొంత మెత్తబడి ఆమెకు శాపవిమోచనం ఎప్పుడు కలుగుతుందో వివరించి చెప్తాడు. దశరథతనయుడైన శ్రీరాముడు ఈ పాడుపడిన ఆశ్రమానికి కొన్ని వేల ఏళ్ల తరువాత వస్తాడు. ఆతడు ఈ పాడుపడిన ఆశ్రమంలో అడుగిడగానే ఆయన పాదస్పర్శప్రభావం వల్ల ఆశ్రమం పూర్వవైభవాన్ని పొందుతుంది. నీవు అప్పుడు ఆశ్రమధర్మాన్ని

సమాదరించి ఆ రాముని గౌరవమర్యాదలతో పూజించు. ఆ మహనీయుడు మనకు అతిథి. అదే సమయానికి నేను కూడా తప్పకుండా వస్తాను. ఆ రాముని దర్శనంతో మనం తిరిగి పూర్వం వలె సుఖంగా జీవనం సాగిద్దాము అని చెప్పి హిమాలయాలకు తపస్సు కోసం వెళ్లిపోతాడు.

ఈ వివరాలు చెప్పి విశ్వామిత్రుడు రామా! అప్పటినుండీ అహల్య పశ్చాత్తాపంతో కఠోరమైన తపస్సు చేస్తూ, నిన్నే నిరంతరం తలుచుకుంటూ నీరాకకోసం ఎదురుచూస్తూ ఉంది. ఎండిన మ్రోదులా శుష్కించిపోయింది. ఇప్పుడు ఆమె బూడిద క్రింద అణగిపోయిన నిప్పురవ్వ.

చిరకాలంగా నీకై ఎదురు చూస్తూ దుర్భరమైన నరకవేదన అనుభవిస్తున్న ఆమెకు శాపవిమోచన చేయాలి. త్వరగా ఆశ్రమంలోకి పద. నీవు ఆశ్రమంలో ప్రవేశిస్తే తప్ప ఆమె భర్తశాపం నుండి బయట పడలేదు. నీవు పతితపావనుడవు. శాపగ్రస్తులను దోషరహితులుగా, పుణ్యమూర్తులుగా చేయడమే పతితపావనుడు అంటే. శ్రీరాముడు అహల్యను దోషంలేకుండా పవిత్రీకరించాడు. పతితపావనుడనే పేరు పొందాడు. రామాయణంలో అహల్యఘట్టం శ్రీరాముని మహత్వాన్ని వెలువరించిన తొలి సన్నివేశం. ఇది బాలకాండలో విషయం. ఈ బాలరామునికి అహల్య నమస్కరించి సన్నుతిస్తుంది. ఇది సహజమే కాని ఆమె పాదాలకు రాముడు ప్రణమిల్లడం విశేషం కదా! ఆమె ఇప్పుడు పవిత్రురాలు. పైగా గౌతమమహర్షి ఇల్లాలు. ఋషిపత్నిగా, ఒక మాతృమూర్తిగా సంభావించి ఆమెకు నమస్కరించడం రాముని వ్యక్తిత్వానికి చక్కని నిదర్శనం.

మిథిలలో జనకమహారాజు పురోహితుడు శతానందుడు అహల్య గౌతముల పుత్రుడు. తన తల్లి శాపవిమోచనవిషయం విని పరమానంద భరితుడై రామలక్ష్మణులను సమాదరిస్తాడు.

అహల్య రాయిగా పడిఉన్నట్లు లోకంలో వ్యాప్తిలో ఉంది. వాల్మీకి మహర్షి ఆమె ఆమెగా ఉండి తపస్సు చేస్తూ, పశ్చాత్తాపపడినట్లు వర్ణించాడు. రాయి అయితే ఆమెలో స్పందన ఉండే అవకాశం లేదు కదా!

వేయి సంవత్సరాలు గడిచాక శ్రీరాముడు తమ ఆశ్రమానికి వస్తాడనీ అహల్యను శాపవిముక్తురాలుగా చేస్తాడనీ, అప్పటివరకు ఆ రాముణ్ణే స్మరిస్తూ తపస్సు చేసుకుంటూ ఎదురుచూడమనీ గౌతమ మహర్షి అహల్యతో చెప్పాడు. రాముడు భూమిమీద పుట్టకముందే రామనామం యొక్క శక్తిని గౌతముడు గ్రహించాడు. రామశబ్దం యొక్క శక్తి అమోఘమయినదని నమ్మి అహల్య రామజపం చేసి శాపవిముక్తి అయింది. పాదం మోపితే గాని ఆశ్రమం పవిత్రం కాదు అంటూ విశ్వామిత్రుడు రామలక్ష్మణులను ఆశ్రమంలోనికి తీసుకువెళతాడు. శ్రీరామచంద్రుడు ఆశ్రమంలో అడుగుపెట్టినదే తడవుగా ఆశ్రమం శోభతో ప్రకాశిస్తుంది.. అహల్య రాముణ్ణి దర్శిస్తుంది. ఆమె రాముణ్ణి చూసీ చూడగానే ఆమెలో చైతన్యం వస్తుంది. ధూళిలో ఉన్న ఆమె కదులుతుంది. ఆమె చేసిన నిర్విరామతపస్సువల్ల ఆమె పాపాలన్నీ నశించాయి. ఆమె పవిత్రురాలయింది. పునర్జీవిత అయింది. ఆమెలోని అందచందాలన్నీ మరింతగా ప్రకాశమానమయ్యాయి. ఆమె కొత్త వెలుగు నింపుకుని లేచివచ్చి విశ్వామిత్రమహర్షికి నమస్కరించింది. ఆ తరువాత రామలక్ష్మణులను చేరవచ్చింది. రాకుమారులిద్దరూ ఆ పుణ్యశాలినికి సాష్టాంగనమస్కారం చేసారు. అహల్య వారందరికీ అర్ఘ్యపాద్యాలు సమర్పించి అతిథిమర్యాదలను నిర్వర్తిస్తుంది. అంతలోనే ఇచ్చిన మాట ప్రకారం గౌతమమహర్షి వచ్చి అహల్యను స్వీకరించి తానుకూడా అతిథులను గౌరవిస్తాడు. ఈ పవిత్రమైన అద్భుతమైన సంఘటనను చూచిన దేవతలు సాధు! సాధు! అంటూ మంగళాశాసనం చేస్తూ ఆ

ఋషిదంపతులమీద పుష్పవర్షం కురిపించి ఆనందిస్తారు. అంతేకాదు రాముణ్ణి పతితపావనుడు అని ప్రశంసిస్తారు. అహల్యచేసినట్టి పాపకార్యాలు చేసిన వాళ్లను 'పతితలు' అంటారు. అట్టివారిని పవిత్రులుగా చేసి దోషరహితులుగా నిలబెట్టడమే పతితపావనుడు అంటే. జీవితంలో పొరపాటున గాని ఆవేశంలోగాని ఇలాంటి తప్పుచేస్తే వారు పశ్చాత్తప్తులై రామపాదస్పర్శ, రామనామస్మరణ చేస్తే పునీతులు కాగలరని గౌతమ మహర్షి అహల్యకు చెప్పాడు. అహల్య ఆ విషయాలను నిజంచేసింది.

**శ్రీరాముడు పతితపావనుడు. అహల్య శాపవిముక్త.**

రామనామానికి, రామపాదాలకు గల పవిత్రతను అహల్యాగౌతముల వల్లనే లోకానికి తెలియవచ్చింది.

పశ్చాత్తాపానికి, రామనామస్మరణకు ఎలాంటి దోషమైనా పోతుంది అని నిరూపించిన మహనీయురాలు అహల్య.

**'రామస్మరణే ధన్యోపాయమ్'**

* * *

## 14. అనసూయ

సీతారామలక్ష్మణులు అరణ్యావాసకాలంలో ఎందరో మహర్షులను దర్శించుకుని వారి ఆశీస్సులు పొందారు.

భరతుడు చిత్రకూటానికి వచ్చి శ్రీరామపాదుకలకు పట్టాభిషేకం చేసి పాదుకలతో అయోధ్యకు మరలి వెళ్లాక సీతారామలక్ష్మణులు చిత్రకూటంలో ఉండలేక - ముందుకు పయనమయ్యారు. ఆ ప్రయాణంలో వారు ముందుగా అత్రిమహర్షి ఆశ్రమానికి వచ్చారు. ఆ సందర్భంలో సీతారామలక్ష్మణులతో పాటు పాఠకులు కూడా అనసూయాదేవిని దర్శించుకుంటారు. అత్రిమహర్షి అనసూయకు సీతను పరిచయం చేస్తాడు. ఆ తరువాత తన భార్య మహాభాగా, తాపసీ, ధర్మచారిణీ అని అనసూయమహత్త్వాన్ని చాలా విశేషంగా చెప్తాడు. తన ఇల్లాలిని ఇంత విశేషంగా పరిచయం చేసిన ఉత్తమ భర్త అత్రి మహర్షి.

తపస్విని అయిన అనసూయ ఎన్నో సంవత్సరాలు కఠోరమైన తపస్సు చేసి అమోఘమైన శక్తులు సంపాదించింది. ఆ శక్తులను దేవతల, మానవుల, సమస్త జీవరాసుల ప్రయోజనాలకు వినియోగించింది. ఋషుల యజ్ఞాలకు విఘ్నం కలుగకుండా కాపాడింది. దేవతల కోసం పది రోజులను ఒకే రాత్రిగా చేసింది. పది సంవత్సరాల పర్యంతం కరువు ప్రజలను పీడిస్తూ ఉంటే తన తపశ్శక్తితో గంగాదేవిని ఆ ప్రాంతాలకు రప్పించి బీడువారిన ఆ ప్రదేశాన్ని సారవంతంగా చేసి సస్యశ్యామలంగా, ఫలవృక్షాలతో కూడిన తోటలుగా మార్చింది. ప్రజలందరికి ఆకలి బాధ తీర్చింది. మునిజనాలకు కందమూలాలు, పళ్లు సమృద్ధిగా లభించేటట్లు చేసింది. తనవల్ల ఇతరులకు ఉపకారం జరగాలన్నదే ఆమె ఆకాంక్ష.

ఈర్ష్య అసూయలకు ఆమె మనస్సులో లేశమైనా స్థానం లేదు. కాబట్టే ఆవిణ్ణి ప్రపంచమంతా 'అనసూయ' అనే సార్థకనామంతో కీర్తించింది. సీతా! ఆమె నీకు తల్లివంటిది. ఔదార్యానికి, సౌశీల్యానికి ఆమె ప్రతీక. కోపం ఎలా ఉంటుందో ఆమెకు తెలియనే తెలియదు. ఆమెను సేవించుకో మీకు ఎంతో మేలు కలుగుతుంది అని అత్రి మహర్షి ఆప్యాయతతో చెప్పారు. శ్రీరాముడు కూడా సీతను ఆ వృద్ధతాపసిని సేవించమని ప్రోత్సహించాడు.

సీత ఆమెను చేరి భక్తితో నమస్కరించింది. పవిత్రత, ఋజుత్వం, తపస్సు, ధార్మికత అన్నీ కలిసి అనసూయలో మూర్తీభవించాయి. ఆమె ముఖం ఆధ్యాత్మికతేజస్సుతో ప్రకాశిస్తూ ఉంది. ఆమె పండిన జుత్తు వెండి తీగెలలా మెరిసిపోతున్నది. చర్మం ముడతలు పడింది. ఎండిపోయిన శరీరం గాలిలో కొట్టుకునే అరటిచెట్టులా ఊగుతోంది. అట్టి మహనీయురాలు సీతను చూడగానే సీతపై వాత్సల్యం ఉబికి వచ్చింది. ఇంత చిన్న వయస్సులో భర్తతో కూడా వనవాసానికి వచ్చినందుకు, సతీధర్మాన్ని నిర్వర్తించినందుకు సీతను ఎంతగానో మెచ్చుకుంది. కష్టసమయంలో క్లిష్టపరిస్థితుల్లో భర్తను అనుసరించి వచ్చినందుకు ఎంతో సంతోషపడింది. నువ్వు సదా ధర్మమార్గాన్ని అనుసరించమని బోధించింది. సీత వినయంగా నమస్కరిస్తూ ఓ పూజ్యురాలా! నా భర్త నాయందు అనురక్తుడు. నన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాడు. అట్టి భర్తను గౌరవించకపోతే అదే మహా పాపం. నాకు మాతండ్రిగారు నా వివాహసమయంలో చెప్పిన బుద్ధులు, మా అత్తగారు నేను వనవాసానికి వచ్చేటప్పుడు చెప్పిన సదుపదేశాలు నా చెవుల్లో మ్రోగుతూనే ఉన్నాయి. ఈనాడు మీరు చెప్పిన మాటలు నాకు ఎంతగానో అనుసరించదగినవి. నేను తప్పక అనుసరిస్తాను. మీకు హృదయపూర్వక ప్రణామాలు అంది.

సీత పలుకులకు అనసూయాదేవి అమితంగా సంతోషించింది. సీతను దగ్గరగా తీసుకుని కౌగిట చేర్చుకుంది. నేను తపస్సువల్ల సాధించిన శక్తులతో నీ కోరిక ఏదయినా తీర్చాలనుకుంటున్నాను. కోరుకో తల్లీ అని బుజ్జగించింది. సీత ఆశ్చర్యంతో మహనీయురాలా! మీ ప్రేమ పొందగలిగాను. ధన్యురాలినయ్యాను. నాకు ఏలోటు లేదు తల్లీ! నాకేమి కావాలో తెలియడం లేదు అంది. సీత అమాయకత్వానికి అనసూయ మరింత మురిసిపోయింది. ఆమె ఏమీ కోరకపోయినా తన సంతృప్తి కోసం అనసూయ సీతకు ఎప్పుడూ ధగధగలాడే వస్త్రాలు, ఆభరణాలు, ఎన్నటికీ వాడిపోని, సువాసన వీడని పుష్పమాల, శరీరానికి పూసుకునే ఘుమఘుమలాడే సుగంధలేపనాలు బహూకరిస్తుంది. అంతేకాదు వాటిని ఇప్పుడే ధరించమని, అలంకరించుకోమని కోరుతుంది.

సీతా! ఇవి ధరించడంతో లక్ష్మీదేవి విష్ణుమూర్తిని ప్రభావితం చేయగలిగినట్లు నువ్వు రాముణ్ణి మంత్రముగ్ధుణ్ణి చేయగలవు అని ఆశీర్వదిస్తుంది. సీతను ఆ అలంకరణలో చూసి "సీతా! ఆనంద ప్రదమయిన నీ పెళ్లివేడుకల గురించి నీ తీయని మాటలతో వినాలని కుతూహలపడుతున్నాను చెప్పుతల్లీ!" అంటుంది. సంతోషం, సిగ్గు కలిసి సీతను చుట్టుముట్టగా, సీత తన కల్యాణగాథను శివధనుర్భంగంతో సహా వివరిస్తుంది. శివధనుస్సు విరిచి నా రాముడు తన తండ్రి అనుమతి లేనిదే తాను పెళ్లాడను అన్నాడన్న విషయం సీత అనసూయతో మనస్సు విప్పి చెప్పుకుంటుంది. బాలకాండలో వాల్మీకి ఈ విషయం ప్రస్తావించదు. కల్యాణగాథపూర్తి అయ్యాక అనసూయ సీతతో నేను ఇచ్చిన చీరకట్టుకుని, నగలు, పూలు అలంకరించుకో తల్లీ! అని ప్రేమగా చెప్తుంది. సీతాదేవి ఎంతో ఆనందంతో వాటిని ధరిస్తుంది.. రాముడు అప్పటి సీతాసౌందర్యానికి ముగ్ధుడైపోతాడు. ఈ 'అనసూయ' వృత్తాంతం – రామాయణంలో ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

సీతకు ఆమె ఇచ్చిన అంగరాగాలు, వస్త్రాలు, ఆభరణాలు ఆమె లంకలో బందీ అయి రామునికి దూరమై దుఃఖం, నిరాశ, నిస్పృహలతో, కృంగి కృశించినప్పటికీ ఆమె తన శరీరలావణ్యాన్ని, ముఖతేజస్సుని సహజంగా ఉండేలా నిలిపింది. పది నెలలు చెరలో చెక్కుచెదరకుండా ఉంది అంటే అనసూయ ఇచ్చిన బహుమతులే కారణం.

పెద్దముత్తైదువ పెద్దమనస్సుతో ఇలా ఆభరణాలు పూలు, వస్త్రాలు ఇచ్చి సీతాదేవి నిత్యశృంగారవతిగా ఉండేలా దీవించింది.

అనసూయ సకలలోకహితైషిణి సీతాసౌభాగ్యసంరక్షిణి కూడా.

సతీ అనసూయ వంటి నారీరత్నం ఎక్కడో ఎప్పుడో గాని దర్శించడానికి లభించదు.

పతివ్రతాశిరోమణిగా కీర్తిపొందిన మహాతపస్విని అనసూయ.

* * *

# 15. శబరి

శబరి సామాన్యమైన ఆటవికస్త్రీ. ఆమెకు చదువుకునే అవకాశమే లేదు. అమాయకురాలు. బుద్ధి, జ్ఞానం అనే పదాలుకూడా ఎలా ఉంటాయో ఆమెకు తెలియనే తెలియదు. ఆధ్యాత్మిక సాధనపద్ధతుల గురించి చెప్పే పనేలేదు. అయితే గురువే దైవమని నమ్మిన భక్తురాలు. ఈమెను గురించిన ప్రస్తావన అరణ్యకాండలో కబంధుడు అనే రాక్షసుడు తెస్తాడు.

సీతాన్వేషణలో దండకారణ్యంలో తిరుగాడుతున్న రామలక్ష్మణులకు కబంధుడనే రాక్షసుడు పొట్టనపెట్టుకునే ప్రయత్నం చేస్తాడు. రామలక్ష్మణులు వాడి చేతులు నరికేస్తారు. కబంధుడు 'తాను శాపగ్రస్తుడననీ తనను చంపి దహనం చేస్తే శాపవిముక్తుడనౌతాన'నీ చెప్తాడు. రామలక్ష్మణులు అతను కోరినట్లే చేస్తారు. ఆతడొక దివ్యరూపం పొందుతాడు. రామలక్ష్మణులు రావణుని గురించి అడుగుతారు. అప్పుడు కబంధుడు మీరు ముందు సూర్యపుత్రుడైన సుగ్రీవుణ్ణి కలవండి. అతని వల్ల మీ కార్యం సానుకూలమవుతుంది అని చెప్తూ మీరు మార్గమధ్యంలో చేయవలసిన మరో పని మతంగాశ్రమం దర్శించడం. ఆ ఆశ్రమాన్ని ఏనుగులు కాపలా కాస్తూ ఉంటాయి. అక్కడి పువ్వులు ఏనాడూ వాడవు. నిత్యసువాసనలు వెదజల్లుతూ ఉంటాయి. ఆ ఆశ్రమంలో లతలు, చెట్లు రమణీయంగా దర్శనమిస్తాయి. లతలన్నీ వివిధరంగుల పూలతో, చెట్లు మగ్గిన పండ్లతో విరాజిల్లుతూ ఉంటాయి. ఆ పవిత్రమైన వనంలో మతంగమహర్షిని భక్తిశ్రద్ధలతో సేవించుకొన్న శబరి అనే ఆటవికస్త్రీ ఉంది. ఆ మహర్షి కరుణవల్ల యోగిని కాగలిగింది. ఆమె గురువును ఎన్నో ఏళ్లనుండి తరగని భక్తిశ్రద్ధలతో సేవించింది. ఆమెకున్న ఆస్తి అంతా తపస్సే.

మతంగమహర్షి సీతారామలక్ష్మణులు చిత్రకూటంలో ఉండగానే అమరలోకాలకు వెళ్లారు. అయితే శబరిని మాత్రం శ్రీరాముడు ఈ ఆశ్రమానికి వస్తాడు. అతణ్ణి సేవించాక నువ్వు ముక్తి పొందు అని చెప్తాడు. గురువచనాన్ని శిరసావహించి శ్రీరాముని రాకకై ఆమె నిత్య స్వాగతోపచారాలు సిద్ధపరచి ఎదురుచూస్తూ ఉంది. తప్పక ఆ మహర్షి ఆశ్రమాన్ని ఆ వృద్ధతాపసిని చూడండి అని కబంధుడు పదేపదే కోరతాడు.

ఆ మాట మీద రామలక్ష్మణులు మతంగాశ్రమానికి వస్తారు. రామునికి ఆశ్రమంలో జరగవలసిన అతిథిమర్యాదలు చేసే ధన్యురాలు శబరే కావాలని మతంగమహర్షి కోరిక. వారి రాకను దూరం నుండే గమనించింది యోగిని అయిన శబరి. పరుగు పరుగున వచ్చి భక్తితో ఆహ్వానించి వారి రాకకు పరమానందభరితురాలవుతుంది. రామలక్ష్మణులు కూడా ఆమెను చూచి ప్రశాంతచిత్తులవుతారు.

రాముడు ఆమెను 'నీ సాధన బాగా సాగుతోందా. పూర్తిచేయగలిగావా? నీవు గురువుగారికి చేసిన శుశ్రూష ఫలించి సిద్ధిని ప్రసాదించే ఉంటుంది అనుకుంటున్నాను నీ గురుభక్తి సాటిలేనిది' అంటాడు.

నిజానికి శ్రీరామదర్శనం మతంగమహర్షికి కలగలేదు. శబరిని వేచి ఉండి రామదర్శనం పొందమని గురువుగారి శుభకామన. అందుకే ఈ పవిత్ర మతంగాశ్రమానికి శ్రీరాముని ఆహ్వానించే అదృష్టం తనకు కలిగినందుకు ఆనందోత్సాహాలతో మురిసిపోతూ 'రామా! ఈ ఆశ్రమానికి మీరు వచ్చారు అంటే నా తపస్సు ఫలించింది అనే అర్థం. మీరు దేవతలకు ప్రభువులనీ, పురుషోత్తములనీ మా గురువుగారి ద్వారా తెలుసుకునే ఉన్నాను. ఇప్పుడు మీ దర్శనభాగ్యం కలిగింది. మీ కటాక్ష వీక్షణాలు నన్ను పవిత్రురాలిగా చేసాయి. నా జీవితం ధన్యమైంది. మీ ఆశీస్సులతో నేను తప్పక శాశ్వతమైన పుణ్యలోకాలు అందుకుంటాను.

స్వామీ! నా గురుదేవులు మతంగమహర్షుల వారిని వారి శిష్యులను చిరకాలం భక్తితో సేవించాను. మీరు చిత్రకూటంలో ఉండగా మహర్షులవారు శిష్యబృందంతో మహాప్రస్థానానికి సంకల్పించారు. నన్ను మాత్రం ఆశ్రమంలో తమ రాకకై వేచి ఉండమని ఆదేశించారు. తమకు స్వాగతోపచారాలు చేసే పరమభాగ్యాన్ని నాకు ప్రసాదించారు. ఇంతకాలంగా తమ శుభాగమనం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తూ ఉన్నాను. ఒళ్లంతా కళ్లు చేసుకుని మీరు ఎప్పుడు వస్తారా అని ఎదురుచూడడమే పనిగా బ్రతుకుసాగిస్తున్నాను. నేటికి నా అదృష్టం ఫలవంతమయింది. నా ఆనందానికి అవధులు లేవు. రామా! ఈ ఆశ్రమ ప్రాంతంలో దొరికే పళ్లలో మధురాతి మధురమైన పళ్లను ప్రతిరోజు ఏరి జాగ్రత్తగా తమ కోసం సిద్ధం చేస్తూ ఉన్నాను. నన్ను అనుగ్రహించండి. మీరు మీతమ్ముడు కలిసి మీకోసం ఏరి పెట్టిన పళ్లను ఈ దాసి సమర్పించే నైవేద్యంగా దయతో స్వీకరించమని శిరసువంచి ప్రార్థిస్తున్నాను" అని వినమ్ర అయి విన్నవించింది.

సీతాన్వేషణలో రామలక్ష్మణులు ఎప్పుడు ఏమితిన్నారో అసలు తినలేదో. అలాంటి సమయంలో శబరి ఆ అన్నదమ్ముల్ని ఆదరించి తల్లిలా బుజ్జగించి వివిధ రుచులలో పరిమళించే పళ్లను కొసరి కొసరి వడ్డించింది. ఆ అన్నదమ్ములు శబరివిందును ఎంతో ఆప్యాయతతో స్వీకరించి సంతుష్టి చెందారు. ఆ ఫలహారానికి ఆ అన్నదమ్ములు పరమానందం పొందారు.

ఆతిథ్యం స్వీకరించిన తరువాత రాముడు 'అమ్మా శబరీ! మీ గురువుగారు మతంగమహర్షి గురించి, ఈ ఆశ్రమప్రాశస్త్యాన్ని గురించి కబంధుడు మాకు చెప్పాడు. ఈ మతంగాశ్రమంలోని ప్రత్యేక విశేషాలు మాకు చూపించు తల్లీ' అని కోరాడు ఎంతో అభిలాషతో.

శబరి మహదానందంతో ఆ అన్నదమ్ముల్ని వెంటబెట్టుకుని ఆశ్రమమంతా చూపిస్తుంది. ఆశ్రమంలోని విశేషాలను పదేపదే వివరించి చెప్తుంది. వాటి విశిష్టతను వేనోళ్ల పొగుడుతుంది.

'రామా! ఈ మహావృక్షాలన్నీ బాగా విస్తరించి క్రిక్కిరిసినట్లుగా ఉండి ఆశ్రమానికి దట్టమయిన నీడను ఇస్తున్నాయి. వీటిక్రింద కూర్చుని తపస్సు ప్రశాంతంగా చేసుకోవచ్చు. వివిధ రకాల పక్షులు చెట్లమీద గూళ్లు కట్టుకుని ప్రశాంతంగా జీవిస్తూ తమ కిలకిలారావాలతో పరిసరాలను రంజింప చేస్తూ ఉంటాయి. ఈ వనాన్ని 'మతంగవన'మని వ్యవహరిస్తారు.

ఇదిగో ఈ యజ్ఞవేదిక చూడండి. మా గురుదేవులు భగవంతుని దర్శనానుభవం పొందుతూ, పవిత్రమైన వేదఘోషతో ఎన్నో క్రతువులు, ఇష్టులు చేసారు ఈ వేదికమీద. ఇక్కడ ఈ పడమటి దిశగా ఉన్న ఈ తిన్నె మా గురువర్యులు వృద్ధాప్యం వల్ల వణుకుతున్న చేతులతో పూవులు అర్పించిన పవిత్రపీఠం. ఇవిగో ప్రతిదిక్కునా అగ్నిగుండాలు ఉన్నాయి గమనించండి. మా మహర్షులవారి ప్రభావం వల్ల ఇప్పటికీ కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతిని వెదజల్లుతున్నాయి. మహర్షివర్యులు ప్రతిదినం స్నానంచేసే ఈ సరస్సును చూడండి. ఈ సరస్సు ఎలా ఏర్పడిందో తెలుసా స్వామీ! పుణ్యనదులు అన్నీ సముద్రంలో కలిసిన సప్త సముద్రాల పవిత్రమయిన జలాలనన్నింటినీ తమ తపఃశక్తితో ఇక్కడకు రప్పించి ఈ సరస్సును ఏర్పరచారు మతంగమహర్షుల వారు. ఈ చెట్లకొమ్మలమీద ఏనాడో ఆరవేసిన వస్త్రాలు ఇంకా తడిగానే ఉన్నాయి. మహర్షి రాకకోసం ఆ బట్టలు ఎదురుచూస్తున్నాయి. శిష్యులు పూజకోసం ఏర్పాటు చేసి పూజాద్రవ్యాలు అక్కడ ఇంకా తాజాగా సువాసనలు వెదజల్లుతూ ఉన్నాయి. ఏనాడో అల్లిన ఆ నల్లకలువల దండలు, పూలగుత్తులు నేటికీ

వాడిపోలేదు. అందం తగ్గలేదు. సువాసనకు లోటులేదు స్వామి. ఆశ్రమంలో చూడవలసిన అద్భుతాలన్నీ చూపించాను. స్వామీ నాకు సెలవు ఇవ్వండి. ఎండి కృశించిన ఈ శరీరాన్ని వదలి నేను చిరకాలం సేవించిన మహర్షుల సన్నిధికి వెళ్లడానికి అనుజ్ఞ ప్రసాదించండి' అంటూ అర్థించింది శబరి.

ఆమె భక్తితాత్పర్యాలకు ముగ్ధుడైన శ్రీరామచంద్రుడు 'శబరీ! నువ్వు నన్ను పూజ్యభావంతో సమాదరించావు. ఏరి ఏరి మంచి తియ్యని ఫలాలతో గొప్ప విందు ఇచ్చి గౌరవించావు. నిండుహృదయంతో నన్ను నువ్వు ఆత్మార్పణతో అర్చించావు. ఏ పుణ్యలోకాలకు వెళ్లాలనుకుంటున్నావో అక్కడకు హాయిగా వెళ్లు' అన్నారు.

'అర్చితోఽహమ్ త్వయా భక్త్యా గచ్ఛ కామమ్ యథాసుఖమ్'

వెంటనే ఆనందంతో శబరి అగ్నిలో దూకింది.. ఆ అగ్నినుండి దివ్యవస్త్రాభరణభూషితమైన తేజోరూపంతో వెలువడి మెరుపుతీగలా ఋషులు చేరే లోకానికి వేగంగా దూసుకుపోయింది శబరి.

భగవద్భక్తులు, జ్ఞానవంతులు అయినవారు ఏ విధంగా ముక్తికి అర్హులో, అదే తీరులో భాగవతుడయిన మహర్షిని సేవించిన సామాన్యులు కూడా ముక్తికి అర్హులే అని శబరివృత్తాంతం స్పష్టం చేస్తోంది. తాను భక్తితో చేసిన అతిథిసత్కారస్వీకరణ ద్వారా రాముడు తన జన్మకి ధన్యత చేకూర్చాడు అనే అంతులేని ఆనందావేశము ఆటవిక స్త్రీ, యోగిని అయిన శబరికి మహాప్రసాదమయింది.

జన్మమృత్యుసంసారచక్రం నుండి బయటపడడానికి అనుసరించే కర్మ, జ్ఞాన, భక్తి, భాగవతసేవలతో పాటు పరమాత్మ పవిత్ర కరుణా స్పర్శ లేనిదే ఫలాలు అందుకోలేరు. పరమేశ్వరుని కరుణాపాత్రురాలయిన శబరి దివ్యలోకాలను అందుకుంది.

శబరి ఎంగిలి పళ్లు పెట్టినది అనే మాట వాల్మీకిరామాయణంలో లేదు. వనసంచారనిపుణ అయిన శబరకాంతకు ఏచెట్టు పళ్లు తియ్యనివో ఏవి కావో తప్పకుండా తెలిసి ఉంటుంది. ఆ రకంగా ఆమె మధురఫలాలు ఏర్చి కూర్చిందే కానీ, కొఱికి తిని చూడలేదు. ఆ అవసరమే ఆమెకు లేదు. పండు రంగు, వాసనను బట్టి పండ్లను నాణ్యం చేయగల నేర్పు ఆటవికులకు వెన్నతో పెట్టిన విద్య.

ఏమయిన 'శబరి' భాగ్యము విశేషమైనది. అందుకే త్యాగరాజస్వామి **'ఎంతని వర్ణింతును శబరీ భాగ్యము'** అంటూ కీర్తించారు.

* * *

# 16. స్వయంప్రభ

శ్రీమద్రామాయణం కిష్కింధకాండ చివరలో 51, 52 సర్గలు, 53వ సర్గలో 13 శ్లోకాలు మొత్తం ఏభై ఒక్క శ్లోకాల్లో స్వయంప్రభ వృత్తాంతం వర్ణించాడు వాల్మీకిమహర్షి.

సీతాన్వేషణతత్పరులై అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ఆంజనేయాదులు ఒక వనంలో ప్రవేశించారు. ఆ వనంలో చెట్లకు ఎక్కడా ఫలాలు లేవు. నీటికొలనులు లేవు. కండుమహర్షిశాపానికి గురి అయిన వనం అది. ఆకలితో, దాహంతో అలమటిస్తున్న వానరులకు సమీపంలో ఒక బిలంలో నుండి తడిసిన రెక్కలతో వస్తున్న పక్షులు కనిపించాయి. ఈ బిలంలో తప్పకుండా నీటికొలనులు ఉంటాయి. మనం లోపలికి వెళదాం అని నిశ్చయించుకున్నారు. దారి అంతా చిమ్మచీకటి. కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించడం లేదు. దారీతెన్నూ తెలియడం లేదు. అయినా దాహం తీర్చుకోవడానికి వేరే దారిలేక ఒకరిని ఒకరు పట్టుకుని యోజన దూరం ప్రయాణం చేసారు. యోజనం అంటే ఎనిమిది మైళ్లు. ఒక పక్కదాహంతో నోరు పిడచకట్టుకుపోవడం, చీకటిలో ఈ నడకతో అలసి సొలసి తెలివితప్పి దబ్బుమని పడిపోయారు. కొంతసేపటికి తెలివి వచ్చింది. తేరుకుని కళ్లు తెరిచి చూసేసరికి అద్భుతమైన వెలుగు. స్వర్ణమయమైన వివిధఫలవృక్షాలు, మణిమయ భవనాలు, తామరకొలనులు, జలపక్షులతో పరమ రమణీయమైన దృశ్యం కనిపించింది. ఆశ్చర్యపడుతూనే ఆ భవనంలోకి ధైర్యం చిక్కబట్టుకుని ప్రవేశించారు. అక్కడ కందమూల ఫలాలు, ఆహారపానీయాలు, మద్యాలు కనిపించాయి. అవి దాటి కొంచెం ముందుకు వెళ్ళగానే కృష్ణాజినం ధరించి, నియమితాహారంతో కృశించి, అగ్నిహోత్రంలా ప్రకాశిస్తున్న ఒక వృద్ధతాపసి దర్శనమిచ్చింది. వెంటనే

ఆంజనేయుడు ఆ వృద్ధపవిత్రమూర్తికి భక్తితో నమస్కరించి – 'అమ్మా! మీరెవరు? ఈ భవనాలు ఈ అంతులేని సంపదలు ఎవరివి? ఈ భోగభాగ్యాల మధ్య ధర్మచారిణివైన తాపసివి నీవెవరు ? మేం భరించలేని ఆకలితో దాహంతో ఈ బిలంలో నీరు లభిస్తుందనే ఆశతో వచ్చాం. ఇక్కడ అంతా అద్భుతంగా ఉంది. ఈ స్వర్ణమయులోకంలో తపోసంపన్నులయిన మీరు వసించడం చిత్రంగా ఉంది. కొంచెం వివరంగా చెప్పండి' అని కోరాడు. ఆ వృద్ధతాపసి ఇలా చెప్పింది. 'నేను మనువులలో ఒకరైన మేరుసావర్ణి కుమార్తెను. నా పేరు స్వయంప్రభ. మయుడనే మాయావి మహాతేజస్సును సాధించి ఈ వనాన్ని ఈ భవనాల్ని నిర్మించాడు. బ్రహ్మ ఈ భవనాన్ని హేమ అనే అప్సరసకు ఇచ్చాడు. నృత్యగీతవిశారద అయిన హేమ నా మిత్రురాలు. ఆమె కోరికమీద ఈ భవనాన్ని నేను కాపాడుతున్నాను. ఇదీ విషయం. ఇక మీరు బాగా అలసి ఉన్నారు. ఈ పళ్లు కడుపునిండా తినండి. ఈ చల్లని పానీయాలు త్రాగండి. విశ్రమించండి. అలసట తీరిన తరువాత మీరు వచ్చిన పని చెప్పదగినది అయితే చెప్పండి' అంది ఆదరంగా.

స్వయంప్రభఆతిథ్యానికి సౌమ్యభాషణానికి సేదదీరిన హనుమ ఆ తాపసితో – శ్రీరామవృత్తాంతంతో ఆరంభించి – సుగ్రీవుడు సీతాన్వేషణకై వానరులను నాల్గుదిక్కులకు పంపించడం – తాము దక్షిణదిశకు రావడం అన్వేషణలో అలసి ఈ బిలంలో ప్రవేశించడం పూసగుచ్చినట్లు వివరించాడు. చక్కని ఆతిథ్యంతో ఆదరించిన కన్నతల్లి వంటి మీకు ప్రత్యుపకారంగా మేము చేయదగినది ఏదైనా ఉంటే సెలవియ్యమని కోరాడు. ధర్మచారిణి అయిన స్వయంప్రభ తాను తన ధర్మం నిర్వర్తించాననీ దానికి బదులుగా తనకేమీ చేయనవసరం లేదనీ చెప్తుంది.

ప్రస్తుతం హనుమదాదులు బిలంలో చిక్కుకుని ఉన్నారు. సీతాన్వేషణ ఇంకా పూర్తికాలేదు. ఈ బిలం నుండి బయటపడే మార్గమా ఎవరికీ తెలియదు, స్వయంప్రభ దయతలిస్తే తప్ప. ఈ విషయం స్వయం ప్రభకు ఎటూ తెలుసు. హనుమకు కూడా తెలుసు. అయినా వినయంతో తాము చెయ్యగలిగింది ఏమైనా ఉంటే చెప్పమంటాడు కార్యనిర్వహణ దక్షుడైన హనుమ. నాకేమీ అక్కరలేదు అని స్వయంప్రభ అనగానే తమస్థితిని మరో మారు ఆమెకు విడమర్చి చెప్పాడు. తల్లీ! మేమంతా నిన్ను శరణు కోరుతున్నాం అంటాడు అంజలి ఘటిస్తూ.

స్వయంప్రభ హనుమవైపు మెచ్చుకోలుగా చూసి, ఈ బిలంలో ప్రవేశించినవాళ్లు ప్రాణాలతో బయటపడడం జరగదు. కానీ మీరందరూ గట్టిగా కళ్లు మూసుకుంటే మిమ్మల్ని బయటికి చేరుస్తాను. అది నా తపశ్శక్తి వల్ల నియమనిష్ఠల వల్ల మాత్రమే సాధ్యమవుతుంది.

**'తపసస్తు ప్రభావేన నియమోపార్జితేన చ**
**సర్వానేవ బిలాదస్మా దుద్ధరిష్యామి వానరాన్'** – కి.53-7 శ్లో

వానరులంతా తమ సన్నని వేళ్లతో కళ్లు గట్టిగా మూసుకున్నారు. స్వయంప్రభ క్షణంలో అందరినీ బిలం నుండి బయటకు తీసుకువచ్చింది. ఇవిగో పర్వతాలు – అదిగో మహాసముద్రం. క్షేమంగా వెళ్లండి. 'స్వస్తిఽస్తు!' అంటూ స్వయంప్రభ శ్రీమంతమైన తన గుహలోకి వెళ్లిపోయింది. చెప్పినట్లుగా హనుమదాదులను నిజంగా ఉద్ధరించిందామె. ఉద్ధరించడం అంటే పైకి తీసుకురావడం. బిలంలో నుండి బయటికి తీసుకొచ్చింది.

మహాకావ్యమైన రామాయణం కిష్కింధకాండ చివరలో వచ్చిన ఈ చిన్ని ఘట్టం – పెద్ద ప్రయోజనాన్ని కూర్చి పెట్టింది. సీతాన్వేషణలో వానరులు ఎదుర్కొన్న కష్టబాహుళ్యాన్ని వివరించే ఘట్టమిది. రసపరంగా పరిశీలిస్తే అద్భుతరసాన్వితమైన ఘట్టం. స్వయంప్రభగుహలో వానరులు

ఎన్నెన్నో అద్భుతాలు చూశారు. స్వర్ణమయము, సర్వభోగప్రదము అయిన గుహలో ధర్మచారిణి అయిన వృద్ధతాపసిని చూసారు. ఆ గుహలో ప్రవేశించి వానరులు బయటకు రావడం మరో అద్భుతం. స్వయంప్రభ చేసిన సత్కారం అది. ఇక రచనాపరంగా చూస్తే స్వయంప్రభను గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా వాల్మీకి మహర్షి ఆమెను 'ధర్మచారిణి'! అని సంబోధించి సంభావిస్తాడు. హనుమ చేతకూడా 'ధర్మచారిణి!' అనే గౌరవప్రదంగా సంబోధింపచేస్తాడు. ఏభై శ్లోకాల్లో చెప్పిన కథలో ఆరు పర్యాయాలు ఆమెను 'ధర్మచారిణి' అంటాడు వాల్మీకి.

**మహాభాగాం తాపసీం ధర్మచారిణీ 51-1**

**తాపసీ ధర్మచారిణీ ! 51-9; తాపసీ ధర్మచారిణీ! 52-1**

**శరణం త్వా ప్రపన్నా స్మః సర్వే వై ధర్మచారిణీ ! 53-2**

**మహచ్చ కార్యమస్మాభిః కర్తవ్యం ధర్మచారిణీ! 53-5**

**తతస్తాన్వానరా సర్వాం స్తాపసీ ధర్మచారిణీ! 53-11**

ధర్మచారిణీ! అనే విశేషణంతో పాటు హనుమంతునితో ఇలా చెప్పింది అనే సందర్భంలో - 'ప్రత్యువాచ హనుమంతం సర్వభూత హితే రతా' 51-9 అనే మరో ఉదాత్తభావాన్వితమైన విశేషణంతో స్వయంప్రభను సమ్మానించాడు వాల్మీకిమహర్షి. కేవలం ధర్మాన్ని ఆచరించి ధర్మచారిణి కావడమేకాదు, ఆ తపస్విని సర్వభూతాలకు హితము చేయాలనే కోరిక గల మహోన్నతురాలు. గుహలోకి ప్రవేశించిన వానరమూక దారితప్పివచ్చిందిలే - నాకెందుకు అని అనుకుని ఉంటే కథలేదు. సర్వప్రాణులకు మంచి చేయాలి అనే ఉన్నతమైన భావసంపన్నురాలైన స్వయంప్రభ ఆ గుహలో ఉండబట్టి ఆకలిదప్పులతో వచ్చిన అతిథులకు ప్రియమార ఆహారపానీయాలు ఇచ్చి

ఆదరించింది. ముందుగా ఏదైనా తిని సేదతీరాక మీ విషయాలు చెప్పదగినవైతే చెప్పండి అన్న సౌమ్య సౌజన్యరాశి స్వయంప్రభ. తన తపశ్శక్తిని ధారపోసి వానరులను ఉద్ధరించింది ఆ సర్వభూత హితైషిణి. స్వయంప్రభ గుహలో హనుమదాదులు ఉండిపోతే ఇక తరువాత కథ సాగేది ఎలా? తానై వానరులను సంపాతిగుహ సమీపంలో చేర్చడంతో కథకు క్రొత్త వెలుగు వచ్చింది. కథ చురుకుగా ముందుకు సాగింది. సంపాతి తాను సుదూరం చూడగలననీ సీత లంకలో ఉన్నదనీ సముద్రం దాటి వెళ్ళడం తప్పదనీ హెచ్చరించడంతో హనుమ సముద్రలంఘనానికి పూనుకోవడం జరిగింది. కథ ముందుకు నడవడానికి రామకార్యానికి స్వయంప్రభ తాను చేయగల సహకారం మౌనంగా అందించింది. ధర్మ విగ్రహుడైన శ్రీరామునికి ధర్మచారిణి అయిన స్వయంప్రభ అర్పించిన నివాళి ఇది.

ధర్మచారిణీ! సర్వభూతహితే రతా ! అనే అన్వర్థమయిన విశేషణాలతో విరాజిల్లే స్వయంప్రభ – రామాయణం అందించే ధర్మాల్లో సర్వభూతహితైషులు కావాలన్న విషయానికి ప్రబల ఉదాహరణగా నిలిచింది. స్వయంప్రభచరిత్ర సర్వకాలాల్లో ప్రశంసనీయమైనట్టిది.

ఇక స్వయంప్రభ గుహలోకి వెళ్ళిరావడంలోని విశేషార్థాన్ని శ్రీమాన్ శ్రీ భాష్యం అప్పలాచార్యుల వారు వివరించిన విధానం చూద్దాం. స్వయంప్రభ గుహలోకి ప్రవేశించి చీకటిని దాటి వెలుగును దర్శించడం అంటే ఆత్మస్వరూపం తెలుసుకోవడమే. తానెవరో తాను తెలుసుకోవడం అన్నమాట. మన శరీరం కూడా స్వయంప్రభ ఉన్న గుహ. కళ్లు మూసుకుని మనలోకి మనం చూసుకోవాలి. వానరులు గుహలో ప్రవేశించినప్పటి చీకటి మనం కళ్లు మూసుకుంటే ఉండే గాఢాంధకారమే. ఆ గాఢాంధకారాన్ని ఆవృత్తచక్షువై ఛేదించుకుంటూ వెళ్ళి చూస్తే మనలోని

భగవానుడు దివ్యతేజస్సుతో దర్శనమిస్తాడు. అదే అద్భుతదర్శనం, ఆత్మదర్శనం. 'ఆవృత్తచక్షుః' అంటే బాహ్యవిషయాల వైపు చూపు ప్రసరించకుండా ఆంతరవిషయాలపై మనసు నిలిపి చూపును లోపలికి ప్రసరింపచేసేవాడు. లోపలికి ప్రవేశిస్తే కానవచ్చేది స్వయంప్రభే. ఇదే ఆత్మస్వరూపం. స్వయంప్రకాశం, తనంతతానుగా ప్రకాశిస్తుంది. దాన్ని చూపించడానికి మరో ప్రకాశం అవసరం లేదు. దీపాన్ని చూడడానికి మరో దీపం అవసరం లేనట్లే మనలోని వెలుగును చూడడానికి వేరే సాధనం అక్కరలేదు.

హనుమంతుడు ఆ గుహలోకి వెళ్ళి స్వయంప్రభను దర్శించి సంభాషించి పరిపూర్ణమైన ఆత్మస్వరూపజ్ఞానంతో శ్రోత్రియుడై ఆచార్యుడై బయటకు వచ్చాడు. ఇక సీతాదర్శనం చేసి శ్రీరాముని సందేశాన్ని క్షేమాన్ని ఆమెకు అందించే అర్హతను సంపాదించుకున్నాడు. బాలకాండలో విశ్వామిత్రమహర్షి, సుందరకాండలో హనుమ సీతారాములను అనుసంధించే గురుపాత్రను నిర్వహించారు. స్వయంప్రభదర్శనంతో హనుమకు ఆచార్యస్థాయి, స్థానం రెండూ లభించాయి.

స్వయంప్రభ రాముని దర్శించినట్లు వాల్మీకిమహర్షి ఎక్కడా చెప్పలేదు. హనుమంతుని నోట రామకథాశ్రవణం చేసింది. మోహన రాముని ఆమె మౌనంగానే అర్చించింది. అధ్యాత్మరామాయణంలో మాత్రం – స్వయంప్రభ రాముని చేరవచ్చి స్తుతించినట్లు, రాముడు ఆమె భక్తికి మెచ్చి మోక్షాన్ని ప్రసాదించినట్లు కిష్కింధకాండ ఆరో సర్గలో ఉంది. 'రామచరితమానస్'లో కూడా ఇదే విషయం ఉంది.

వాల్మీకిమహర్షి ఆ విషయం ప్రత్యేకంగా చెప్పలేదు. కానీ త్యాగరాజస్వామి పంతువరాళి రాగంలో 'అప్పరామభక్తి ఎంతో గొప్ప'

అనే కీర్తనలో రెండో చరణంలో **'అబల స్వయంప్రభకు దైవమచలపదవి నిచ్చునా!'** అంటూ కీర్తించాడు.

స్వయంప్రభదర్శనం గురించి డాక్టర్ ఇలపావులూరి పాండురంగా-రావు గారు చేసిన విశ్లేషణ ఈ సందర్భంలో స్మరించుకోవలసి ఉంది.

"వానరులకు స్వయంప్రభసందర్శనం బ్రహ్మసాక్షాత్కారంలాంటిది. అంధకారం నుంచి వెలుగులోకి, వెలుగు నుంచి తిరిగి తమ ప్రపంచంలోకి పయనించిన కపీశ్వరులకు కనురెప్పపాటులో కమనీయమైన కాంతి కనిపిస్తుంది. అంతలో కంటికి దూరమై పోతుంది. ఉపనిషదాదేశం ఈ సందర్భంలో గుర్తుకు వస్తుంది.

'యదేతత్ విద్యుతో విద్యుతదా ఇతీన్న్యమీ మిషదా" – మబ్బుల నుంచి వెలువడిన మెరుపుతీగలాగ క్షణంలో వెలిగి క్షణంలో మాయమై పోతుందట పరబ్రహ్మస్వరూపం. మయునిచే నిర్మితమైన మాయాలయాన్ని ఆనందనిలయంగా చేసుకున్న స్వయంప్రభ కూడా ఇలాంటి విద్యుల్లత. హనుమంతుడు తమ వృత్తాంతంతో పాటు రామకథ కూడా సూక్ష్మంగా చెప్తాడు. కానీ స్వయంప్రభ ఆ విషయాన్ని గురించి ఏమీ చర్చించదు. చెప్పదగిందయితే చెప్పండి అంటుంది. చెప్పిన తరువాత దాన్ని గురించి ఏమీ అనకుండా నిర్లిప్తంగా ఉంటుంది. అటు ఆకాశానికీ ఇటు మేఘానికీ కూడా అంటకుండా లోకాన్ని ఆలోకనంతో ఆశ్చర్యచకితం చేసే మెరుపుతీగ స్వయంప్రభ. ఆమె వెలుగు ఆమెది.

**"తనంతట తాను వెలిగే అసలయిన వెలుగు అది."**

* * *

# 17. సురస

రామాయణంలో తమ వంతు పాత్రను పోషించి కడకు పుష్టిని గూర్చిన పాత్రలలో 'సురస' ఒకతె. ఈమె దేవకాంత. అంతేకాదు 'నాగమాత'కూడా.

సీతాదేవి లంకలో ఉంది అని తన దూరదృష్టితో సంపాతి చెప్పిన మీదట – సముద్రం దాటి లంకకు వెళ్లి సీతను దర్శించి వచ్చే సమర్థులెవరు అంటూ ఆలోచనలో పడ్డారు. దక్షిణదిశకు సీతాన్వేషణకై వెళ్లిన అంగదాదులు తర్జనభర్జనలు అయి చివరకు హనుమంతుడొక్కడే సముద్రం దాటి వెళ్లి సీతను చూచి రాగలడని నిర్ణయించుకుంటారు.

హనుమంతుడు రాముడు వదలిన బాణంలా దూసుకుని సముద్రలంఘనానికి ఉపక్రమించాడు. కొంతదూరం ప్రయాణం సాగే సరికి మైనాకుడు అనే పర్వతం ఎదురుపడి తన ఆతిథ్యం తీసుకుని మరీ వెళ్లమని అభ్యర్థించాడు హనుమను. హనుమ తాను రామకార్యార్థినై వెళుతున్నానని ఆగడం కుదరదనీ, మైనాకపర్వతాన్ని ప్రేమగా తాకి ఆతిథ్యం తీసుకున్నాననే భావించుకోమంటూ ముందుకు సాగిపోయాడు.

ఆ సందర్భంలో సాహసోపేతమైన మహత్కార్యానికి పూనుకున్న హనుమకు అవసరమైన బలం, శక్తి, వీర్యం, స్థైర్యం, బుద్ధికుశలత పుష్కలంగా ఉన్నాయో లేవో పరీక్షించమని దేవతలు తేజస్వి అయిన నాగమాత – సురసను వేడుకొన్నారు. సురస వెంటనే భయంకరమైన వికృతమైన రూపంతో హనుమంతుని దారికి అడ్డంగా నిలబడింది. ఆమెకు పెద్ద నోరు, పదునైన కోరలు ఉన్నాయి. ఆమె హనుమకు ఎదురుగా నిలిచి చూడు! నాకు ఆకలిగా ఉంది. దేవతలు నాకు ఆహారంగా నిన్ను చూపించారు. కాబట్టి నువ్వు నాకు ఆహారం కావలసిందే. నేను నా నోరు తెరుస్తాను. నువ్వు నా నోట్లోకి దూరి నా ఆకలి తీర్చు అంటూ నిలదీసింది.

తనకు అడ్డు నిలిచిన మహోగ్రరూపి మారురూపం దాల్చిన నాగమాత సురస అని – హనుమ గుర్తు పట్టాడు! నెమ్మదిగా సురసతో 'అమ్మా! సురసా! నేను రామకార్యార్థమై వెళుతున్నాను. లంకలో సీతను దర్శించి ఆ వార్త రామునికి తెలియబరచి వచ్చి నీ నోట్లో పడతాను. నేను నిజం చెప్తున్నాను. నన్ను నమ్ము తల్లీ!' అంటూ వినయంగా ప్రార్థిస్తాడు.

హనుమ మాటలకు సురస ఒప్పుకోదు. పట్టువిడవదు. వెంటనే నా నోట్లో పడవలసిందే అంటుంది. నన్ను దాటిపోలేవు. నన్ను తప్పించుకొని పోయే శక్తి ఎవరికీ లేదు. బ్రహ్మ నాకు ఇచ్చిన వరం అంత గొప్పది. హనుమ ఆలోచనలో పడి బ్రహ్మవరాన్ని తప్పించుకునేది ఎలా అనుకుంటూ ఆలోచించాడు. అమ్మా అయితే నోరు తెరిచి నన్ను మింగు అంటూ తన శరీరం పది యోజనాలకు పెంచుతాడు. సురస 20 యోజనాల వెడల్పుగా నోరు తెరిచింది. హనుమ 20 యోజనాలు పెంచాడు. సురస ముప్పై యోజనాలు పెంచింది. ఇలా హనుమ సురస పోటీ పడి శరీరాలు పెంచారు. హనుమ తొంభై యోజనాలకు సురస వంద యోజనాలకు పెంచారు. హనుమంతుడు చిటికెలో బొటన వ్రేలంత ప్రమాణానికి కుంచించి సురసనోట్లో ప్రవేశించి ఆమె నోరుమూసే లోగా బయటకు వచ్చాడు. తన సహజరూపాన్ని పొంది చేతులు జోడించి ఆమెకు నమస్కరిస్తాడు. దాక్షాయణి నమోఽస్తు తే! అంటూ ప్రార్థిస్తాడు.

బ్రహ్మవరాన్ని గౌరవించాను తల్లీ! అంటాడు. సురస హనుమ వివేకానికి, లోకజ్ఞతకు, సమయస్ఫూర్తికి సంతోషిస్తుంది. సీతారాముల సమాగమానికి అతని ప్రయత్నం తప్పక ఫలిస్తుందని మనసారా దీవిస్తుంది. హనుమ సముద్రలంఘనం చేసి ఘనవిజయాన్ని సాధిస్తాడని సురస మాటల్లో స్పష్టమవుతుంది.

హనుమ వంటి కార్యసాధకుణ్ణి పరీక్షించి దేవతలకు రామకార్యం సఫలోన్ముఖం కానుంది అని తెలియచెప్పిన సురస రామకథలో హనుమకు ఆశను కలిగించిన అద్భుతమైన పాత్ర.

* * *

## 18. తాటక

'తాటక' ఒక యక్షకాంత. ఆమె అగస్త్యమహర్షిశాపం వల్ల రాక్షసిగా మారుతుంది.

రామాయణానికి మూలకందమయిన రాక్షససంహారం తాటక సంహారంతో ఆరంభమవుతుంది.

ఇక తాటక వివరాలలోకి వస్తే పూర్వం సుకేతుడు అనే యక్షుడు ఉండేవాడు. ఆతడికి బహుకాలం సంతానం కలగలేదు. సంతానార్థం అతడు బ్రహ్మదేవుణ్ణి గురించి తపస్సు చేసాడు. బ్రహ్మ ప్రత్యక్షంకాగా తనకు వేయి ఏనుగుల బలం గల కుమారుడు కావాలని కోరతాడు. బ్రహ్మ అతనికి పుత్రునికి బదులు అంతటి శక్తిగల కుమార్తె పుడుతుందని వరం ప్రసాదిస్తాడు. ఆమెకు యుక్తవయస్సు రావడంతో ఆమె శరీరంలోని ప్రతి అణువు శోభాయమానమై ప్రకాశిస్తాయి. ఆమె అందచందాలు ద్విగుణీకృతమవుతాయి. తండ్రి సుకేతుడు తన అందాల కూతుర్ని సుందుడు అనే యక్షునికిచ్చి వివాహం జరిపిస్తాడు. తాటక సుందులకు ఒక కుమారుడు కలుగుతాడు. ఆతని పేరు మారీచుడు.

సుందుడు స్వభావం చేత పొగరుతో వ్యవహరిస్తాడు. మునులను వేధించడం ఆతనికి అలవాటు. అగస్త్యమహాముని ఎడల దుష్టుడై వ్యవహరించడంతో అగస్త్యుని శాపం వల్ల సుందుడు మరణిస్తాడు. ఆ సంఘటనను చూచిన తాటక, మారీచుడు అగస్త్యుని మీద విజృంభిస్తారు. అగస్త్యునికి కోపం వచ్చి తల్లీ, కొడుకులను రాక్షసులగుదురు గాక! అని శపిస్తాడు. దానితో ఆ ఇద్దరికీ రాక్షసత్వం వస్తుంది. అందమయిన ఆకారం పోయి వికారమైన రూపం వచ్చింది. నరులను భక్షించడం తాటకకు నైజంగా మారిపోయింది. అగస్త్యమహాముని జోలికి పోలేక

ఆయన అడుగుపెట్టిన అరణ్యప్రదేశాలన్నీ తాటక మారీచుడు పాపపంకిలం చేస్తారు. మునుల ఆశ్రమాలు అధికంగా గల మందకరూశ రాజ్యాలమీద దాడిచేస్తారు. ఈ మందకరూశ దేశాలు అత్యంత పవిత్రమైనవి. ఒకప్పుడు ఇంద్రుడు వృత్రాసురుణ్ణి సంహరించాడు. ఆ హత్య వల్ల ఇంద్రునికి బ్రహ్మహత్యాపాతకం పట్టుకుంది. ఆ పాతకప్రభావంవల్ల అతనికి విపరీతమయిన ఆకలీ దాహం పట్టుకున్నాయి. ఎంత తిన్నా ఆకలి తీరదు. ఎన్ని పానీయాలు తాగినా దాహం తీరదు. ఈ బాధతో తిరుగుతూ ఇంద్రుడు దైవవశాత్తు మందకరూశ ప్రాంతానికి వచ్చాడు. ఈ ప్రదేశంలో అడుగు పెట్టగానే ఇంద్రుని పాపం ప్రక్షాళనమై ఆతని ఆకలీ దాహం తీరాయి. ఇంద్రుడు బాధావిముక్తుడు కావడంతో ఆనందపడి ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండగలదని వరం ప్రసాదిస్తాడు. ఆ కారణంగా ఈ రెండు రాజ్యాలు సిరిసంపదలతో తులతూగుతూ ఉండేవి. కానీ తాటక మారీచులు విపరీతంగా దాడులుచేయడం వల్ల ఆ ప్రదేశాలన్నీ పాడుబడ్డాయి. విశ్వామిత్రుని ఆశ్రమం పేరు సిద్ధాశ్రమం. సిద్ధాశ్రమానికి వెళ్లాలంటే ఈ పాడుపడ్డ మందకరూశ రాజ్యాలు దాటుకుని వెళ్లాలి. అక్కడకు రాగానే విశ్వామిత్రుడికి తాటక మారీచులు ఇక్కడ సంచరిస్తూ ఉండవచ్చు అనిపించింది. ఆ ఆలోచనరాగానే విశ్వామిత్రుడు రాముని హెచ్చరిస్తాడు.

రామా! ఈ తాటకను తప్పకుండా సంహరించాలి. గోవులకు బ్రాహ్మణులకు, హితము చేయడం కోసం ఈ దుష్టురాలిని చంపాలి. శాపం వల్ల రాక్షసిగామారి విజృంభిస్తోంది. ఈమెను చంపడానికి నీవు తప్ప మూడు లోకాలలో సిద్ధపడగలవాడు మరొకడు లేదు. రామా! అపాయం కలిగించే దుష్టశక్తుల నుండి ప్రజలను కాపాడడం అతి ముఖ్యమైన క్షత్రియధర్మం. ధర్మాన్ని ధ్వంసం చేయడానికి పనిగట్టుకుని పూనుకున్న తాటకను చంపడంలో ఎలాంటి సందేహానికి తావులేదు. ఈ తాటక అధర్మమే ఆచరిస్తోంది. ఈమెకు ధర్మమనేది లేదు. అందువల్ల

ఈమెను చంపడంలో దోషం లేదు. ఒక స్త్రీని చంపడమా? అది దోషం కాదా? అని సంశయించకు.

పూర్వం విరోచనుని కూతురు మంథర ఈ భూమిని నాశనం చేయాలని ప్రయత్నించినప్పుడు ఇంద్రుడు ఆమెను సంహరించాడు. అతడు ఈమె స్త్రీ కదా చంపడమా అని సంకోచించలేదు.

ఒకప్పుడు రాక్షసుల గురువు శుక్రుడు, రుద్రుని వద్దకు వెళ్లి తపస్సు చేయసాగాడు. శుక్రుడు లేని సమయం కనిపెట్టి దేవతలు రాక్షసులను హింసించడం మొదలుపెట్టారు. రాక్షసులు దిక్కుతోచక శుక్రుని తల్లిని శరణుకోరారు. ఆమె అసురులను రక్షించడానికి దేవతల్ని చంపడానికి పూనుకొంది. పరిస్థితిని చూసి ఇంద్రుడు దేవతల్ని రక్షించమని విష్ణువుని ప్రార్థించాడు. విష్ణువు ఆ సమస్యను పరిష్కరించడానికి శుక్రుని తల్లి శిరస్సును ఛేదించి సంహరించాడు. కాబట్టి రామా! పూర్వం ఎందరో మహాత్ములు అధర్మపరులైన స్త్రీలను సందేహించక ప్రజాక్షేమాన్ని కోరి సంహరించారు. నువ్వు కూడా ఈ దుష్టురాలైన తాటకను ఆలస్యం చేయకుండా సంహరించమన్నాడు.

విశ్వామిత్రుడు ఇంత తీవ్రంగా దృఢంగా చెప్పిన మాటలు శ్రీరాముడు విన్నాడు.

'మా తండ్రి గారు దశరథుల ఆజ్ఞ వల్ల వారి మాట మీద నాకు గల గౌరవం వలన, గురువైన విశ్వామిత్రులవారి ఆజ్ఞవల్ల స్త్రీవధ చేయరానిదైనా జంకులేకుండా చేస్తాను.

**గో బ్రాహ్మణ హితార్థాయ**
**దేశస్యాస్య సుఖాయ చ**
**తవచైవాప్రమేయస్య**
**వచనం కర్తుముద్యతః । (బాల. 26.5)**

'గోవులకు, బ్రాహ్మణులకు మేలు చేయడానికి దేశం సుఖంగా ఉండడానికి విశ్వామిత్రులవారి ఆజ్ఞను పాటిస్తాను' అని చెప్పి విల్లుచేతబూని, నారిసారించి తీవ్రమైన ధ్వని చేసాడు. ఆ ధ్వని అడవినంతా దద్దరిల్లేలా చేసింది. ఆ ధ్వనిని విన్న తాటక ఎవరబ్బా! నా ఆధిపత్యాన్ని ధిక్కరించే ఈ వీరుడు అనుకుంటూ పట్టలేని కోపంతో రామలక్ష్మణుల మీదకు వేగంగా వస్తుంది. అలా క్రోధంతో వస్తున్న తాటకను విశ్వామిత్రుడు గమనిస్తాడు. వెంటనే ఆ రాజకుమారులకు మంగళాశాసనం చేస్తాడు. వారు విజయం పొందాలని మనసారా ఆకాంక్షిస్తాడు.

భయంకరమైన వికృతరూపంతో తమమీదికి దూసుకువస్తున్న తాటకను చూచి రాముడు 'లక్ష్మణా! ఈ యక్షకాంత భీకరరూపం చూసావా? పిరికివాళ్లు ఈమెను చూస్తే వారి గుండెలు బ్రద్దలయి పోతాయి. మాయాబలం కూడగట్టుకుని చూడశక్యం కాకుండా ఉంది. అయినా ఆడది కదా చూస్తూ చూస్తూ చంపడానికి నా మనస్సు అంగీకరించడంలేదు. ఈవిడ ముక్కు చెవులు, కాళ్లు నరికివేసి అశక్తురాలుగా చేస్తే ఆ శిక్ష సరిపోతుందనిపిస్తోంది' అంటాడు. అంతలోనే తాటక విరుచుకుపడుతూ కోపంతో గర్జిస్తూ రాముని మీదకు రాసాగింది. ఆమె ఉద్ధృతమైన ప్రయత్నాన్ని చూచిన విశ్వామిత్రునికే కంగారు పుట్టి రామునికి ప్రమాదం కలుగుతుందేమో అని "స్వస్తి రాఘవయోరస్తు జయం చైవ" – అంటాడు.

లక్ష్మణుడు తాటక ముక్కు చెవులు కోసేస్తా అంటాడు. ఆ కోపంతో తాటక దట్టమైన ధూళిని ఎగరగొట్టి రామలక్ష్మణులకు ఏమీ కనపడకుండా చేస్తుంది. అంతతో ఆగక వారి మీద రాళ్లవాన కురిపిస్తుంది. తాను రామలక్ష్మణులకు కనబడకుండా మాయోపాయాలతో కూడ యుద్ధం చేస్తుంది.

ఈ పరిస్థితి గమనించిన విశ్వామిత్రుడు సాయంసంధ్య సమీపిస్తోంది. సాయంసంధ్యలో రాక్షసులకు బలం ఎక్కువ. ఆ సమయంలో వారిని చంపడం కష్టం. రామా! ఈమె మీద జాలి చూపడం తగదు. తక్షణమే నిర్దాక్షిణ్యంగా ఈ క్రూరరాక్షసిని సంహరించు అని హెచ్చరిస్తాడు. తాటక కనబడటం లేదు, ఆమె చేసే ధ్వనిని గమనించి ఆమె ఎక్కడ ఉందో రాముడు శబ్దవేధిజ్ఞానంతో బాణాలను ఆమె మీద ప్రయోగించాడు.

'శబ్దవేధి' అంటే శబ్దాన్ని విని ఎక్కడ నుండి వస్తోందో గుర్తించి ఆ ప్రాంతాన్ని గురిచూసి బాణప్రయోగం చేయడం. శ్రీరామునికి ఆ విద్య బాగా వచ్చు. శ్రీరాముడు ప్రయోగించిన బాణం తాటక దాగి ఉన్న రక్షణస్థానాన్ని తుత్తునియలు చేసింది. తాటక ఇక వేరే దారి లేకపోవడంతో నిరాశతో దుస్సాహసంతో రామునిమీద పిడుగులా పడి అతనిని అంతం చేయాలనే ప్రయత్నం చేస్తుంది. తాటక బయటపడడంతోనే రాముడు ఆమె మీద బాణం ప్రయోగిస్తాడు. అది ఆమె గుండెల్లో సూటిగా గుచ్చుకుంటుంది. వెంటనే నేలమీదకు ఒరిగిపోతుంది. పడీ పడగానే ప్రాణాలు వదిలిపోతాయి.

తాటక నేలమీద పడి మరణించడం గమనించిన ఇంద్రుడు భేష్! భేష్! అంటూ రాముణ్ణి మెచ్చుకున్నాడు. దేవతలు పూలవర్షం కురిపించారు. ఇంద్రుడు పరమప్రీతుడై దేవతలతో కలిసి విశ్వామిత్రునితో–

ఓ విశ్వామిత్రమహర్షీ! నీకు మంగళమగు గాక! రాముడు చేసిన ఈ పనికి దేవతలందరూ సంతోషించారు. ఓ మహర్షీ! ఈ సందర్భంలో నువ్వు రామునికి ప్రేమతో భృశాశ్వుని పుత్రులయిన అస్త్రాలను ఇవ్వు. ఆ అస్త్రాలు పొందడానికి రాముడు అన్ని విధాల యోగ్యుడు. దేవతలకు ప్రియమైన కార్యము సమర్థంగా నిర్వహించాడు. ఇక ముందు మరి

ఎన్నో కార్యాలు నెరవేర్చవలసి ఉంది అని చెప్పి – ఇంద్రుడు, దేవతలు వారి వారి స్థానాలకు వెళ్లారు.

విశ్వామిత్రమహాముని పరమ సంతుష్టుడయ్యాడు. తాను రాముని అయోధ్యనుండి కోరి తీసుకుని వచ్చిన ప్రయోజనాన్ని రాముడు నిర్విఘ్నంగా నెరవేర్చినందుకు ఆనందంతో రాముణ్ణి కౌగిలించుకుని, శిరస్సు ముద్దాడాడు. రామా! నా కోరిక నెరవేర్చావు. నీ శక్తిని చూపావు. తాటకవనం ఇప్పుడు శాపం బారినుండి బయటపడింది. మనోహరమైన చైత్రరథంలా ప్రకాశిస్తోంది. మనం ఈ రాత్రి ఇక్కడే ఉందాము. రేపు తెల్లవారగానే మా ఆశ్రమానికి వెళదాము అన్నాడు.

విశ్వామిత్రుని ఆదేశం ప్రకారం రామలక్ష్మణులు గురువుగారితో కలసి సంతోషంతో పూర్వవైభవాన్ని పొందిన వనభూమిలో ఆ రాత్రి గడిపారు.

తాటకసంహారం రాముని రాక్షససంహారకాండలో మొదటిది. తాటకసంహారం జరిపించడంలో విశ్వామిత్రుడు చేసిన కృషికి దేవతలు ఇంద్రుడు ఏకకంఠంతో అభినందిస్తారు.

తాటకసంహారం చేసి మహావీరుడుగా కీర్తింపబడిన రామునికి జరిగిన మేలు విశేషమయింది. దుష్టులనుండి మానవలోకానికి ముక్తి కలగజేయడం అనే కార్యక్రమానికి నాంది తాటకవధ.

తాటకవధకు ముందే విశ్వామిత్రుడు రామునికి 'బల', 'అతిబల' అనే మంత్రశక్తులను ఇచ్చాడు ప్రేమతో. ఈ మంత్రాలలో తన లౌకిక జ్ఞానం, ఆధ్యాత్మికసంపద ఇమిడి ఉన్నాయి. ఇప్పుడు తనవద్ద ఉన్న సర్వాయుధాలను అస్త్రశస్త్రాలను రామునికి ధారాదత్తం చేస్తాడు. ఇది తన కోరిక మాత్రమే కాదు దేవతల కోరిక కూడా కావడంతో

విశ్వామిత్రుడు సంతోషిస్తాడు. సకల విద్యలు, బలాలు, శక్తులు, అస్త్రశస్త్రాలు రామునికే చెందాలని విశ్వామిత్రమహర్షి ఆకాంక్ష.

'తాటక' వధతో రాముని శక్తి విశ్వామిత్రునికే కాదు దేవతలకూ ఇంద్రునికీ, మానవులకూ తెలియవచ్చింది.

రాముడు విశ్వామిత్రయాగసంరక్షణకు సన్నద్ధుడయ్యాడు. విశ్వామిత్రునికి తన యాగం నిర్విఘ్నంగా కొనసాగగలదని గుండెనిండుగా ధైర్యం కలిగింది. ఇవన్నీ ఒక ఎత్తైతే యక్షిణి అయిన 'తాటక' మారీచుని వంటి మంచికొడుకును కన్నది.

రామాయణంలో రామతత్త్వాన్ని ఆకళింపు చేసుకున్న రాక్షసుల్లో మారీచుణ్ణి ముందుగా చెప్పాలి. 'రామో విగ్రహవాన్ ధర్మః' - ధర్మం మూర్తీభవిస్తే రాముడు అని చెప్పినది మారీచుడే. బాల్యంలో విశ్వామిత్రయాగం ధ్వంసం చేయాలనే దుడుకుస్వభావం ఉన్నా కాలాంతరంలో రామతత్త్వాన్ని గ్రహించిన మహనీయుడు అతడు. సీతాపహరణం తగదని రావణున్ని హెచ్చరించిన ఉత్తముడు, రావణుని చేతిలో చావడం కంటే రామబాణానికి ఆహుతికావడం మేలు అని మాయలేడిగా మారి ముక్తిపొందాడు.

మంచి కొడుకులను కన్న తల్లుల వరుసలో 'తాటక' కూడా స్థానం సంపాదించుకుంది.

* * *

# 19. శూర్పణఖ

శూర్పణఖ రావణుని చెల్లెలు. 'శూర్పనఖ' అనే వ్యవహారం కూడా ఉంది. చేటలవంటి గోళ్లు కలది అని అర్థం. బాలకాండలో అనుకోకుండా విశ్వామిత్రుడు ప్రవేశించినట్లే శూర్పణఖపాత్ర పంచవటిలో సుఖజీవనం సాగిస్తున్న సీతారాముల పర్ణశాలలో ప్రవేశిస్తుంది.

అగస్త్యమహర్షి సూచన మేరకు సీతారామలక్ష్మణులు పంచవటిలో పర్ణశాల నిర్మించుకుని నివసిస్తూ ఉంటారు. ఆనాడు సీతారామలక్ష్మణులు తమ పర్ణశాల సమీపంలో ప్రవహించే గోదావరీనదిలో స్నానం చేసి వస్తారు. ఆ పర్ణశాల ప్రాంగణంలో కూర్చున్న ఆ ముగ్గురూ నందితో కూడిన పార్వతీపరమేశ్వరుల్లా ఉన్నారని వాల్మీకి భావన చేస్తాడు ఎంతో గొప్పగా.

ఆ సమయంలో అకస్మాత్తుగా రావణాసురుని చెల్లెలు శూర్పణఖ ఎక్కడనుండో వచ్చి రామచంద్రుని సౌందర్యానికి ఆకర్షితురాలై రాముణ్ణి చేరవస్తుంది.

వేయి వెలుగులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ముఖమండలం, విశాలమైన బాహువులు, తామరరేకులవంటి కన్నులు, తలపై వేలాడుతున్న జడలు, సుకుమారమయిన శరీరం, ఇంద్రియపటుత్వం, రాజఠీవి, శ్యామలవర్ణం, మన్మథుణ్ణి మించిన మనోహర రూపలావణ్యం చూసి శూర్పణఖ మదనపరవశ అయిపోయింది.

రావణునిలాగే ఈమె కూడా కామపరతంత్ర, కామప్రకోపానికి బానిస. శ్రీరామసౌందర్యాన్ని రెప్పవాల్చకుండా కళ్లతో జుఱ్ఱుకుంటుంది. శ్రీరాముడు అసలే పుంసాం మోహనరూపుడు కదా. అంటే పురుషులనే

మోహపరచే మనోహరమైన సోయగం ఆయనది. కాముకి అయిన శూర్పణఖ కామోద్రిక్తకావడంలో విశేషమేముంది.

శ్రీరాముడు, శూర్పణఖ ఇరువురి రూపరేఖావిలాసాలను వాల్మీకి మహర్షి మూడు శ్లోకాల్లో వర్ణిస్తాడు. చాలా విశేషమయిన వర్ణన ఇది.

**"సుముఖం దుర్ముఖీ రామం వృత్తమధ్యం మహోదరీ**
**విశాలాక్షం విరూపాక్షీ సుకేశం తామ్రమూర్ధజా ।**
**ప్రీతిరూపం విరూపా సా సుస్వరం భైరవస్వరా**
**తరుణం దారుణా వృద్ధా దక్షిణం వామభాషిణీ**
**న్యాయవృత్తం సుదుర్వృత్తా ప్రియమప్రియదర్శనా**
**శరీరజసమావిష్టా రాక్షసీ వాక్యమబ్రవీత్"**

– అరణ్య – 17 స, శ్లో 10,11,12

రాముడు చక్కని ముఖంగలవాడు, శూర్పణఖ వికృత ముఖం కలది. రాముడు సన్నని నడుముగల వాడు, ఆమె పెద్ద పొట్టగలది. శ్రీరాముడు విశాలమయిన కన్నులు కలవాడు, ఆమె విరూపమైన చూడడానికి అసహ్యకరంగా ఉండే కన్నులు గలది. రాముడు నల్లని నిగనిగలాడే కురులు గలవాడు, ఆమె ఎఱ్ఱని జుట్టుగలది. శ్రీరాముడు కనులకు ఇంపుగొలుపే రూపం, చక్కని కంఠధ్వని కలిగినవాడు. సుందర యువకుడు సూటిగా మాట్లాడేవాడు. శూర్పణఖ కురూపి భీకరమైన కంఠధ్వని గల రాక్షసి. భయంకరమైన ఆకారం, పైగా ముసలిది. వంకరమాటలు మాట్లాడేది. రాముడు ఉచితమైన నడవడి కలిగి అందరికీ ప్రీతిని కలిగించేవాడు. శూర్పణఖ మిక్కిలి చెడు నడవడిక కలిగి ఉండడమే కాదు, ఎదుటివారికి వెగటు పుట్టించే రూపం కలది.

సకల సద్గుణ పరిపూర్ణుడయిన రాముణ్ణి సమీపించి అవలక్షణాలతో కూడిన రాక్షసి శూర్పణఖ మన్మథపరవశంతో ఇలా మాట్లాడింది –

'ఓయీ! నువ్వు ఎవరు? చూడబోతే తాపసుడిలా జడలు ధరించి ఉన్నావు. అలా అని ఒంటరిగా లేవు. భార్య నీ పక్కనే ఉంది. కాముకుడిలా కనిపిస్తున్నావు. సుక్షత్రియుడిలా శరములు చాపము ధరించి ఉన్నావు. అసలు రాక్షసులు సంచరిస్తున్న ఈ ప్రదేశానికి ఎలా వచ్చావు? ఎందుకు వచ్చినట్లు? నిజమేమిటో చెప్పు' అంది.

రాముడు సత్యవచనుడు కావడంతో ఆమె ప్రశ్నలకు సమాధానంగా 'నేను అయోధ్యాపురపాలకుడయిన దశరథమహారాజు పెద్దకుమారుణ్ణి. నన్ను రాముడు అంటారు. ఇడుగో ఇతడు లక్ష్మణుడు. నా తమ్ముడు. ఆమె జనకమహారాజు కుమార్తె. పేరు సీత. నా అర్ధాంగి ఆమె. మా తండ్రి కోరిక మీద మా పినతల్లి కైక కోరగా ఈ వనవాసానికి వచ్చాము. ఇవి మా వివరాలు. నువ్వు ఎవరో నీ వివరాలేమిటో చెప్పు' అని అడిగాడు. రాముడు కోరగా ఆమె 'నేను శూర్పణఖ అనే రాక్షసిని. నాకు కామరూప ధారణ శక్తి ఉంది. లోకంలోని సకల ప్రాణులకు నేనంటే భయం. నేను ఒంటరిగానే ఈ అరణ్యంలో తిరుగుతూ ఉంటాను.

సకల రాక్షస ప్రభువులకధిపతి అయిన రావణుడు, మహాబలుడైన కుంభకర్ణుడు, ధర్మస్వభావుడైన విభీషణుడు నాకు అన్నలు. వీరే కాక ఈ దండకారణ్యంలో జనస్థానంలో నివసించే ఖరుడు దూషణుడు కూడా నాకు సవతి సోదరులు. నేను నీ సౌందర్యాన్ని చూసి పురుషోత్తముడయిన నిన్ను భర్తగాపొందాలని నీ వద్దకు వచ్చాను అని సత్యాన్ని చెప్పింది. నాకు చాలా బలం ఉంది. నా ప్రభావం చాలా విశేషమయింది అనీ చెప్తూ నిన్ను కామించి వచ్చాను. ఈవిడ నీ భార్య అని పరిచయం చేసావు సరే కానీ ఈ కురూపి నీవంటి సుందరుడికి తగిన భార్య కానేకాదు. నేనే నీకు తగిన భార్యని. నన్ను నీవు స్వీకరించు. ఒక వేళ నీ భార్య సోదరులు నా కోరికకు అడ్డం వస్తే – అసహ్యంగా వ్రేలాడే

పొట్టతో, భయంకరంగా ఉండే ఈ మానవ స్త్రీని, నీ సోదరుణ్ణి కూడా తినేస్తాను అంటూ బెదిరించింది. తన కోరికను సఫలం చేసుకునేందుకు తోటి వారి ప్రాణాలుసైతం తీయడానికి కూడా సిద్ధపడడం రాక్షస స్వభావం.

శ్రీరాముడు ఆమె వ్యర్థప్రలాపం, కామోద్వేగం గమనించాడు. ఆమెతో 'ఓ రాక్షస రాజకుమారీ! సుందరీ! నాదొక మాట విను. నేను వివాహితుణ్ణి. నా భార్య నా వెంట ఉంది. చీటికీ మాటికీ నీ సవతి పెట్టేపోరు నువ్వు తట్టుకోలేవు. నన్ను పెళ్లాడితే సవతిపోరు నీకు తప్పదు. కాబట్టి నీకు ఒక ఉపాయం చెప్తాను విను.

నామీద చూపిస్తున్న గాఢమైన ప్రేమను అదుగో అక్కడ ఉన్నాడే అతడు కూడా నా వంటి అందగాడు, వీరుడు, మంచివాడు కూడాను. పైగా ప్రధానమైన విషయం అతడు భార్యలేనివాడు. ఆతనిమీదకు నీ ప్రేమను మళ్లించు' అన్నాడు సౌమ్యంగా. శూర్పణఖకు రాముని మాటలు సమంజసంగా ఉన్నాయి అనిపించాయి. కామోద్రేకంలో ఉందేమో ఎవరైతే ఏమిలే అనుకుని అతణ్ణి సమీపించి 'సుందరాంగా! నువ్వు నాకు నచ్చావు. నేను నిన్ను సుఖపెడతాను. నన్ను స్వీకరించు' అంటుంది. లక్ష్మణుడు సంభాషణాచతురుడు. శూర్పణఖను చూసి నవ్వుతూ 'శూర్పణఖా! నువ్వు ఏదో చాలా తెలివైనదానివి అనుకున్నాను. చూడబోతే చాలా అమాయకురాలిలా ఉన్నావు. నువ్వు రాకుమారివి. నేను రాముని సేవకుడిని. ఒక సేవకుణ్ణి పెళ్లాడతావా? నీ అంతస్తు ఎక్కడ నా బ్రతుకు తీరు ఎక్కడ? నువ్వు తీసుకోదగిన నిర్ణయం కాదు ఇది. నేనొక సలహా చెప్తా విను. నువ్వు రాముణ్ణే గట్టిగాపట్టుకో వదలిపెట్టకు. రాముడు గుణగ్రహణపారీణుడు అని ప్రసిద్ధి పొందినవాడు. కాబట్టి నీ సౌందర్యమహత్తును అతడు తప్పక గ్రహిస్తాడు.

కాబట్టి సన్నగా, పీలగా, అందవిహీనంగా ఉన్న ఆ ముసలి మానవ స్త్రీ అంటే వెగటు పుట్టి, మనసు తిప్పుకుని సౌందర్య లావణ్యరాశివైన నిన్ను చేరదీసి నీతోనే ఉండిపోవాలని నిశ్చయించుకుంటాడు. నా ఆలోచన బాగుందా మరి, వెళ్లు రాముణ్ణి పట్టుకో' అంటాడు. లక్ష్మణుని పొగడ్తలన్నీ నిజమే అని నమ్ముతుంది శూర్పణఖ. మంచి సలహా ఇచ్చినందుకు లక్ష్మణుణ్ణి మెచ్చుకుంటుంది. ఎలా అయినా రాముణ్ణి తన వశం చేసుకోవాలని నిశ్చయించుకుంటుంది. సీత బ్రతికి ఉంటే రాముడు తనను స్వీకరించడు అనే నమ్మకంతో ముందు ఆమె అడ్డు తొలగించాలి అనుకుంటుంది. సీతమీదకు ఉరికి ఆమెను అంతం చేయాలనుకుంటుంది. పరిస్థితిని గమనించిన శ్రీరాముడు 'లక్ష్మణా! ఈ రాక్షసి సీతను చంపాలనుకుంటోంది. ఈమెకు తగిన శిక్ష విధించు' అంటూ ఆజ్ఞాపిస్తాడు. లక్ష్మణునికి ఆ సన్నివేశంలో పట్టరాని కోపం వస్తుంది. తన కత్తి దూసి ఆ రాక్షసి ముక్కూ చెవులూ కోసేసి వికృతరూపిణిగా మార్చేస్తాడు. ఊహించని ఈ భయంకరపరిణామానికి శూర్పణఖ బిగ్గరగా ఏడుస్తూ, గాయాల నుండి రక్తం కారుతూ ఉండగా జనస్థానంలోని తన సవతి సోదరుడైన ఖరుని ఆస్థానానికి పరుగు తీస్తుంది.

శూర్పణఖ దురవస్థను చూడగానే ఖరుడు జాలిపడతాడు. తన చెల్లెలి మీద ఇంత దారుణంగా ప్రవర్తించినవారిని బ్రతుకనివ్వనని ప్రతిజ్ఞ చేస్తాడు. దండకారణ్యంమీద సార్వభౌమాధికారం నెరపుతున్న తనను, తన ఆధిపత్యాన్ని ధిక్కరించగల మొనగాడు ఎవడని ఖరుడు మండిపడతాడు. జరిగిన విషయం ఏమిటో చెప్పమంటాడు శూర్పణఖని. రామలక్ష్మణులతో తాను వ్యవహరించిన తీరును వివరించడంలో శూర్పణఖ తాను కామోద్రేకంలో సీతమీద దురుసుగా ప్రవర్తించిన విషయాన్ని చెప్పదు. తానేమీ దోషం చేయలేదు అంటుంది. రామలక్ష్మణులను పల్లెత్తు మాటకూడా అనదు. పైగా వారి సౌందర్యాన్ని

కొనియాడుతుంది. కానీ సీతను తలచుకోగానే ఆమెలో అసూయ పుట్టుకొస్తుంది. తన ముక్కు చెవులు కోయడానికి సీతే కారణం అంటూ తప్పంతా సీతదే అంటుంది. సీతను నిందితురాలిని దోషురాలిని చేయడమే ఆమె ప్రధాన దృష్టి. సీతపై కసి తీర్చుకోవాలంటే అన్నదమ్ము లిద్దరినీ దోషులుగా చూపించాలి. అందుకే ఆ ముగ్గురి నెత్తురు త్రాగితేగానీ తన పగ చల్లారదు అంటూ ఖరునికి నివేదించుకుంటుంది. చెల్లెలి దీనస్థితి, ఆమెకు సంభవించిన అంగవైకల్యం, ఆవేదన గమనించిన ఖరుడు నీ కోరిక తృటిలో తీర్చి నీకు తృప్తికలిగేలా చేస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు.

తన సైన్యంలో బలశౌర్య క్రౌర్యోపేతులైన పదునలుగురు రాక్షసులను రామలక్ష్మణుల మీదకు పంపుతాడు. రాముడు పదునాలుగు బాణాలతో ఆ పదునలుగురు మహావీరుల్ని నిమిషంలో సంహరిస్తాడు. ఈ ఘోర దృశ్యాన్ని స్వయంగా చూసిన శూర్పణఖ భయంతో ఆశ్చర్యంతో నిశ్చేష్టురాలవుతుంది. ఈ విషయాన్ని ఈ ఉమ్మడిచావుని చెప్పి దండకారణ్యం భీరులు ఉండవలసిన ప్రదేశం కాదు అని ఎత్తి పొడుస్తుంది. రాముడు మహావీరుడు. రాక్షసజాతికే ముప్పుతేగల మహనీయుడు అని నిరూపించుకున్నాడు. మీరు సావధానులై ఉండకపోతే ప్రళయం ముంచుకువచ్చే ప్రమాదం రానుంది అని హెచ్చరిస్తుంది. అభిమానం ఉన్నట్లయితే వెంటనే ఆ రామలక్ష్మణులమీద తక్షణమే చర్య తీసుకోండి. ఆలస్యం చేస్తే ఆపద రావడం తథ్యం. బలం, ధైర్యం, సాహసం నీకు నిజంగా ఉంటే నిరూపించుకోవలసిన సమయం ఇది. లే తక్షణం కర్తవ్యం నిర్వర్తించు అని ఖరుణ్ణి రెచ్చగొడుతుంది తీవ్రంగా. ఇదీ శూర్పణఖ తీరు.

శూర్పణఖహెచ్చరికకు మహోగ్రుడయిన ఖరుడు పధ్నాలుగు వేల సైన్యాన్ని వెంటపెట్టుకుని పంచవటికి వెళ్తాడు. తన నాయకత్వంలో శత్రుసంహారం చేస్తానని బీరాలు పలుకుతాడు.

ఖరుని ఎదుర్కొన్న శ్రీరాముడు అవలీలగా అతణ్ణి ఓడిస్తాడు. అతణ్ణేకాదు అతని సోదరుడు దూషణుణ్ణి, సేనాపతి త్రిశరుణ్ణి, 14 వేల మంది రాక్షసుల్ని కూడా సంహరించి మహావీరునిగా శ్రీరాముడు కొనియాడబడతాడు.

జనస్థానంలో రాక్షసులకు జరిగిన ఘోరపరాభవాన్ని కనులారా చూసిన శూర్పణఖ దిక్కుతోచని స్థితిలో లంకకి చేరుతుంది. మానసికంగా ఆమె అవమానభరితయై ఉంది. దానికి తోడు భయకంపిత అయి ఉంది. కేవలం ఆమె స్త్రీ కావడం వల్ల చావుబారిన పడకుండా ఉంది. అనుచితమైన కామోద్రేకం, అదుపులేని పొగరుతనంవల్ల శిక్షకు పాలై ముక్కు చెవులు కోల్పోయి వికృతంగా తయారయింది. నిరాశ నిస్పృహలతో అలమటిస్తూ శూర్పణఖ రావణుని రెచ్చకొట్టడానికి పూనుకుంటుంది. రావణుని రాజ్యపాలనావిధానాన్ని విమర్శిస్తూ నిందిస్తుంది. "ఓ రాక్షసేంద్రా! ఎంత గొప్పగా పాలిస్తున్నావయ్యా! నీ రాజ్యాన్ని, సార్వభౌమత్వాన్ని నీ శత్రువులు లెక్కచేయకుండా ఉంటే నువ్వు ఏమీ పట్టించుకోకుండా భోగాలలో మునిగితేలుతున్నావు. చూడబోతే నువ్వు నా కంటికి మహాలోభిలా కనబడుతున్నావు. నీకు స్వయంగా చూసుకునే తీరిక లేదు సరే, సమర్థులయిన చారులనయినా నియమించుకుని రాజ్యంలోని స్థితిగతులు తెలుసుకునే ప్రయత్నమయినా చెయ్యవా. ఉన్నతమైన నీ పదవికి ఎలాంటి హానీ రాకుండా స్థిరంగా ఉంచడానికి నీ బంధుమిత్రులు నీకోసం ఎంతటి కష్టనిష్ఠూరాలు పడుతున్నారో ఎప్పుడయినా తెలుసుకున్నావా? నీకు అసలు అవి పట్టించుకోవాలి అనే దృష్టే లేదు. ఏం జరిగిందో చెప్తాను, జాగ్రత్తగా విను-

'రాముడు అనే మానవుడు ఒక్కడంటే ఒక్కడు జనస్థానంలో ఉన్న నీ మహాసైన్యాన్ని సర్వనాశనం చేసాడు. మన సోదరులు ఖరుడు

దూషణుడు, వాళ్ల సేనాపతి త్రిశరుడు కూడా ఆ రాముని చేతిలో ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు దండకారణ్యం తాపసులకు సుఖాశ్రయంగా ఉంది. ఆ రామునికి ఒక తమ్ముడు ఉన్నాడు. అతడు లక్ష్మణుడు సర్వసుగుణలక్షణుడు. శౌర్యప్రతాపాలలో అన్నకు సరిసాటి. రాముడికి అతడు దక్షిణహస్తం. అంతేకాదు బహిఃప్రాణం కూడ. రామునితో పాటు తమ్ముడే కాదు, భార్యకూడా ఉంది. ఆమె పేరు సీత. అపురూప సౌందర్యవతి. పవిత్రురాలు. సుగుణరాశి. భర్త ఎడల భక్తివిశ్వాసాలు కలది. ఆమె పరమ పతివ్రత. ఆమెతో సాటిరాగల స్త్రీ ప్రపంచంలో మరెక్కడా లేదు. అట్లాంటి వనితామణిని నీకోసం సంగ్రహించి తెద్దామనుకున్నాను. కానీ రాముని తమ్ముడు లక్ష్మణుడు నా యత్నానికి భంగం కలిగించాడు. భంగం కలిగించడమేకాదు నన్ను దారుణంగా శిక్షించాడు. చూడు నా ముక్కు చెవులు నిర్దాక్షిణ్యంగా కోసేసాడు. నేను ఏమి చేయను? ఏమని చెప్పను? ఒక్కసారి మనసు పెట్టి ఆలోచించు. ఏం చేయాలో ఎలా చెయ్యాలో నీ సోదరులను హతమార్చినవాడు, నీ సోదరిని అవమానించి అమానుషంగా ప్రవర్తించిన ఆ మానవమాత్రుణ్ణి ఏం చేయాలో – ఆలోచించి సరియైన నిర్ణయం తీసుకో. నీకా సామర్థ్యం ఉంది.

నువ్వు అసమాన బలసంపన్నుడవు. వీరాగ్రేసరుడవు. అలాంటి నీ సోదరికి ఆ రాముడు ఎంత భయంకరమైన స్థితి కలగజేసాడో చూడు.

సీత అనుపమ సౌందర్యరాశి. ఒక్కసారి ఆలోచించు ఆమె నీ సొత్తుకావాలి. దాని కోసం ఎలాంటి ప్రయత్నం చేస్తావో మరి' అంటూ ఒక విషబీజం నాటింది. శూర్పణఖ మనస్సులో సీత అంటే ఎంతో వైరం పెంచుకుంది. రాముడు తనను స్వీకరించకపోవడానికి సీతే కారణమని ఆమె నమ్మింది. తనకు జరిగిన అవమానానికి, తన ముక్కూ

చెవులూ కోయబడడానికి సీతే కారణం. ఆమెవల్లనే తనకీ స్థితి దాపురించింది అని శూర్పణఖ దృఢవిశ్వాసం. సీత అవమానం పాలయితే గాని తన కసి తీరదు. దానికి ఒకటే ఉపాయం. రావణునికి స్త్రీ వ్యామోహం బలహీనత. అందువల్ల రావణుని మనస్సు సీత మీదకు మరల్చగలిగితే చాలు తన కోరిక తీరుతుంది. శూర్పణఖ పెద్ద ఉపన్యాసమే ఇచ్చింది. చివరలో సీతమీద కోరిక కలిగేలా చేసింది. రావణునికి అన్ని మాటల్లో ఈ చివరి మాటలు బాగా మనస్సుకు పట్టాయి. సర్వాంగసుందరి అయిన సీతను తన వశం చేసుకోవాలి అని ముచ్చటపడతాడు. ప్రత్యక్షంగా రామునితో పోరుసలిపి గెలవడం కష్టమని గ్రహించి, దొంగచాటుగ సీతను అపహరించాలని నిర్ణయించుకుంటాడు.

సీతాపహరణం అనే ఘోరమైన పాపకృత్యానికి ఒడిగట్టేటట్లు రావణున్ని పురికొల్పడంతో శూర్పణఖ పెద్ద విజయం సాధించింది. శూర్పణఖ సలహా పాటించి రావణుడు తాను నాశనం కావడమే కాదు. తనవారిని, తన జాతిని సర్వనాశనం చేసాడు.

రామాయణమహాకావ్యంలో విశేష ప్రాముఖ్యం గల పరిణామాలను సృష్టించే సంఘటనలు యథాలాపంగా, అయాచితంగా సంభవిస్తూ ఉంటాయి. బాలకాండలో విశ్వామిత్రుడు అనుకోకుండా ప్రవేశిస్తాడు. తెల్లవారితే రామునికి యువరాజ పట్టాభిషేకం జరగబోతోంది అని వార్త యథాలాపంగా మంథర చెవిని పడుతుంది. దాంతో ఆమె కైకని రెచ్చగొట్టి రామవనవాసం భరతుని పట్టాభిషేకం వరాలుగా కోరమని కైకకు నూరిపోస్తుంది. మంథర పట్టుదల వల్ల రామునికి వనవాసం ప్రాప్తించింది.

పంచవటిలో సుఖజీవనం సాగిస్తున్న సీతారామలక్ష్మణుల కుటీరం వద్దకు శూర్పణఖ యథాలాపంగా వస్తుంది.. రాముణ్ణి మోహిస్తుంది.

సీత అడ్డు అనుకుని తన అన్నను ప్రేరేపిస్తుంది. సీతాపహరణానికి బీజం వేసింది. ఆ తరువాత రామరావణయుద్ధం సంభవించింది.

అయితే శ్రీరామావతారప్రయోజనం సుగమం అవడానికి మంథర, శూర్పణఖలే కారణం. కానీ వారిద్దరికీ ఈ విషయం తెలియనే తెలియదు.

రాముడు అయోధ్యలోనే ఉంటే రాక్షససంహారానికి అవకాశంలేదు. మంథరప్రణాళికవల్ల రాముడు అరణ్యవాసానికి వెళ్లాడు. శూర్పణఖ ప్రణాళిక వల్ల సీతాపహరణం జరిగింది. రావణసంహారానికి రాముని ప్రయత్నం ఆరంభమయింది. చివరకు రావణుడు మూలముతో హతుడయ్యాడు.

మంథర, శూర్పణఖ ఇద్దరూ బాధ్యత గల ముఖ్యపాత్రలు పోషించారు. రామావతారప్రయోజనానికి మార్గదర్శకులయ్యారు. శూర్పణఖ లేకపోతే సీతాపహరణం, రావణసంహారం జరిగేవి కావు. రామాయణకథను రామావతారప్రయోజనాన్ని సఫలం చేసినది శూర్పణఖ. రాక్షసుల వల్ల కూడా మంచి కార్యాలు జరుగుతాయి అనడానికి శూర్పణఖే గొప్ప ఉదాహరణ.

* * *

## ౨౦. అయోముఖి

సీతాన్వేషణలో నిమగ్నులై రామలక్ష్మణులు కారడవుల్లో ప్రయాణిస్తూ క్రౌంచారణ్యం దాటుతూ ఉండగా వారికి ఒక పెద్ద గుహ కనబడుతుంది. భయంకరమైన గుహలో ఒక భయంకరమైన రాక్షసి తీరుబడిగా ఒక సింహాన్ని తింటూ ఉండడం చూస్తారు. ఆమె అవయవాలన్నీ మోటుదేరి చూడడానికే అసహ్యంగా ఉన్నాయి. వాడి అయిన ఆమె కోరలతో సింహపు మాంసాన్ని చీల్చుతూ ఉంది. పర్వతాలవంటి వక్షోజాలు, క్రిందదాకా వ్రేలాడే పొట్ట, విరబోసుకున్న చింపిరిజుట్టుతో వికృతంగా చూచేవారు హడలిపోయేలా ఉంది. మహాధైర్యవంతుడయితే ఏమోగాని సామాన్యులు ఆమెను చూస్తే కొయ్యబారిపోవడం తథ్యం. ఆ భయంకర ఆకారం పేరు అయోముఖి. అయోముఖి అంటే ఇనుమువంటి ముఖము గలది అని అర్థం. ఆమె రూపానికి ఆ పేరు అన్నివిధాల తగినదే. రామలక్ష్మణులలో లక్ష్మణుడు ముందు రాముడు వెనుక నడుస్తున్నారు. ముందుగా లక్ష్మణుడు ఆమెకంట పడ్డాడు. వెంటనే గెంతుతూ వచ్చి ఆపుకోలేని మోహావేశంతో, కామక్రీడకు రమ్మని ఆహ్వానించింది. ఎంతో ఉత్సాహంతో తమ జోడీ బాగుంటుంది అంటుంది. మీదమీదకు వస్తుంది. దాంతో లక్ష్మణుడు కోపంతో ఒళ్లుమండి ఉగ్రుడై ఆమె ముక్కు, చెవులు, వక్షోజాలు కోసేస్తాడు. రాముని సంప్రదించాలని కూడా అతనికి అనిపించదు.

తాను తల్లిగా, దేవతగా ఆరాధించే సీతాదేవిని అన్వేషిస్తూ – శోకసంతప్తుడై ఉన్న తరుణంలో 'అయోముఖి' ప్రవర్తనను భరించలేక వెంటనే ఆమెను శిక్షిస్తాడు.

ఒకపనిలో నిమగ్నులై ఉండగా ఈ రీతిగా అడ్డుపడే వారిని శిక్షించి ముందుకు సాగిపోవడమే చేయదగిన పని.

కొద్ది క్షణాలు మాత్రమే కనిపించినా అయోముఖి – పాఠకులకు – గుర్తు ఉండిపోతుంది. లక్ష్మణుని ఎడల సానుభూతి పెంచడానికి – లక్ష్మణుని శీలసంపదను ప్రకాశింపచేయడానికి అయోముఖిపాత్ర ఉపయోగపడుతుంది.

## 21. సింహిక

హనుమంతుడు సముద్రలంఘనం చేసే సమయంలో ఆతన్ని భక్షించాలి అని ప్రయత్నించిన ప్రాణి రాక్షసి సింహిక.

వానరులను సీతాన్వేషణకోసం పంపుతూ సుగ్రీవుడు 'ఛాయాగ్రాహి' అనే రాక్షసి ఉంది. అది నీడని బట్టి ఆకాశంలో ఎగురుతున్న వాటిని లాగుతుంది. దక్షిణసముద్రంలో ఉంటుంది అని చెప్పి పంపాడు. హనుమ ఏకాగ్రతతో సముద్రం మీద ప్రయాణిస్తున్నాడు. మైనాకుడు అనే పర్వతుడు ఆతిథ్యం స్వీకరించి వెళ్లమని కోరాడు. తాను కాలయాపన చేయలేననీ స్వీకరించినట్లే భావించమని ఆతనిని ప్రేమగా స్పృశించి ముందుకు సాగిపోయాడు. ఆ తరువాత దేవతల ప్రేరణమీద సురస హనుమను పరీక్షించే నిమిత్తం వచ్చింది. ఆమె నాగమాత. నా నోట్లో ప్రవేశించి తీరాలి అని పట్టుపట్టింది. హనుమ ముందు దేహం పెంచి ఆమెతో పోటీపడ్డాడు. ఒకమాటు చిన్నవాడై ఆమెకోరినట్లే నోట్లోకి ప్రవేశించి వెంటనే బయటపడి ఆమెకు నమస్కరించి ముందుకు సాగుతుండగా ఈ సింహిక – హనుమ నీడను పట్టి క్రిందికి లాగనారంభించింది. హనుమ గమనంలో వేగం తగ్గింది. ఏమిటా ఇలా జరుగుతోంది అని హనుమ చుట్టుపక్కల పరిశీలించాడు. సముద్రం మీద ఒక వికృతమైన రాక్షసిరూపం కనబడింది. అది సరిగ్గా సుగ్రీవుడు తమకు వర్ణించి చెప్పిన – దక్షిణసముద్రంలో రాక్షసిలక్షణాలతో ఉంది. ఒక్క నిముషం ఆలోచించి హనుమ తనదేహాన్ని వర్షాకాలం నాటి మేఘంలా విస్తారంగా పెంచేసాడు. పైన ఎగురుతున్న హనుమను బలంగా క్రిందికి లాగి, మింగాలని సింహిక ప్రయత్నిస్తూ నోరు బాగా తెరిచింది. ఆమె నోరు పెద్ద గుహలా భయంకరంగా ఉంది. హనుమ తన శరీరాన్ని క్షణంలో చిన్నదిగా చేసాడు.

తెరచిఉన్న ఆమె నోటిలోకి ప్రవేశించి, ఆమె దేహాన్ని చీల్చుకుంటూ లోలోపలికి ప్రవేశించి ఆమెకు ప్రాణప్రదమైన హృదయాన్ని వాడి అయిన తన గోళ్లతో చీల్చిపారేశాడు. ఈ విశేషప్రక్రియ అంతా ఒక్క తృటిలో జరిగిపోయింది. సింహిక నోరు మూసేసేలోగా వేగంగా బయటకు వచ్చేసాడు. వచ్చినవాడు తన పూర్వరూపం తీసుకున్నాడు. ఆమెను గట్టిగా చావుదెబ్బ కొట్టాడు. ఆ దెబ్బకి ఆ రాక్షసి సముద్రంలో మునిగిపోయింది. గుండె చీల్చడం వల్ల అప్పటికే ఆమె ప్రాణాలు పోయాయి.

ఆకాశమార్గంలో ప్రయాణిస్తున్న దేవతలు హనుమంతుని వీరకృత్యాన్ని భళా! భళా! అంటూ మెచ్చుకున్నారు. హనుమ లంకాయాత్ర ఫలవంతం కావాలని మనసారా దీవెనలు అందించారు.

సింహిక నిజానికి హింసిక. ఆమె మీద జాలి చూపవలసిన అవసరం లేశమాత్రంగా కూడా లేదు. తన నీడతో ప్రాణులను ఆకర్షించి చంపుకుతినే సింహికను హనుమ ధైర్యంతో తీవ్రంగా చీల్చి సంహరించి ముందుకు సాగి లంకలో ప్రవేశించాడు. హనుమ సమయస్ఫూర్తి, సాహసము వెలుగుచూసే అవకాశం సింహిక కలగజేసింది.

రామాయణంలో ప్రతిపాత్రా ఏదో ఒక ప్రయోజనాన్ని సాధిస్తాయి అనడానికి సింహిక కూడా ఒక ఉదాహరణమే.

* * *

## 22. లంకిణి

రావణుని పట్టణం లంక. ఆ లంకారాజ్యానికి అధిదేవత, రక్షకురాలు – లంక. ఈ లంకనే తెలుగువారు లంకిణి అని పిలుస్తారు.

సీతాన్వేషణకు సముద్రలంఘనానికి ఆరంభించి లంకలో ప్రవేశించే పర్యంతం హనుమంతునికి ఏవేవో విఘ్నాలు కలుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఆ విఘ్నాలు ముగ్గురు స్త్రీల వల్ల సంభవించాయి.

సముద్రం దాటే సమయంలో నాగమాత సురస, ఛాయాగ్రాహి సింహిక, లంకదాకా వచ్చాక లంకిణి.

హనుమ సముద్రం దాటి సముద్రతీరంలో దిగి లంకలో ప్రవేశించడానికి ఏ రూపంలో వెళ్లాలి అని ఆలోచించి ఆకారాన్ని కుదించి పిల్లికంటే చిన్నగా మారి, లంకలోకి దొడ్డిదారిన ఒక గెంతుతో ప్రవేశించాడు. లంకాసౌందర్యానికి ముగ్ధుడై చూస్తూ ఉంటాడు. ఎక్కడనుండి ఎలా కనిపెట్టిందో లంకిణి అతడి ముందు ప్రత్యక్షమైంది. లంకిణి అలా హఠాత్తుగా రావడం హనుమను కుదిపేసింది.

ఆమె స్వరూపం చూద్దామంటే – జేవురు ముఖంతో, కన్నుల నుండి నిప్పులు రాలుతూ ఉంటే, తీవ్రమైన కంఠస్వరంతో గద్దిస్తూ లంకలోకి వచ్చిన హనుమను నిలదీస్తుంది.

'ఎవడవురా నీవు! కండకావరమా! లంకలోకి ఇలా దొంగలా చొరబడ్డావు? నీకింత దుస్సాహసమా? అడవిలో ఉండవలసిన కోతివి, నీకు ఈ లంకకు రావలసిన పని ఏముంది? నిజం చెప్పు. లేదా, ప్రాణాలతో బయటపడే ఆశ వదులుకో, ఈ పట్నానికి నాలుగు దిక్కుల మా ప్రభువు రావణుని సేనలు, రక్షకభటులు జాగ్రత్తగా కాపలా కాస్తున్నారు. నువ్వు తప్పించుకుపోలేవు జాగ్రత్త' అని హెచ్చరించింది.

అయితే ఊహించని ఈ పరిస్థితికి హనుమ బెదరలేదు. నెమ్మదిగా లంకతో ఇలా అన్నాడు.

“చూడు నువ్వు అడిగిన విషయాలన్నీ చెప్తాను. అసలు నువ్వెవరివో నాకుచెప్పు. నీ రూపు వికృతంగా భయంకరంగా ఉంది. నువ్వు ఎందుకు నామీద ఇలా విరుచుకుపడుతున్నావు, నా దారికి ఎందుకు అడ్డుగా నిలబడ్డావు చెప్పు” అన్నాడు.

లంకాధిదేవత అయిన లంకిణికి ఒళ్లు మండిపోయింది. ఈ పిల్లకోతికి ఇంత పొగరా? ఇంత నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తాడా అని కోపంతో నీకు ఈ దేశం ఎవరిదో తెలుసా? మహాపరాక్రమశాలి వీరాగ్రేసరుడు అయిన రావణునిది. ఆ రావణుడు మా ప్రభువు.

ఆయన నన్ను ఈ నగరరక్షణకు నియమించాడు. ఆయన ఆజ్ఞ మేరకు నేను వేయి కళ్లతో గమనిస్తూ ఉంటాను. ఈ పట్టణాన్ని కాపలాకాస్తూ మెలకువతో రక్షిస్తూ ఉంటాను. నేనెవరిని అనుకుంటున్నావో నేను లంకకు సంరక్షురాలినేకాదు స్వయంగా నేనే లంకను. ఇప్పుడు తెలిసిందా నేనెవరినో? ఒక్క క్షణంలో నీ ప్రాణాలు తీసేస్తాను. అర్థమయిందా.

ఇప్పుడు నువ్వు చెప్పు నువ్వెవరివో, నీ సంగతి ఏమిటో అంటుంది.

లంకిణి మాటలలోని దూకుడు చూసాక హనుమ ఈమెతో పోరాడాలా ఏమిటి అనుకుంటాడు. తప్పనిసరి అయితే యుద్ధానికి సిద్ధపడాలి అని నిశ్చయించుకుంటాడు. కానీ చాలా మృదువుగా ‘అమ్మా! లంకాధిదేవతా! నేను ఈ మనోహరమైన పట్నాన్ని చూడాలని ఎన్నాళ్లగానో ఆశపడుతున్నాను. ఒక్కసారి ఈ లంకాసౌందర్యమంతా తనివితీరా దర్శించి వచ్చినదారినే వెళ్లిపోతాను’ అన్నాడు.

ఒక చిన్న కోతి ఏమాత్రం భయపడకుండా యథాలాపంగా జవాబు చెప్తుందా అనుకుంది లంకిణి. హనుమధోరణి లంకిణికి కోపం తెప్పించింది. వెంటనే తన చేయి చాచి హనుమను బలంగా కొట్టింది. ఆ దెబ్బ హనుమకి బలంగానే తగిలింది. కొంచెం నొచ్చుకున్నాడు. కానీ చూడబోతే ఈమె స్త్రీ ఈమె దెబ్బకు సరియైన దెబ్బ కొట్టడమా అని సందేహిస్తాడు. ఎడమచేతి పిడికిలి బిగించి, నిగ్రహంతో మామూలు దెబ్బ మాత్రమే కొడతాడు. హనుమ కొట్టిన ఆ చిన్న దెబ్బకే లంకిణి దుబుక్కున నేల కూలిపోయింది. ఈ దెబ్బతీవ్రతకి ఆమె నీరు కారిపోతుంది. ఒక చిన్న కోతి ఇంత గట్టిగా కొట్టడమా? అని భయపడింది. మరో దెబ్బపడితే నా ప్రాణాలే పోతాయేమో అని కంగారుపడింది. చటుక్కున ఆమె హనుమ పాదాలమీద పడి తనను చంపవద్దని బ్రతిమాలుతుంది. భయంతో కంపించిపోతూ ఓ వానరా! నీకో రహస్యం చెప్తాను విను. ఒకప్పుడు రావణుడు కైలాసం వెళ్లినప్పుడు నందీశ్వరునితో తగాదా పడ్డాడు. ఆ సందర్భంలో నందీశ్వరునికి కోపంవచ్చి లంక భస్మీపటలం (బూడిద) అవు గాక! అని శపించాడట. ఆ విషయం తెలిసిన నేను ఈ శాపం నుండి నాకు విముక్తి కలిగించు అంటూ బ్రహ్మదేవుణ్ణి ప్రార్థించాను. బ్రహ్మ నన్ను ఊరడించి ఒక రోజు ఒక వానరుడు వచ్చి తన ప్రతాపం వల్ల నిన్ను ఓడించే వరకు నీకు ఏ ప్రమాదము రాదు అనీ అప్పటివరకు ధైర్యంగా ఉండమనీ నాకు చెప్పాడు.

ఇప్పుడు ఆ సమయం వచ్చింది. లంకలోకి ఒక కోతి వచ్చింది అని వెంటనే లంక హనుమంతుని కాళ్ల మీద పడింది. దీనంగా ప్రార్థించనారంభించింది.

'వీరాధివీరా! వానరోత్తమా! నీ రాక లంకకు ముప్పును సూచిస్తోంది. బ్రహ్మగారి వాక్కుకు తిరుగులేదు కదా. శ్రీరామపత్ని సీతామహాదేవిని

ఎప్పుడు చెఱపట్టి లంకకకు తెచ్చాడో అప్పుడే తాను, తన రాజ్యం, తన జాతి అంతా సర్వనాశనం కావడానికి తానే కారకుడయ్యాడు.

నాయనా! పట్నంలో యథేచ్ఛగా ప్రవేశించు. నీకు తృప్తి కలిగేవరకు పట్టణమంతా తిరిగి చూడు. నీ అన్వేషణ తప్పక ఫలిస్తుంది. నీకు శుభమగు గాక! అని అభినందిస్తుంది.

రామాయణంలో ఈ లంకిణి హనుమ లంకలోకి రాగానే రామకార్యం సఫలమవుతుందనీ, హనుమకు సీతాదర్శనమవుతుందనీ శ్రీరామవిజయము, రావణవినాశనము తప్పవని స్పష్టంగా చెప్తుంది.

భావికథను హనుమకు చెప్పి హనుమను ఉత్సాహపరిచినది లంక–లంకిణి.

* * *

# 23. ధాన్యమాలిని

ధాన్యమాలిని రావణుని భార్య. ఎందరో భార్యలు గల లంకాధిపతిని ఒక విపత్కరపరిస్థితి నుండి తొలగించిన ధీరవనిత ఈమె. సమయానుకూలంగా భర్త చేస్తున్న దౌర్జన్యాన్ని మంచి మాటలతో, సరసవచనాలతో సన్మార్గవర్తిగా చేసిన బాధ్యత గల ఇల్లాలు. భర్త క్షేమము, గౌరవము నిలబెట్టడానికి తనదైన పద్ధతిలో వ్యవహరించి విజయం సాధించిన వినయశీలి ఈమె.

సీత అశోకవనంలో ఉండగా ఒకనాటి ఉషఃకాలంలో రావణుడు తన అంతఃపురంలోని జనాలతో ఆమెను చేరవచ్చాడు. వస్తూనే తన ఐశ్వర్యాన్ని, హెూదానీ, అధికారాన్ని నీకు సమర్పిస్తాను. నిన్ను నా హృదయేశ్వరిగా స్వీకరిస్తానంటాడు. సీత నిర్లక్ష్యంగా ఆ కానుకలన్నిటినీ తిరస్కరిస్తుంది. రావణునకు ఇంతవరకు ఇలాంటి తిరస్కారం అనుభవంలోకి రాలేదు. ఎంతగా బ్రతిమాలినా ప్రయోజనం లేకపోయింది. సీత లక్ష్యపెట్టడం లేదు. అప్పుడు రావణుడు సీతను భయపెట్టడం ప్రారంభించాడు. తన మాట మన్నించకపోతే ఆమెను ముక్క ముక్కలుగ ఖండించివేస్తానన్నాడు. చిరకాల తపస్సులో తాను సాధించిన యోగశక్తితో సీతను భస్మీపటలం చేస్తానన్నాడు. సీత తన పవిత్ర పాతివ్రత్య బలంతో ఆ బెదిరింపులకు బెదరదు. పైగా అతనిని వట్టి పిరికిపందవనీ, సిగ్గులేని దాంభికుడనీ, మితిమీరిన మూర్ఖుడనీ దూషిస్తుంది.. రావణునికి ఆగ్రహం అధికమై సీతను సంహరింపబోతాడు. అలాంటి క్లిష్ట సమయంలో ధాన్యమాలిని మెరుపుతీగలా రంగప్రవేశం చేస్తుంది. చక్కని చిరునవ్వుతో తేనెలొలికే పలుకులతో రావణుని గాఢంగా కౌగలించుకుంటుంది.

రావణుని అలరించి అతని కోపాన్ని చల్లారుస్తుంది మృదువైన కంఠస్వరంతో–

రావణునితో – ప్రభూ! పాలిపోయిన ముఖంతో, విచారగ్రస్తమయి, బిగుసుకుపోయిన ఈ అబలను ఎందుకు కోరుకుంటున్నావు? కామక్రీడయందు అనురక్తిలేని ఈమెనుండి ఏరకమైన సుఖాన్ని పొందగలవు? స్వామీ! నేను ఎంతో ప్రీతితో నీ పొందుకోరి సిద్ధంగా ఉన్నాను. తనంత తాను వలచివచ్చిన స్త్రీని స్వీకరించడంవలన పొందే ఆనందానుభూతి ఎంతో గొప్పది. కాబట్టి ఈ సీతజోలికి పోకు పద అంతఃపురంలోకి వెళ్లిపోదాం అంటూ రావణుని దుష్కార్యాన్ని ఆపుతుంది.

ఇదీ ధాన్యమాలిని సమయోచిత మధురభాషణం. రావణుడు ఆమె హితబోధకు మెత్తబడి అంతఃపురానికి తరలిపోతాడు.

ఇలా ధాన్యమాలిని సమయోచితప్రవర్తన వల్ల సీతకు క్షేమము, రావణునికి కీర్తి లభించాయి.

ఇల్లాలికర్తవ్యాన్ని ఇంత నేర్పుగా ప్రదర్శించిన ధాన్యమాలిని ఉత్తమ ఇల్లాలు.

* * *

# 24. త్రిజట

రామాయణంలో వాల్మీకి కూర్చిన అద్భుత సంఘటనలలో త్రిజట స్వప్నం ఒకటి. త్రిజట – సరమవిభీషణుల పుత్రిక. తల్లిదండ్రుల ఉత్తమగుణాలన్నీ పుణికి పుచ్చుకుని పుట్టిన పుణ్యాత్మురాలు. ఎందుకు పుణ్యాత్మురాలు అంటే సీతారామలక్ష్మణులను దివ్యరూపులుగా కలలో దర్శించిన మహనీయురాలు కావటం వల్ల.

ఆ రోజు ఉదయమే రావణుడు సీతహృదయంలో చోటు సంపాదించడానికి రకరకాలుగా ప్రయత్నించాడు. రావణుడు సీతను బ్రతిమాలి చూసాడు. భయపెట్టాడు. తన సమస్త సంపదని సీత వశం చేస్తానన్నాడు. తన మాట కాదంటే దారుణంగా హింసించి చంపేస్తానని బెదిరించాడు. సీత ఏమాటకూ లొంగలేదు. రావణుడు భరించలేక పోయాడు. సీతను చుట్టుముట్టిన రాక్షసస్త్రీలను మీ శక్తియుక్తులన్నీ ఉపయోగించి ఎలాంటి క్రూరప్రయోగాలైన వినియోగించండి. సీత నన్ను స్వీకరించేలా చేయండి అని ఆజ్ఞాపించాడు. చంపడం మాత్రం చేయకండి అన్నాడు.

అసలే రాక్షసులు – ఆపై హింసించమని ఆజ్ఞాపించాడు ప్రభువు. ఈ ఘట్టం తీవ్రస్థాయికి చేరింది. సీత రాముణ్ణి తప్ప మరెవ్వరినీ తలుచుకోవడం లేదు. అలాంటి స్థితిలో త్రిజట నిద్రనుండి అప్పుడే లేచి గబగబా రాక్షసస్త్రీల దగ్గరకు వచ్చింది. బిగ్గరగా అరుస్తూ 'ఆగండి సీతను ఏమీ చేయకండి. మీరు చంపాలనుకుంటే నన్నే చంపండి. తినండి. సీతను మాత్రం ఏమీ చేయకండి. సీత మహాత్మురాలు. మనకు రాబోయే ఘోరవిపత్తునుండి ఆమె మాత్రమే మనను రక్షించగలదు. ఎందుకంటే నాకు ఇప్పుడే ఒక భయంకరమైన కల వచ్చింది. ఆ కలలో రామునికి విజయం కలిగే శుభశకునాలు రావణునికి పతనం తథ్యమనే సూచనలు

ఉన్నాయి. త్వరలో మనజాతి సర్వనాశనం పొందే ప్రమాదం ఉందనే అశుభసూచకాలు కనిపించాయి. కాబట్టి తొందరపడకండి. సీతను ఏమీ చేయకండి. ఆమెను ప్రార్థిద్దాం' అంటుంది. రాక్షసస్త్రీలందరూ భయంతో బిత్తరపోయారు. సీతకు రాబోయే ప్రమాదం తప్పింది. త్రిజట కల సీతకే కాదు, రామాయణకథకు కూడా దారి చూపింది. తన కలను త్రిజట రాక్షసస్త్రీలు కోరగా వివరంగా చెప్తుంది. ఆ కలను త్రిజట చెప్పిన తీరు –

"నా ఎదురుగా ఒక మహాసముద్రం. దాని మధ్యలో ఒక వెండికొండ. తెల్లని వస్త్రాలు కట్టుకున్న సీతాదేవి ఆ కొండమీద కూర్చుని ఉంది. రామలక్ష్మణులు కూడా తెల్లని బట్టలు కట్టుకుని వేయి హంసలు మోస్తున్న దంతపు పల్లకీ ఎక్కి సీతను చేరవచ్చారు. శ్రీరాముని చెంత సీత సూర్యకాంతివలె ప్రకాశిస్తోంది.. మరో చిత్రం చూసాను. రామలక్ష్మణులు బాగా మదించిన ఏనుగునెక్కి వచ్చారు. సీతను తన చేతులు జాపి రాముడు ఏనుగు మీదకు ఎక్కించి తనతొడమీద ఆప్యాయంగా కూర్చోబెట్టుకున్నాడు. ఆ ఏనుగు వారిని మోసుకుంటూ మన లంకాపట్నంమీద ఆకాశంలో చిద్విలాసంగా నిలబడి ఉంది. ఆశ్చర్యపడకండి! ఇంకా విశేషాలు చూసాను నా కలలో. ఒకదాని వెనక ఒకటి చొప్పున చిత్ర విచిత్రాలు చూసాను నేను. మరొక గొప్ప మనోహరమైన దృశ్యం చూసాను. సీతారాములు ఇరువురూ ఒక అందమయిన రథంమీద కూర్చొని ఉన్నారు. ఆ రథానికి ఎనిమిది బలిసిన తెల్లని ఎద్దులు పూన్చి ఉన్నాయి. ఆ రథం కొంతదూరంవచ్చాక సీతారాములు లక్ష్మణున్ని వెంటబెట్టుకొని పుష్పకవిమానాన్ని ఎక్కి ఉత్తరదిశగ ప్రయాణం సాగించారు. శ్రీరాముడు అజేయుడు. దేవతలు గానీ, దానవులుగానీ, రాక్షసులుగానీ ఎవరైనా గానీ రాముణ్ణి ఓడించడం కల్ల. అతడు విజయరాఘవుడు.

ఇంకా శ్రద్ధగా వినండి. నా కలలో రావణుడు కూడా కనబడ్డాడు.

ఆయన ఎఱ్ఱని బట్టలు కట్టుకున్నాడు. ఎఱ్ఱని పూలదండలు వేసుకున్నాడు. త్రాగి మత్తులో తూలుతున్నాడు. పుష్పకవిమానం నుండి దుబుక్కున క్రింద పడిపోయాడు. అంతేకాదు మరో దృశ్యంలో రావణుడు నూనె త్రాగుతూ ఉంటాడు. గాడిదనెక్కి దక్షిణదిశగా వెళుతూ ఉంటాడు. వెళ్ళి వెళ్ళి కంపుకొట్టే చీకటి నూతిలో దిగంబరునిగా పడిపోతాడు. ఎంత భయంకరమైన విషయమిది. అంతేకాదు కుంభకర్ణుడు రావణుని కొడుకులు కూడా తమ శరీరాలకు నూనెపట్టించుకుని దక్షిణదిశగా పరుగుపెడుతూ కనబడ్డారు. నేను చాలా భయపడ్డాను.

విభీషణుడు కూడా నా కలలో కనబడడం చాలా చిత్రంగా అనిపించింది. ఆయన తెల్లని బట్టలు కట్టుకుని, తెల్లని పూలమాలలు అలంకరించుకున్నాడు. రాజలాంఛనమైన ఛత్రాన్ని ఆయనకు పట్టారు. తన నలుగురు మంత్రులతో కూడి ఆయన ఒక భద్రగజాన్ని ఎక్కి కూర్చుని ఆకాశంలో విహరిస్తున్నాడు. ఎంతో ఆనందించాను.

అంతలోనే ఒక దారుణమైన దృశ్యం కనబడింది నా కలలో. మన రాక్షసులంతా ఎఱ్ఱటి వస్త్రాలు, ఎఱ్ఱటి పూలమాలలు ధరించి నూనె త్రాగి త్రాగి పాడుతూ, నాట్యం చేస్తూ ఉల్లాసంగా ఉంటూ ఉండగా ఒక్కసారిగా లంకలోని తోరణాలు, గోపురాలు ఉన్నట్లుండి విరిగి కూలిపోయాయి. రథాలు ముక్క చెక్కలయ్యాయి. అయ్యో! ఈ లంకాపట్టణం ఒక్కసారిగా సముద్రంలో మునిగిపోయింది. ఇదంతా తృటిలో జరిగిపోయింది.

మనవాళ్ల విషయం ఇలా ఉండగా నేను మరో విచిత్రం కూడా చూసాను. ఒక కోతి మహా బలంగా ఉంది. రామదూతగా వచ్చింది. లంకను కాల్చేసి బుగ్గిబుగ్గి చేసేసింది. ఇన్ని దృశ్యాలు చూసాక నాకు ఏమి అనిపిస్తోంది అంటే-

రాముడు లంకకు రావడం ఖాయం. మన ప్రభువు రావణుని సంహరించడం ఖాయం. మన సేనలన్నీ నశించిపోతాయి. ఎలాంటి సందేహం లేదు. మనకి సర్వనాశనం ముంచుకుని వస్తోంది. నా కల తప్పక నిజమవుతుంది అనిపిస్తోంది. ఇది తథ్యం. ఈ కల కల్లగాదు. కలలో కనబడినవన్నీ జరిగితీరుతాయి.

ఒక్కసారి సీతవైపు చూడండి. మీకు కూడా ఇప్పుడే అర్థం అవుతుంది. ఆమె ఎడమకన్ను అదురుతోంది గమనించండి. ఎడమ భుజం చటుక్కున పొంగింది. ఎడమ తొడమ అదరడం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ కదలికలన్నీ సీతకు తెలియకుండానే సంభవించాయి. ఇవన్నీ సీతకు శుభపరిణామం త్వరలో కలగబోతోందని స్పష్టంగా సూచిస్తున్నాయి కదా? అదుగో వినండి పక్షి కూస్తోంది. ఆవలి చెట్టుముందు మీద నుండి పింగళపక్షి తన మధుర గీతాలాపనతో రామునికి సుస్వాగతం పలుకుతోంది. అంతేకాదు సీతని పలకరించి ఆమె వేదనను తగ్గిస్తూంది. ఇవన్నీ గమనించి అయినా నమ్ముతారా?

ఈ కనిపిస్తున్న శుభసూచకాలన్నీ నా కల తప్పక నిజం కాగలదని ధృవపరుస్తున్నాయి. శ్రీరామవిజయం, రావణవినాశనం తప్పక జరిగి తీరుతాయి. ఎవ్వరూ వీటిని ఆపలేరు. ఇకనైనా ఒళ్లు దగ్గరపెట్టుకుని మెలగండి. సీతామాతను హింసించడం మానండి. ఆమె పాదాలపై పడి క్షమాభిక్ష కోరుకోండి' అంది త్రిజట.

త్రిజట చెప్పిన విశేషాలు వింతలు వినడంతో రాక్షసస్త్రీలు భయపడిపోయారు, నోటమాటరాక నిలబడిపోయారు. వారి స్థితి చూసి సీతమ్మ మాతృహృదయంతో వారిని రక్షిస్తానని వారు కోరకుండానే మాట యిస్తుంది.

నిరాశానిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతున్న సీతప్రాణాలు త్రిజట స్వప్నవృత్తాంతం వినడంతో సేదతీరాయి. సీతాదేవిలో ఆశ చిగురించింది.

ఆత్మస్థైర్యం కలిగించింది. త్రిజట కల – త్రిజట వివరించిన విధానం సీత ప్రాణాలు నిలబెట్టాయి. త్రిజట చేసిన మేలు సాటిలేనిది. త్రిజట చెప్పిన విషయాలు విన్న రాక్షసస్త్రీలలో క్రౌర్యం తగ్గింది. సీతను మాటలతో చేష్టలతో బాధించడం మానేసారు. త్రిజట చేసిన ఉపకారం ఈ ఘట్టంలో సాటిలేనిది. రాక్షసస్త్రీలకు సీతనుండి రక్షణపొందే వాగ్దానం – సీతకు ధైర్యం కలగజేసిన త్రిజట రామాయణంలో ప్రధానమైన పాత్రగా రాజిల్లింది. తీవ్రమయిన పరిణామాలు జరగబోయే సన్నివేశాన్ని తన స్వాదువచనాలతో సరసంగా మార్చిన త్రిజట చేసిన మేలు అనన్య సాధ్యమయింది.

సుందరకాండలో ముందు జరగబోయే లంకాదహనం, రావణవధ, సీతారామలక్ష్మణులు పుష్పకవిమానారూఢులై అయోధ్యకు వెళ్లడం వంటి ప్రధాన అంశాలు త్రిజట దర్శించింది. అందుకే పెద్దలు త్రిజటస్వప్నం ఒక స్వప్నోపనిషత్తుగా భావించి పారాయణ చేస్తారు. భయంకరమైన కలలు వచ్చినప్పుడు ఈ సర్గను (27 సుందర) చదువుకుంటే మానసికంగా సేదతీరుతారు. త్రిజటస్వప్నవృత్తాంతం నేటికీ పవిత్ర ఘట్టంగా పరిగణింపబడుతోంది.

త్రిజట మరో విషమఘట్టంలో సీత ప్రాణాలు నిలబెట్టింది. సీతతో పాటుగా యుద్ధరంగం దర్శించి సీతకు ధైర్యం చెప్తుంది.

ఇంద్రజిత్తు మాయాయుద్ధంలో రామలక్ష్మణులను తన విషపూరితమైన నాగాస్త్రంతో పడగొట్టాడు. రావణుడు ఆ వార్త విని పరమానందంతో ఇక సీత తనను తప్పకుండా స్వీకరిస్తుందనుకుంటాడు.

రామలక్ష్మణులు లేకపోతే సీత తనంతట తానే తనవద్దకు రాగలదని రావణుని ఆలోచన. సీతను పుష్పకవిమానంలో యుద్ధభూమికి తీసుకువెళ్లి మృతి చెందిన రామలక్ష్మణులను ఆమెకు చూపమని

ఆజ్ఞాపిస్తాడు. సీత అలా వెళ్లవలసి వచ్చినప్పుడు ఆమెను అనుసరిస్తూ త్రిజట విమానంలో వెళుతుంది. యుద్ధభూమిలో పడి ఉన్న సోదరులను చూసి సీతమనస్సు ఝల్లుమంటుంది. ఆ దృశ్యాన్ని చూసి తట్టుకోలేక సీత వెక్కి వెక్కి ఏడుస్తుంది. నా కేమిగతి? జ్యోతిష పండితులు నేను నా భర్తతో సార్వభౌమాధికారాన్ని పొందగలనని చెప్పిన మాటలన్నీ అసత్యాలేనా అనుకుంటూ ఆవేదన పడుతుంది. నా దౌర్భాగ్యమే ఈ స్థితికి కారణం. విధి ఎంత ఘోరమైనది నేను చేసేది ఏముంది. నేను జీవించడం ఎందుకు అంటూ శోకభారంతో విలవిలలాడుతుంది.

పరిస్థితిని గమనించింది త్రిజట. సీతకు తప్పక ధైర్యం చెప్పవలసిన సమయం అని గ్రహించింది. చల్లని మాటలతో అనునయిస్తూ ఆమెలో నిరాశానిస్పృహలు పోగొట్టాలి అని నిశ్చయించుకుంది.

అమ్మా! సీతమ్మా! అలా శోకించకమ్మా! నీ భర్త, ఆతని సోదరుడు ఎలా ఉన్నారో జాగ్రత్తగా పరిశీలించి చూడు. మృతుల ముఖాలు పాలిపోయి, కళావిహీనములుగా ఉంటాయి. వీరి ముఖాలు కాంతితో ఉన్నాయి. వీరు మృతి చెందలేదు. శోషవచ్చి అలా పడిఉన్నారు అంతే. వారి చుట్టూ వానరయోధులున్నారు. వారిలో విషాదంగాని, వ్యాకులత్వంగాని కనబడటంలేదు. పైగా దెబ్బకి దెబ్బకొట్టాలనే ఆవేశం ఉబికిపడుతోంది. సొమ్మసిల్లిన రామలక్ష్మణులు తేరుకుంటారనీ యుద్ధం ప్రారంభించాలనీ ఎదురుచూస్తున్నారు వానరులందరూ.

సీతా! నీకు మరొక రహస్యం చెపుతాను విను. మనం ఎక్కిన ఈ పుష్పకవిమానం దేవలోకానికి చెందింది. భర్తృవిహీనులను అది మోయదు. నన్ను నమ్ము. నేను చెప్పేది సత్యం. నేను ఇంతవరకు అబద్ధమనేది ఆడనేలేదు. ఇకముందు కూడా అసత్యం పలకను. అమ్మా! సీతమ్మా! నేను నిన్ను ఎంతో భక్తితో పూజిస్తున్నాను. ధర్మాన్ని వదలక

పాటించే నీ నడత, కళంకంలేని నీ శీలం, నాకు నీయందు భక్తి కలగడానికి కారణాలు. నేను చెప్తున్నాను విను నా మాట బోటుపోదు.

ఈ రామలక్ష్మణులు అజేయులు. వారిని ఎవరూ ఓడించలేరు. ఇంక చంపడం అనే ప్రశ్నేలేదు. ప్రియసఖీ! నన్ను నమ్ము. గుండెనిండా ధైర్యం తెచ్చుకో. వారు ఇంక కొద్దిసేపటిలో తేరుకుంటారు. ఇది జరుగుతుంది అంటూ త్రిజట అంత గట్టిగా చెప్తుంటే సీతకు నెమ్మదిగా ధైర్యం కలుగుతుంది. త్రిజట మాటలకు ఆమెలో ఆనందం మొలకలెత్తుతుంది. వెంటనే సీత రెండు చేతులూ జోడించి భగవంతునికి నమస్కరిస్తూ త్రిజటా! నీ పలుకులు సత్యమే అగు గాక! అంటూ ప్రార్థించింది. సీతలో కాస్త ధైర్యం పుంజుకోగానే పుష్పకవిమానం అశోకవనానికి బయలుదేరుతుంది.

ఇలా త్రిజట సీతకు రెండుసార్లు విషమపరిస్థితుల్లో ధైర్యం చెప్తుంది. మొదటిసారి కల కావచ్చు. ఆ కల అలా భావికథార్థసూచకంగా ఆమె దర్శించడం ఆమెలోని ధార్మికశక్తికి నిదర్శనం. రెండోసారిది ఆమెలో సీత ఎడల గల భక్తి కారణం. అదీగాక పుష్పకవిమానశక్తిని గురించిన పరిజ్ఞానం కారణం.

ఏమయినా రాక్షసజాతిలో పుట్టినా ధర్మమార్గావలంబియైన త్రిజట మహిళారత్నంగా నిలచింది.

* * *

## 25. సరమ

ధర్మానుష్ఠానపరుడైన విభీషణుని ధర్మపత్ని సరమ. విభీషణుడు రాముని శరణుకోరి ఆయన పక్షాన చేరాడు. రామునకు సహాయకారిగా ఉన్నాడు. అట్టి ఉత్తముని ఇల్లాలు సరమ.

లంకలో పదినెలలు చెఱలో ఉన్న సీతామాతకు సరమ తోడునీడై నిలిచింది. అశోకవనంలో ఉన్న సీత యోగక్షేమాలు ఎప్పటికప్పుడు కనుక్కుని తగువిధమైన సహకారం అందించే సహృదయురాలు సరమ.

రావణుడు సీతను తనదానిగా చేసుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసాడు. అందులో ఒకసారి యుద్ధప్రారంభంలో విద్యుజ్జిహ్వుడు అనే ప్రసిద్ధ మాంత్రికుని ద్వారా రాముని తల, విల్లు, అమ్ములకు దీటుగా కృత్రిమమైన వాటిని తయారుచేయించి సీతకు చూపించి రాముడు గాఢనిద్రలో ఉండగా సంహరింపబడ్డాడని చెప్పాడు. సీత ఆ మాయాజాలాన్ని చూసి నిర్ఘాంతపోయింది. రావణా! నా భర్తతో కలిసి అంతిమయాత్రకు అనుమతి ఇమ్మని వేడుకుంటుంది. అంతలో సేవకుడువచ్చి మంత్రులు సమావేశమై ప్రభువు దర్శనానికి ఎదురు చూస్తున్నారని చెప్తాడు.. రావణుడు వెంటనే వెళ్లిపోతాడు. అతడు వెళ్లగానే రాముని తల, బాణాలు, అమ్ములపొది మాయమైపోతాయి.

ఈ సంఘటనను సరమ కళ్లారచూచింది. సీతను మోసపుచ్చడానికి ప్రయోగించిన మాయ అని సరమ గ్రహించింది. సీతను సమీపించి –

వైదేహీ! భయపడకు, బెదరిపోకు తల్లీ. ధైర్యంగా ఉండు. శ్రీరాముడు నిక్షేపంగా సజీవుడై ఉన్నాడు. రాముని ఎవరు చంపగలరమ్మా? అది జరిగే పనికాదు. సత్యం, ధర్మం కలిసిన రూపం శ్రీరాముడు. రాముడు

ఏనాడూ ఒళ్లు తెలియని నిద్రలోకి జారుకోడు. ఆయన ప్రస్తుతం ఉన్నది శత్రురాజ్యంలో, యుద్ధభూమిలో కదా! శ్రీరాముడు ఈ స్థితిలో గాఢనిద్రలో ఉండడం అనేది నమ్మే మాటేనా. లక్ష్మణుడు ఏనాడైనా ఏక్షణమైనా అజాగ్రత్తగా ఉండడం విన్నావా. రామలక్ష్మణులు నిద్రిస్తూ ఉండగా చంపబడడం అనేది ఘోరమైన అబద్ధం. శ్రీరాముని ఎవరు చంపగలరమ్మా! చంపడం కాదు కదా కనీసం ఓడించడం కూడా సాధ్యంకాని పని. ఆయన బలపరాక్రమాలు అంచనా వేయడం ఎవరికి సాధ్యం. ఆయన నడవడిలో దోషంగాని, లోపంగాని ఎవరైనా చూపించగలరా. సత్యం, ధర్మం కలిసి శ్రీరాముని రూపంగా నిలచి ఉన్నాయి. నువ్వు నిశ్చింతగా ఉండు. రాముడు క్షేమంగా ఉన్నాడని నేను చెప్తున్నాను. నా మాట నమ్ము. లక్ష్మణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, వానరులు, భల్లూక యోధులూ కలసి లంకమీదకు దండెత్తి వస్తున్నారు. నీకు వానరుల యుద్ధభేరీనినాదాలు వినబడడం లేదా? జాగ్రత్తగా విను. రాక్షసుల్ని యుద్ధభూమికి రండని పిలుస్తున్నాయి ఆ భేరీలు.

సీతా! రావణుడు నీతో ఏదో చెప్పి, మరేదో చూపించి నీ మనస్సును తనవైపు త్రిప్పుకోవాలని అనేక ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆ ప్రయత్నాలలో భాగమే ఈ మాయానాటకం. తన మాయతో రాముని తల నరికివేయబడినట్లు నీకు చూపించి నిన్ను దుఃఖపెట్టాలని చూసాడు.

మీ ఇద్దరికీ కనబడకుండా మీ సంభాషణ అంతా నేను చెవులారా విన్నాను. నేను గట్టి విశ్వాసంతో చెప్తున్నాను విను. రాముడు తప్పకుండా విరోధుల్ని చీల్చి చెండాడి రావణుని సంహరించి విజయరామునిగా నీ చెంతకు వస్తాడు. పాము కుబుసాన్ని విడిచిపెట్టినట్లు నువ్వు త్వరలోనే నీలో పొంగి పొరలుతున్న దుఃఖపు తెరలను తొలగించుకుని నీ స్వామి

అయిన శ్రీరాముని అక్కున చేరుతావు. ఆయన వక్షస్థలాన్ని నీ ఆనందభాష్పాలతో అభిషేకిస్తావు. నేను చెప్పేది అక్షరాలా నిజం. సందేహించనే వద్దు. సీతమ్మా! నువ్వు ఇప్పుడే సూర్యభగవానుని ప్రార్థించు. తన ప్రవేశంతో ప్రపంచాన్నంతటినీ ప్రకాశింపచేస్తూ, ఆనందాన్ని విరజిమ్ముతూ ఉండే ప్రజ్ఞానిధి ఆయనే కదా! అని సీతకు కర్తవ్యాన్ని కూడా చెప్పి అనునయించి ధైర్యాన్ని కలుగజేస్తుంది సరమ.

సీతను సంతోషంగా ఉంచడానికి సరమ నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటుంది. సీతను ఊరడించడానికి సరమ 'అమ్మా! నాకు ఆకాశంలో వాయువేగంతో సంచరించే శక్తి ఉంది. నేను ఎవరికీ కనబడకుండా వెళ్లి రాముణ్ణి కలుసుకుని నీ క్షేమసమాచారాలు చెప్పి వస్తాను' అంటుంది. సీత పట్టరాని ఆనందంతో సరమ మంచితనానికి తనయందు ఆమె చూపిస్తున్న సానుభూతికి మురిసిపోయి సరమకు ధన్యవాదాలు అర్పిస్తుంది. ఆ తరువాత ఆమెను ఒక ఉపకారం చేసిపెట్టమని వేడుకుంటుంది. 'సరమా! చూస్తున్నావుగా. నన్ను రావణుడు స్వేచ్ఛగా బ్రతకనిచ్చేలా లేడు. నాకు చాలా భయంగా ఉంది. ఏ క్షణాన ఏ విపత్తు తెచ్చి పెడతాడో ఏమో? కాబట్టి నువ్వు చేయవలసినది రావణుడు నా గురించి ఎలాంటి కుట్రలు, క్రూరపన్నాగాలు, ప్రయోగాలు రహస్యంగా పన్నుతున్నాడో వాటి సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నాకు చెప్తూ ఉండు. నా ఆందోళన నీకు తెలుసు కదా! అందుకే ఇలా అడుగుతున్నాను. నువ్వు నన్ను తప్పకుండా అర్థం చేసుకోగలవు' అంది. వెంటనే సరమ ఓ అదెంతపని? ఇట్టే నెరవేరుస్తాను అని ధీమాగా పలుకుతుంది. సీత కన్నీళ్లను ఆప్యాయంగా తుడిచి, ధైర్యంగా ఉండు. రావణుని మంత్రాంగాల వర్తమానం తృటిలో సేకరించుకుని వస్తాను అంటుంది.

సరమ రావణుని సమావేశమందిరంలోకి రహస్యంగా ప్రవేశిస్తుంది. అక్కడి విషయాలన్నీ గమనిస్తుంది. సీతదగ్గరకు వచ్చి ఆ సమావేశంలో తాను కన్నది, విన్నది ఉన్నది ఉన్నట్లుగా సర్వమూ వివరిస్తుంది. చివరలో తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్తుంది. తల్లీ! సీతాదేవీ! రావణుడు తాను జీవించి ఉండగా నిన్ను రామునికి సమర్పించే ఉద్దేశమే లేదు. వాడు క్రూరుడు. అతడు మరణిస్తే గాని నీకు స్వేచ్ఛ అనేది రాదు. అలా అని కంగారుపడకు. నేను చెప్పేది శ్రద్ధగా విను. నా మాట ఏనాడు జరగకుండా ఉండదు. శ్రీరాముడు రావణుని తప్పక సంహరిస్తాడు. నిన్ను గౌరవంగా అయోధ్యకు తీసుకువెళతాడు. ఆ ఘనవిజయాన్ని చూసి నువ్వు ఆనందభరితురాలవు అవుతావు. ఆ విజయం తప్పక సిద్ధిస్తుంది అని, నీ అందమైన నల్లని కళ్లు చెప్తున్నాయి. ఆ మంచి రోజులు అతి త్వరలో రానున్నవి. ఆందోళనపడకు అని ఉత్సాహపూరితమైన మాటలతో సరమ సీతకు గుండె నిండా ధైర్యం నింపుతుంది. నిరాశానిస్పృహలతో కూడిన ఊబిలో పడిపోకుండా రక్షిస్తుంది. భరించరాని ఆందోళనతో నిరాశతో ఆత్మహత్యాప్రయత్నం చేయబోయే సీతకు జీవితం మీద ఆశ కలిగించిన ధైర్యశాలిని సరమ. లంకలో ఏ తోడూ లేని సీతకు తోడునీడై నిలిచిన స్నేహశీలి సరమ.

సరమ సాధ్వీశిరోమణి సరసహృదయ.

* * *

# 26. మండోదరి

రామాయణంలో ప్రతినాయకుడైన రావణాసురుని పట్టమహిషి మండోదరి. మయుని పుత్రిక. ఇంద్రుణ్ణి జయించి ఇంద్రజిత్తుగా బిరుదనామం పొందిన మేఘనాదునికి, అక్షకుమారునికి కన్నతల్లి. మహాసౌందర్యరాశి. రామతత్త్వాన్ని గుర్తించిన రమణీమణి. భర్తకు ఎన్నో విధాల హితవుచెప్పిన ఇంగితజ్ఞురాలు.

సుందరకాండలో రావణుని అంతఃపురంలో హనుమ సీతకోసం అన్వేషిస్తూ నిద్రాముద్రిత అయిన మండోదరిని చూస్తాడు. ఆమెలోని ఠీవిని, పవిత్రమైన తేజస్సుని, సౌందర్యాన్ని చూసి సీతాదేవి కాదు కదా ఈమె అని క్షణకాలం ఆలోచనలో పడతాడు. అంటే మండోదరి సౌందర్య విషయంలో సీతను తలపించిన మగువ అన్నమాట. అంతేకాదు ఆమె జీవితాన్ని పరిశీలిస్తే పతివ్రత అని కూడా తెలియవస్తుంది.

వాల్మీకిరామాయణంలో మండోదరి రావణవధానంతరం యుద్ధభూమికి వచ్చి రావణుని మృతదేహాన్ని చూచి దుఃఖంతో విలపిస్తుంది. ఆ సన్నివేశంలో ఆమె మాట్లాడిన మాటలే ఆమె వ్యక్తిత్వాన్ని, శీలాన్ని వ్యక్తపరుస్తాయి. ఈ ఒక్క సన్నివేశమే మండోదరిని గురించి తెలుసుకునే అవకాశాన్ని కలగజేస్తుంది.

రావణుని సంబోధిస్తూ మండోదరి పలికిన మాటలు సత్యసమ్మతాలే కాదు, హృదయవిదారకములు కూడా. "మహాభాగా! కుబేరుని సోదరా! నీ ఎదుట ఇంద్రుడు కూడా నిలువలేడు కదా! ఈనాడు యుద్ధంలో ఒక మానవమాత్రుని చేత ఓడిపోవడం ఎంతో వింతగా ఉంది నాకు. రాముడు రావణుని యుద్ధభూమిలో చంపాడు అనే మాట నేను నమ్మలేక పోతున్నాను. బహుశా రాముడు మానవుడు కాదేమో! ఆనాడు

జనస్థానంలో పదునాలుగు వేలమంది రాక్షసులతో యుద్ధంచేసి నీ సోదరుడైన ఖరుణ్ణి చంపినవాడు మానవుడు ఎట్లా అవుతాడు. దేవతలక్కూడా ప్రవేశించరాని లంకాపట్టణంలోనికి ఒక సామాన్య వానరం హనుమ ప్రవేశించడం ఎంత వింత? అది చూచి మేము ఎంతో భయపడ్డాము. వానరులు శ్రీరాముని ఆజ్ఞతో మహాసముద్రము మీద సేతువు కట్టారని విన్నప్పుడే నా గుండెలు అదిరాయి. ఆనాడే రాముడు మానవుడు కాడని నిశ్చయించుకున్నాను. రాముని రూపంలో మృత్యువే నిన్ను చంపడానికి వచ్చి ఉంటుంది. నాకు ఈ రాముడు సాక్షాత్తూ శంఖ, చక్ర, గదాధరుడయిన శ్రీమహావిష్ణువే అని రూఢి అయింది.

**మానుషం వపురాస్థాయ విష్ణుస్సత్యపరాక్రమః**
**సర్వైః పరివృతో దేవై ర్వానరత్వముపాగతైః ॥ (యుద్ధ.14.16)**

సత్యపరాక్రముడైన విష్ణువే మానవరూపంతో వచ్చాడు. అతని చుట్టూ ఉన్న వానరులందరూ వివిధ దేవతలే. లేకపోతే మానవుని చేతిలో నీవు మరణించడమేమిటి? స్వామీ! సంవత్సరాల తరబడి నువ్వు ఇంద్రియాలను జయించి ఘోరమైన తపస్సు చేసావు. అప్పుడు నువ్వు ముల్లోకాలకి నాథుడవయ్యేవు. చిరకాలం అణగదొక్కబడిన ఇంద్రియాలన్నీ కలసి రహస్యంగా ఆలోచించి వాటి ప్రలోభాలకు నిన్ను దాసుణ్ణి చేసాయి. నీ మీద పగతీర్చుకున్నాయి. నువ్వు స్త్రీమోహానికి దాసుడవైపోయావు. అంతేకాదు రామునితో విరోధం వద్దని నేను ఎంతగా చెప్పినా విన్నావుకాదు. నిష్కారణంగా సీత మీద కామం కలిగి ఆమెను పొందాలనుకున్నావు. నీ బంధుకోటి, నీ ఐశ్వర్యం సర్వనాశనమయ్యాయి.

సీత అంటే ఎవరో గ్రహించలేకపోయావు. ఆమె పతివ్రతలలో అరుంధతితో, రోహిణితో సమానురాలా, లేక అధికురాలా అనేలా ప్రకాశిస్తోంది. అలాంటి సీతాదేవిని బాధించావు. కూడని పనిచేసావు. ఆమె భూదేవికి భూదేవి, శ్రీదేవికి శ్రీదేవి. భర్తయందు భక్తి కలిగినట్టి

భార్య! అట్టి మహాత్మురాలిని అరణ్యంలో ఎవరూ లేనివేళలో మోసంతో బలవంతంగా ఎత్తుకొనివచ్చావు. ఆమె పాతివ్రత్యప్రభావం వల్ల తపశ్శక్తి వల్ల నువ్వు ఆనాడే దహింపబడ్డావు. కాకపోతే సీత ఓర్చుకుని ఇప్పటివరకు బ్రతికించింది.. నీ కర్మఫలం అనుభవించేవరకు ఓపికపట్టింది.

ప్రభూ! సీత నాకంటే కులంచేతగానీ, అందంచేత గానీ, ప్రేమచేత గానీ అధికురాలు కాదు. అయినా ఆమెను కామించి మృత్యువును తెచ్చుకున్నావు. సీతను గౌరవప్రదంగా రామునికి సమర్పించమని, నా మాతామహుడు మాల్యవంతుడు, నీ తమ్ముడు విభీషణుడు చెప్పిన హితవును చెవిని పెట్టావుగావు అంటూ విలపిస్తుంది.

సీతమ్మను రామునికి ఇచ్చెయ్యమని మండోదరి చెప్పినట్లు స్పష్టమయింది. అంతేకాదు రామునితో స్నేహం చేయమని కూడా చెప్పింది. ఆమె మాటలు రావణుడు వినలేదు. ఎంతచెప్పినా వినకపోయేసరికి చేయగలిగేది లేక మిన్నకుంది మండోదరి. ఆమె వీరపత్ని, వీరమాత, రాముని మహత్త్వమే కాదు సీతమహత్త్వాన్ని గుర్తించిన మహనీయురాలు మండోదరి.

శ్రీరాముడు శ్రీమహావిష్ణువు అవతారమని తెలుసుకున్నవారు రాక్షసులలో ముగ్గురున్నారు. మారీచుడు, విభీషణుడు, మండోదరి. రామాయణంలో రామతత్త్వాన్ని ఎఱిగిన రమణులు ముగ్గురు.

అయోధ్యకాండలో – సుమిత్ర రాముడు సర్వజగత్కారణమైన బ్రహ్మతత్త్వమే అని

కిష్కింధకాండలో – తార 'సర్వజగత్కారణమగు బ్రహ్మయే!' రాముడు అనీ

యుద్ధకాండలో – మండోదరి 'పరాస్య శక్తిః వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ" – అనీ

రాముడు మహాయోగి, స్వాభావికముగ జ్ఞానశక్తిసంపన్నుడు అని చెప్తారు.

ఇక్కడ మండోదరి గురించి మరో విషయం చెప్పుకోవాలి. అహల్యా ద్రౌపదీ సీతా తారా మండోదరీ' అని పంచ కన్యలను పతివ్రతలుగ పేర్కొన్నారు ఆర్యులు. సీతతో పాటు మండోదరి కూడా పతివ్రతల సరసన స్థానం పొందింది. ఆమె నోట ఒక్క పరుషవాక్కు కూడా రాలేదు. భర్తను మందలించవలసిన సమయంలో మందలించింది. అయితే ఆ భర్త వినలేదు. తార కూడా వాలికి హితవు చెప్పినా వాలి వినలేదు. రాముని చేతిలో మరణించాడు. రావణునికి కూడా అదేగతి పట్టింది.

మండోదరిపాత్రను వాల్మీకి మహనీయంగా చిత్రించాడు. ఆమె రావణునితో ఏం చెప్పిందో ఎలా చెప్పిందో మన ఊహకే వదలిపెట్టాడు. దీనాలాపాల దీపపు వెలుగులో ఆమె పాత్రను దర్శింపచేసాడు. నేలపై పడిన పతివ్రత కన్నీళ్లు వృథాపోవు అన్న మాట ఒక్కటి చాలు మండోదరి విజ్ఞానఖని అని గుర్తించడానికి.

సౌందర్యం, సమ్మోహనత్వం, విశ్వాసం, భక్తి, సౌజన్యం, సహనం, స్థైర్యం వంటి ఉత్తమ గుణాలు మండోదరిని వరించాయి. ఆమె అందరి గౌరవాన్ని ప్రేమను చూరగొన్న మహారాణి. పతివ్రత. మహాభాగ. రాక్షసత్వం లేని రాక్షసరమణి. అక్షకుమారుడు ఇంద్రజిత్తువంటి మహా వీరుల్ని కన్న తల్లి. ఒక ప్రత్యేకమైన కాంతితో ప్రకాశించే వీరమాత.

* * *